నేతాజీ సుభాష్ చంద్రబోస్
రూ॥70/-
పేజీలు:68

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

‘గేమ్ ఛేంజర్’ స్పెషల్ షోలకు అనుమతులు రద్దు
ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రపంచానికి ప్రమాదకారిగా పచ్చి మితవాదం

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 45 | ఆదివారం | 12-01-2025 | కరీంనగర్   Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar   పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## కొత్త ఉస్మానియా ఆసుపత్రికి
# 31లోపు శంకుస్థాపన

అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి

పోలీస్‌శాఖ పరిధిలో ఉన్న గోషామహల్ స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖకు బదిలీ చేయాలి

కార్పొరేట్‌కు దీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించేందుకు ప్రణాళికలు

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజైన్లు

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణ పనులకు ఈ నెలాఖరులోపు శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న గోషామహల్ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని, రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియను, ఇతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సిఎం సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులపైన జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో

తరువాయి 2లో

# ఒత్తిడికి తలొగ్గేది లేదు

మద్యం సరఫరాకు ముందుకువచ్చే కంపెనీల ఎంపికలో పారదర్శకత

ధరల నిర్ణయ కమిటీ ఆధారంగా పెంపుపై నిర్ణయం



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మద్యం సరఫరా చేసేందుకు ముందుకొచ్చే కంపెనీలను ఎంపిక చేసేందుకు పారదర్శక విధానాన్ని పాటించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టిజిబిసిఎల్‌కు సరఫరా చేస్తున్న కంపెనీలు, కొత్త బ్రాండ్లను సరఫరా

తరువాయి 2లో

ఆదివాసీ గృహాలకు
## ఉచితంగా సోలార్ విద్యుత్, పంపుసెట్లు

ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలలు, భవనాలపై సోలార్ విద్యుత్‌ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ఆవిష్కరణ

12




‘ఒకే దేశం – ఒకే ఎన్నిక’తో దేశంలో
# నియంత పాలన

అందుకు కేంద్రంలోని బిజెపి సర్కార్ వడివడిగా యత్నాలు

అడ్డుకునేందుకు ఉద్యమాలకు సంసిద్ధం కావాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా

ప్రజాపక్షం/ హైదరాబాద్



‘ఒకే దేశం–ఒకే ఎన్నిక’ విధానాన్ని తీసుకురావడం ద్వారా దేశంలో నియంత పాలనను తీసుకువచ్చేందుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసిందని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో గెలిచేందుకు బిజెపి కూటమికి ధనబలంతో పాటు, ఇండియా కూటమి అనైక్యత కూడా తోడైందని తెలిపారు.దీంతో బిజెపి విజయం సులభమైందని చెప్పారు. దేశానికి వెన్నెముక అయిన రైతుల ఉద్యమం ఢిల్లీ వేదికగా నేటికీ కొనసాగుతోందని, ఈ ఉద్యమానికి సంఘీభావంగా రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున పోరాటాలను నిర్వర్తించాలని సూచించారు. హైదరాబాద్ నాగోల్ బండ్లగూడలోని గిరిప్రసాద్ భవన్‌లో శుక్రవారం నాడు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ హాజరయ్యారు. ఈ సమావేశంలో సిపిఐ శతాబ్ది వేడుకలు, జాతీయ మహాసభలు, స్థానిక సంస్థల ఎన్నికలు,

తరువాయి 2లో



# ప్రాణాలు తీసిన జలకాలాట

కొండపోచమ్మ ప్రాజెక్టులో ఐదుగురి యువకులు గల్లంతు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి

బాధితులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : కూనంనేని

ప్రజాపక్షం/గజ్వేల్/హైదరాబాద్

సిద్దిపేట జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ములుగు మండలం మర్కూక్ శివారు కొండపోచమ్మ జలాశయంలోకి ఈతకు వెళ్లిన ఐదుగురు యువకులు జలసమాధి అయ్యారు. వివరాల్లోకి వెళితే... సంక్రాంతి పండుగకు సెలవులు రావడంతో సరదా కోసం హైదరాబాద్, ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు శనివారం జలాశయం వద్దకు వచ్చారు. జలాశయంలోకి దిగి సరదాగా కొద్దిసేపు ఆటలాడారు. ఈనేపథ్యంలో జలాశయంలో లోతుగా ఉన్న గుంతను గమనించకపోవడంతో

తరువాయి 2లో

## 13 నుంచి 15 వరకు
# పతంగుల పండుగ

అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి జూపల్లి





ప్రజాపక్షం/హైదరాబాద్

అంతర్జాతీయ వేడుకకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. సంక్రాంతి పండగ సందర్భంగా ఈనెల 13, 14, 15వ తేదీ వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో 7వ అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ సందర్భంగా బేగంపేట్ హరిత ప్లాజాలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటర్నేషనల్ కైట్, స్వీట్ ఫెస్టివల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంతకుముందు స్వీట్ స్టాల్స్‌ను మంత్రి సందర్శించి, వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు తమ ఇంట్లోనే తయారు చేసిన సాంప్రదాయ మిఠాయిలు రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ మినీ ఇండియా అని, దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలతో పాటు ఇతర దేశాల నుంచి సందర్శకులు కూడా ఉంటుండడంతో కాస్మోపాలిటన్ సిటీగా మారిందన్నారు. మూడురోజుల పాటు జరిగే

తరువాయి 2లో



# పల్లెకు వెళ్తోన్న పట్నం

- సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్తున్న నగరవాసులు
- వాహనాలతో క్రిక్కిరిసిన రహదారులు
- ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు

ప్రజాపక్షం/హైదరాబాద్



పట్నం పల్లెకు ప్రయాణమైంది. నగరవాసులంతా పల్లెబాట పట్టారు. నగరంలో స్థిరపడిన పల్లెజనంతో పాటు ఎపి ప్రజలు సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు ప్రయాణం కావడంతో శనివారం జాతీయ రహదారులన్నీ ప్రయాణికులతో క్రిక్కిరిసి పోయాయి. దీంతో హైదరాబాద్ నగర రహదారులన్నీ బోసి పోగా జాతీయ రహదారులన్ని వాహనాలతో చీమల దండును తలపించాయి.
సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. పండక్కి సొంతూరు వెళ్లేందుకు జనం పోటెత్తడంతో ప్రయాణ ప్రాంగణాలు కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి పల్లెలకు ప్రజలు భారీగా కదలివెళ్తున్నారు. సికింద్రాబాద్, జెబిఎస్, ఎంజిబిఎస్, కూకట్‌పల్లి,

తరువాయి 2లో

మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు
# ‘నగదు’ హామీలు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ మహిళా ఓటర్ల చుట్టూ ఎన్నికల ప్రచారం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు కీలకంగా మారారు. వారు మొగ్గుచూపే పార్టీకే విజయావకాశాలు పెరుగుతాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు మహిళలను ఆకట్టుకునేందుకు పలు రకాల పథకాలను ప్రకటిస్తున్నారు. అందులో భాగంగా మహిళలకు ప్రతి నెలా ఆర్థికసాయాన్ని అందించే పథకాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, బిజెపిలు పోటీ పడి మరీ ప్రకటించాయి. పథకాల పేర్లు వేరు కావచ్చు కానీ వాటన్నింటి లక్ష్యం మాత్రం ఒక్కటే. ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన కింద మహిళలకు ప్రతినెలా రూ.2,100 అందిస్తామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్

తరువాయి 12లో

**పార్టీల వాగ్దానాలు**
ఆప్ : రూ.2100
కాంగ్రెస్ : రూ.2500
బిజెపి : రూ.2500

## మద్యం విధానంలో
# ఆప్‌కు ముడుపులు

ఢిల్లీ ఎన్నికలవేళ బయటకు పొక్కిన కాగ్ నివేదిక

లైసెన్సుల జారీలో విధాన ఉల్లంఘనలు

సర్కారు ఖజానాకు రూ.2,026 కోట్లు నష్టం




**ఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలకు రాజకీయపార్టీలు ప్రచారం జోరందుకున్న తరుణంలో కాగ్ (కంప్ట్రోలర్ ఆండ్ ఆడిటర్ జనరల్) నివేదిక బయటకు పొక్కింది. ఢిల్లీ మద్యం విధానంవల్ల ఆ రాష్ట్ర ప్రభుత్వ కోశాగారానికి రూ.2,026 కోట్లు నష్టం వాటిల్లిందనీ, అధికార ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్)కు ముడుపులు ముట్టాయని బయటకు పొక్కిన కాగ్ నివేదికలో హైలైట్స్ పేర్కొన్నాయి! ప్రత్యేకించి ‘‘ఇండియా టుడే’’ ఈ కాగ్ నివేదికను చేజిక్కించుకుని ప్రచురించింది. వేలంపాటలో పాల్గొన్న వారి ఆర్థిక పరిస్థితులను పరిశీలించకుండా వారికి లైసెన్సులు మంజూరు చేశారని, దీనివల్ల నష్టం కలిగిందని, ఉల్లంఘనలకు పాల్పడినవారికి ఎలాంటి జరిమానాలు విధించలేదని పేర్కొంది. కాగ్ నివేదికను ఇంకా ఢిల్లీ అసెంబ్లీ ముందుకు రాలేదు. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత ఈ నివేదిక అసెంబ్లీలో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.
నిపుణులు చేసిన సిఫార్సులను ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా (2015 –2023) పెడచెవినపెట్టి విధాన ఉల్లంఘనలకు

తరువాయి 2లో

# పూర్తికాని రుణమాఫీ

కష్టాల సాగు – ఆందోళనలో రైతులు



ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

వానాకాలం పంట సాగు ముగియడంతో సూర్యాపేట జిల్లా రైతాంగం యాసంగి పంట సాగులో నిమగ్నమయ్యారు. నీటి వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతల్లో ముందుగానే గత నెల రోజుల క్రితమే వరి నాట్లు వేయగా నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధితో పాటు మూసీ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల కాల్వల కింద రైతులు ముమ్మరంగా వరి సాగు చేస్తున్నారు. ఆరుతడి పంటలైన వేరుశనగ, జొన్న పంటలను సైతం రైతులు సాగు చేస్తున్నారు. రైతులు గత వానాకాలం పంటను అమ్ముకున్నా అవి గతంలో వడ్డీ వ్యాపారుల

తరువాయి 12లో

# మతోన్మాద దాడులపై బంగ్లాదేశ్ కొరడా

## బాధితులకు పరిహారం,ఫిర్యాదులకు వాట్సాప్ గ్రూప్






**ఢాకా :** బంగ్లాదేశ్‌లో ఇటీవల వరుసగా మైనారిటీ మతస్థులపై జరుగుతున్న దాడులపై ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ విధమైన మతోన్మాద దాడులను సహించేదిలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహ్మద్ యూనస్ డిప్యూటీ ప్రెస్ సెక్రెటరీ అబ్దుల్ కలామ్ ఆజాద్ మజుందార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ దాడుల్లో బాధితులకు నష్టపరిహారం ఇస్తామని, అన్ని రకాల సంబంధిత ఆరోపణలు తీసుకోవడానికి పోలీసులు నేషనల్ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారని ఆయన పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన వారిని అరెస్టులు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు ప్రకటించారు. మతం పేరుతో దాడులు, హింసకు పాల్పడితే ఫిర్యాదులు తీసుకోవడానికి వీలుగా ఒక వాట్సాప్‌ను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఆ నెంబర్లను ప్రజలకు సమకూర్చింది. నేషనల్ పోలీస్, ఎమర్జెన్సీ సర్వీస్ 999 నెంబరును ప్రధానమైన ఫోన్ నెంబరుగా ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా మతోన్మాద దాడులలో నష్టపోయినవారికి పరిహారం కూడా చెల్లిస్తామని మజుందార్ చెప్పారు. ఈ ఏడాది చివరిలో, లేదా వచ్చే ఏడాది బంగ్లాదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నది. మతోన్మాదంతో దాడులు చేసే నేరస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని, వారిని అరెస్టు చేసి శిక్షిస్తామన్నారు. గడచిన ఆగస్టు నెల నుండీ ఇప్పటివరకూ ఈ విధమైన నేరాలకు పాల్పడిన 113 మందిని అరెస్టుచేసినట్లు కూడా పేర్కొన్నారు. జాతి, మతతాల, స్త్రీ పురుష వయోభేదాలకు అతీతంగా బంగ్లాదేశ్‌లో పౌరులు అందరికీ భద్రత ఇవ్వడం, వారి మానవ హక్కులను కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు.

**మైనారిటీ మతాలపై 1,769 దాడులు**

బంగ్లాదేశ్‌లో మైనారిటీ మతస్థులపై ఇప్పటివరకూ 1,769 దాడులు జరిగాయని హిందూ, బుద్ధిస్ట్, క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ దాడులన్నీ విద్వేషంతో చేశారని, ఉద్దేశపూర్వక దాడులు చేశారని కౌన్సిల్ ప్రకటించింది. అనేక పవిత్ర ఆలయ ప్రదేశాలను, విగ్రహాలను ధ్వంసం చేశారని, మైనారిటీల ఇళ్ళపై కూడా దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. ఈ దాడులపై ఒక దశలో భారత్ సహా ప్రపంచదేశాలన్నీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. మైనారిటీ మతస్థులపై దాడులు చేశారని, ప్రాణాలు బలిగొన్నారని, వారి ఇళ్ళను, ఆస్తులను దోచుకున్నారని, ఈ విధమైన ఘటనలు దేశంలో 2,010 జరిగాయని కౌన్సిల్ పేర్కొంది. కాగా ఈ కౌన్సిల్ చేసిన ఆరోపణలను బంగ్లాదేశ్ పోలీసులు సేకరించారు. వీటన్నిటినీ ఒక జాబితా రూపొందించారు. వీటిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు. కౌన్సిల్ చేసిన ఫిర్యాదులకు అనుగుణంగా బాధిత కుటుంబాలను పోలీసులు కలుస్తారని, పరిశీలన చేస్తారని, వాస్తవాలను తనిఖీ చేస్తారని కూడా మహ్మద్ యూనస్ ప్రభుత్వం తన తాజా ప్రకటనలో తెలియజేసింది. ఇప్పటికే పోలీసులు 62 కేసులు నమోదు చేశారు, 35 మందిని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో 1,234 దాడులు రాజకీయ దురుద్దేశంతో చేసినవేనని, 20 కేసులు మతోన్మాదానికి సంబంధించినవని పోలీసు నివేదికను ఉటంకిస్తూ మహ్మద్ యూనస్ ప్రెస్ సెక్రెటరీ మజుందార్ చెప్పారు. కాగా ఇందులో 161 తప్పుడు ఫిర్యాదులు ఉన్నాయని, వీటిని మతోన్మాద దాడులుగా చిత్రీకరించారన్నారు.

# రష్యా ఆయిల్–గ్యాస్ కంపెనీలపై బైడెన్ ఆంక్షలు

## అమెరికాలో పెరిగిన చమురు ధరలు




**వాషింగ్టన్ :** రష్యా ఆయిల్, గ్యాస్ కంపెనీలే లక్ష్యంగా అమెరికా శనివారం నాడు విస్తారమైన ఆంక్షలు విధించింది. రష్యాకు వస్తున్న చమురు, గ్యాస్ ఆదాయాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ ఆంక్షలను విధించింది. దీనివల్ల రష్యా ప్రభుత్వానికి నెలకు బిలియన్ల డాలర్ల మేరకు నష్టం వాటిల్లనున్నది. మరో వారం రోజుల్లో పదవి నుండి వైదొలగుతున్న జో బైడెన్ ప్రభుత్వం ఈ ఆంక్షలు విధించింది. ఐతే రష్యాపై విధించిన ఈ ఆంక్షల వల్ల అమెరికాలో చమురు ధరలు పెరిగాయని బైడెన్ అంగీకరించారు. మూడు నుండి నాలుగు సెంట్ల వరకూ చమురు, గ్యాస్ ధరలు అమెరికాలో పెరిగాయని ఆయన పత్రికాగోష్ఠిలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఉక్రేన్‌లో జెలెన్‌స్కీ ప్రభుత్వానికి మేలు చేసేందుకు దాంతోపాటు రాబోయే ట్రంప్ ప్రభుత్వం వ్లాదిమీర్ పుతిన్‌తో ముఖాముఖీ చర్చల్లో బేరసారాలతో లాభం పొందడానికి ఈ ఆంక్షలు బాగా ఉపయోగపడతాయి. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా దాడులు ప్రారంభించినప్పటినుండీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న రష్యా ఆస్తులను స్తంభింపజేయడంతోపాటు ఇప్పటివరకూ రష్యాపై అమెరికా అనేక రకాల ఆంక్షలు అమలు చేసినప్పటికీ పుతిన్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నిలదొక్కుకుంది. ఇతర మార్గాలలో రష్యా చమురునే యూరప్ దేశాలు కూడా శుద్ధిచేయించి తీసుకుంటున్నాయి. పుతిన్ తనతో మాట్లాడాలనుకుంటున్నారనీ, ఆయనతో ఒక సమావేశం జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈనెల 10వ తేదీన డోనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన తర్వాత బైడెన్ ప్రభుత్వం రష్యా చమురు కంపెనీలపై విస్తారమైన ఆంక్షలు విధిస్తూ ప్రకటన చేయడం గమనార్హం. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా జో బైడెన్ చర్యలపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ చర్య రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆయన హర్షం ప్రకటించారు. కాగా ఉక్రేన్‌పై పుతిన్ చేస్తున్న యుద్ధానికి సంబంధించి అతిపెద్ద వనరులను తాము దెబ్బతీసే విధంగా ఈ ఆంక్షలు విధించామని వైట్‌హౌస్‌లో అగ్రశ్రేణి ఎకనామిక్–నేషనల్ అడ్వైజర్ దలీప్ సింగ్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా పదవి నుండి వైదొలగుతున్న జో బైడెన్ సోమవారంనాడు వీడ్కోలు ప్రసంగం చేయనున్నారు. ట్రంప్ పరిపాలన తర్వాత అమెరికా ఎంతో మెరుగుపడిందని, విదేశీ వ్యవహారాలను తాము చక్కబెట్టామని వీడ్కోలు సందేశంలో చెప్పేందుకు ఆయన సిద్ధపడుతున్నారు.

# గేమ్ ఛేంజర్ సినిమా స్పెషల్ షోలకు.. అనుమతులు రద్దు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గేమ్ ఛేంజర్ సినిమాకు ప్రత్యేక షోల ప్రదర్శన, టికెట్ ధరల పెంపు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. టికెట్ ధరల పెంపు విషయంలో గేమ్ ఛేంజర్ సినిమాకు ఇచ్చిన వెసులుబాటు ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు గేమ్ ఛేంజర్ టికెట్ ధరలు, అదనపు షోలకు ఇచ్చిన అనుమతిని వెనక్కి తీసుకుంది. రాష్ట్రంలో ఇక నుంచి తెల్లవారుజామున ప్రత్యేక షోలకు అనుమతి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా సినిమాల ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వబోమని ఉత్తర్వుల్లో తెలిపింది. గేమ్ ఛేంజర్ టిక్కెట్ ధరల పెంపు, ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బెనిఫిట్ షోలను రద్దు చేశామని చెప్పి, ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడమేమిటని ప్రశ్నించింది. ప్రత్యేక షోలకు అనుమతి ఇవ్వడంపై పునరాలోచన చేయాలని సూచించింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. భారీ బడ్జెట్‌తో సినిమాలు తీసి ప్రేక్షకుల నుంచి వసూలు చేసుకోవడం సరికాదని వ్యాఖ్యానించింది. ప్రేక్షకుల భద్రతను దృష్టిలో పెట్టుకొని, బెనిఫిట్ షోలు, ప్రత్యేక షోలకు అనుమతులు ఇవ్వవద్దని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు శంకర్ గేమ్ ఛేంజర్‌ను తెరకెక్కించారు. చిత్ర బృందం విజ్ఞప్తి మేరకు సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సినిమా విడుదల రోజైన శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి ఆరు షోలకు అనుమతినిచ్చింది. విడుదల రోజు సింగిల్ స్క్రీన్‌లో అదనంగా రూ.100, మల్టీప్లెక్సుల్లో రూ.150 పెంచుకునేందుకు, ఈనెల 11 నుంచి 19 వరకు 5 షోలకు సింగిల్ స్క్రీన్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.50 పెంచుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకుంది.




# ఆగని కార్చిచ్చు – చెలరేగిన దోపిడీ దొంగలు

## 21వేల ఎకరాల్లో నిర్మాణాలు బుగ్గిపాలు
## కాలిఫోర్నియా యూనివర్సిటీకి ముప్పు?
## నీటి కొరతపై దర్యాప్తు





**లాస్‌ఏంజెల్స్ :** కాలిఫోర్నియా లాస్ ఏంజెల్స్‌లో గడచిన మంగళవారం సాయంత్రం (జనవరి 7) ప్రారంభమైన దావానలం ఉద్ధృతి ఏమాత్రం ఆగలేదు. మొత్తం ఆరు ప్రాంతాలలో దావానలం చెలరేగి నిర్మాణాలను ఆహుతి చేస్తోంది. పైగా కొత్త ప్రాంతాలకు విస్తరించింది. మృతులసంఖ్య 11కు పెరిగింది. అమెరికాలో రెండవ అతిపెద్ద నగరం లాస్ ఏంజెల్స్. విలాసవంతమైన భవనాలున్న సంపద్వంతమైన నగరం శ్మశానవాటికగా మారుతోంది. ఒకవైపు మంటలు విస్తరిస్తుంటే ఇంకోవైపు దోపిడీదారులు ఇళ్ళల్లోకి జొరబడి దొంగతనాలు చేస్తున్నారు. వీటిని అరికట్టేందుకు అధికారులు కర్ఫ్యూ విధించారు. మరోవైపు టిక్‌టాక్ సహా పలు సంస్థలు, ప్రముఖులు విరాళాలు సేకరిస్తున్నారు. పాలిసేడ్స్‌లో మంటలు మరింత ఉద్ధృతమయ్యాయి. దీంతో మరిన్ని నివాసాలను ఖాళీ చేయిస్తున్నారు. బ్రెంట్‌వుడ్, ఎన్‌సినో సబర్బ్స్‌ను కూడా కొత్తగా ఖాళీ చేయిస్తున్నారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా ఖాళీచేసి వెళ్ళిపోయేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు ముందస్తు హెచ్చరికలు చేశారు. ఇప్పటి వరకూ పాలిసేడ్స్ ప్రాంతంలో 21,000 విస్తీర్ణంలో నివాసాలు, నిర్మాణాలు, పౌరప్రాంతాలు, అటవీ ప్రాంతాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఫసిఫిక్ తీరంలో ఒక్క పాలిసేడ్స్‌లోనే 5,000 పౌర ప్రాంత నిర్మాణాలు బుగ్గిపాలయ్యాయి. కొండ ప్రాంతాలు, మలబు, ఎటోన్ ప్రాంతాలను మంటలు తుడిచిపెట్టాయి. 3,700 మంది సిబ్బంది కష్టపడుతూ కేవలం ఎనిమిదీశాతం మేరకు మాత్రమే నివారణ చర్యలు తీసుకోగలిగారు. ఇదిలా ఉండగా, మంటలు అదుపుచేయడంలో స్థానిక లాస్‌ఏంజెల్స్ మేయర్ విఫలమయ్యారనే విమర్శలు చుట్టుముట్టాయి. తీవ్రమైన నీటి కొరత అతిపెద్ద సమస్యగా మారింది. దీనిపై ప్రత్యేక దర్యాప్తు ప్రారంభమైంది. మరోవైపు ఇప్పటివరకూ 1.44 లక్షల నివాసాలను అధికారులు ఖాళీ చేయించారు. దూరంగా ఉన్నవారిని ఇళ్ళల్లోంచి బయటకు రావొద్దని, తీవ్రమైన పొగ ప్రభావం శ్వాసకోశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని హెచ్చరికలు జారీ అయ్యాయి. హాలీవుడ్ హిల్స్‌లో ఇళ్ళు ఖాళీచేసిన ప్రముఖులు తమ ఇళ్ళదగ్గరకు వచ్చి కార్చిచ్చుల్లో బూడిగా మారిన ఇళ్ళను చూసుకుని దిగ్భ్రాంతితో దుఃఖపడుతున్నారు. ఇళ్ళు కోల్పోయినవారందరికీ ఆర్థిక సహాయం చేస్తామని ఇప్పటికే జో బైడెన్ ప్రభుత్వం ప్రకటన చేసింది.

## పతంగుల పండుగ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఉత్సవాలలో 16 దేశాల నుంచి 47 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లైయర్స్, 14 రాష్ట్రాల నుంచి 60 దేశవాళీ కైట్ క్లబ్ సభ్యులు, పాల్గొని పలు డిజైన్లలో రూపొందించిన పతంగులను ఎగుర వేస్తారని తెలిపారు. వీటితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్వీట్లను, తెలంగాణ పిండి వంటలను స్టాళ్లలో అందుబాటులో ఉంచుతారని తెలిపారు. రాబోయే రోజుల్లో కైట్ స్వీట్ ఫెస్టివల్‌ను పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ భారతదేశంలోనే కాదు, ప్రపంచంలో కూడా ఇలాంటి ఫెస్టివల్ ఎక్కడ నిర్వహించరని, అదే తెలంగాణ ప్రత్యేకతన్నారు. కైట్ ఫెస్టివల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు హస్తకళలు, చేనేత వస్త్రాల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరం కైట్ ఫెస్టివల్‌కు మూడు రోజుల్లో 15 లక్షల మంది వరకు వస్తారనే అంచనా ఉందన్నారు.

## తలొగ్గేది లేదు (మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు సులభతర వాణిజ్య విధానాన్ని అనుసరించాలన్నారు. కంపెనీల ఒత్తిడి కి తలొగ్గేది లేదని, పొరుగున ఉన్న ఎపి, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలల్లో ఉన్న బీర్ల ధరలను పరిశీలించాలని సూచించారు. హైకోర్ట్ రిటైర్డ్ జడ్జి నేతృత్వంలోని ధరల నిర్ణయ కమిటీ (ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ) నివేదిక ఆధారంగా ధరల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సిఎం అన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల యునైటెడ్ బేవరేజస్ కంపెనీ బీర్ల ధరలను 33.1 శాతం పెంచాలని ఒత్తిడి చేసిందని అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కొత్త కంపెనీలను అనుమతించే విషయంలో కట్టుదిట్టంగా ఉండాలని , కొత్త కంపెనీల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత కనీసం నెల రోజుల నిర్ణీత గడువు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆ కంపెనీలు తమ బ్రాండ్ల పేర్లతో దరఖాస్తు చేసుకోవాలని, ఆ కంపెనీల నాణ్యత ప్రమాణాలు, సరఫరా సామర్థ్యం పరిశీలించిన తర్వాత ఎంపిప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. గత ఏడాదిగా ఎక్సైజ్ శాఖ కు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను క్రమంగా క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## శంకుస్థాపన (మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్ రెడ్డి శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోషామహల్‌లోని ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కాగా అధికారులు సూచించిన మ్యాప్‌లలో సిఎం పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించాలని , రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నమూనాలను రూపొందించాలని అధికారులకు సిఎం సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినప్పటికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలన్నారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు.

## పట్నం (మొదటి పేజీ తరువాయి)

దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాండ్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. పండుగపూట స్వగ్రామాలకు వెళ్దామంటే చాలీచాలని బస్సులు, రైళ్లలో సీట్లు దొరక్క అవస్థలు తప్పడం లేదని జనం వాపోయారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ తోపాటు కూకట్‌పల్లి, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ ఎల్బీనగర్ కూడలి, వనస్థలిపురం, హయత్‌నగర్ వద్ద వాహనాల రద్దీ నెలకొంది. ప్రధానంగా ఏపీకి వెళ్లే రోడ్లపై రద్దీ కనిపిస్తుండగా సంక్రాంతి పండగ కోసం దాదాపు 6 వేల 432 బస్సులను నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ తెలిపింది. మరోవైపు ఈ ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో సొంత వాహనాలపై ఊర్లకు ప్రయాణం కావడంతో హైదరాబాద్ –నాగపూర్, హైదరాబాద్ –రామగుండం, హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్ –విజయవాడ, ఎల్‌బినగర్ –సాగర్ రోడ్లపై వాహనాలు భారులు తీరాయి. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ జాతీయ రహదారిపై భారీగా రద్దీ పెరిగింది. దీంతో ఈ రహదారులపై వాహనాలు క్యూ కట్టాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓ మోస్తారుగా వాహనాలు బారులు తీరగా, సాయంత్రం 4 గంటల తర్వాత వాహనాల సంఖ్య మరింత పెరగడంతో టోల్ గేట్ల వద్ద భారీగా రద్దీ ఏర్పడింది. ఈ ప్రభావం అబ్దుల్లాపూర్‌మెట్ వరకు చూపడంతో ఇక్కడి నుంచే వాహనాలు నెమ్మదిగా కదిలే పరిస్థితి ఏర్పడింది. దీంతో పంతంగి టోల్ ప్లాజా వద్ద మొత్తం 16 టోలు బూతులుగా సాధారణంగా ఇన్, అవుట్‌కు 8 చొప్పున టోల్ బూత్‌లను వినియోగిస్తారు. అయితే హైదరాబాద్ నుంచి ఒక్కసారిగా వాహనాలు పోట్టెత్తడంతో విజయవాడ వైపు 10 టోల్ బూతుల ద్వారా ట్రాఫిక్‌ను పంపిస్తున్నారు. ఈ టోల్ ప్లాజా ద్వారా రోజు వారిగా గరిష్టంగా 50 వేల వాహనాలు వెళ్లుతుంటాయని, కాని శనివారం ఒక్క రోజే లక్ష పైగా వాహానాలు వెళ్లినట్లు అక్కడి సిబ్బంది వెల్లడించారు.

## జలకాలాట (మొదటి పేజీ తరువాయి)

అందులో ఒకరు నీటిలో మునిగిపోగా, రక్షించడం కోసం ఒకరి వెంట ఒకరు ఆ గుంతలోకి జారిపోయారు. మునిగిపోయిన వారిలో ధనుష్ (20) లోహిత్ (17) జతిన్ (17) ధనేశ్వర్ (17) సాహిత్ (19) ఉన్నారు. కాగా ఇద్దరు యువకులు ఇబ్రహీంతో పాటు మరొకరు గట్టుపై ఉండి అరిచినా ఫలితం లేకుండా పోయింది. ఈ సమాచారం పోలీసులకు చేరవేయడంతో వారు అక్కడికి చేరుకొని యువకుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గల్లంతైన వారి కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా, సమాచారం అందుకున్న జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ సంఘటన స్థలానికి చేరుకొని కొండపోచమ్మ జలాశయంలో గాలింపు చర్యలను పరిశీలించారు. చేతికొచ్చిన కొడుకులు సరదాల కోసం వచ్చి మృత్యువాత పడడం తల్లిదండ్రులను, అక్కడికి చేరిన వారి కంటతడి పెట్టించింది. తల్లిదండ్రుల ఆర్తనాధాలకు అవధులు లేకపోగా, కన్నీటి పర్యంతమయ్యారు. సహాయక చర్యలో భాగంగా గజ్వేల్ ఏసిపి పురుషోత్తం రెడ్డి, గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్రెడ్డి, ములుగు ఎస్సై విజయ్ కుమార్, గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు, గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**యువకుల గల్లంతుపై సిఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

సిద్దిపేట జిల్లా మర్కూర్ మండలంలోని కొండపోచమ్మ ప్రాజెక్టులో యువకుల గల్లంతైన సంఘటనపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐదుగురు విద్యార్థుల గల్లంతుపై సిఎం ఆరా తీశారు. గల్లంతైన వారికోసం గజ ఈత గాళ్లతో గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు దగ్గర ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**మృతుల కుటంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : కూనంనేని**

సిద్దిపేట జిల్లా కొండపోచమ్మ సాగర్ లో ఈతకు వెళ్లి మృతిచెందిన 5మంది విద్యార్థులకు సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం సంతాపం తెలిపింది. శనివారం హైదరాబాద్ బండ్లగూడలోని గిరి ప్రసాద్ భవన్ సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. విద్యార్థుల మృతి చెందినట్లు సమాచారం అందడంతో సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం సంతాపాన్ని, మృత్యుల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపింది. కొండపోచమ్మ సాగర్ డ్యామ్ లో ఈతకు వెళ్లి 5 మంది విద్యార్థులు మృత్యువాత పడడం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదరి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృత్యువాత పడిన 5 మంది విద్యార్థుల కుటుంబాలకు రూ. 10 లక్షల రూపాయల చోప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వానికీ కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు.

## నియంత పాలన

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా సమస్యలు, ఉద్యమాలు, తాజా రాజకీయ తాజా పరిణామాలపై చర్చించారు. తొలుత అజీజ్ పాషా జాతీయ రాజకీయాలను వివరించారు. సిపిఐ శతాబ్ది వసంతాల్లోకి అడుగిడుతున్న సందర్భంలో పార్టీని మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. దీనికోసం జిల్లా సమితి కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. పట్టణ ప్రాంత మధ్యతరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి సిపిఐ మరింత క్రియాశీలకంగా పని చేయడం ద్వారా వారికి పార్టీని చేరువ చేయాలని సూచించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సమరశీల పోరాటాలను నిర్వహించాలన్నారు. సమ సమాజమే లక్ష్యంగా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై సిపిఐ నిర్వర్తిస్తున్న పోరాటాలు, ఉద్యమాలకు విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి మద్దతును కూడగట్టాలని తెలిపారు. మే మాసంలో దేశవ్యాప్తంగా నాలుగు జాతాలు : సిపిఐ 25 వ జాతీయ మహాసభలు చండీఘడ్‌లో సెప్టెంబర్ 21 నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అజీజ్ పాషా తెలిపారు. జాతీయ మహాసభల సందర్భంగా మే నెలలో దేశంలోని నలు మూలాల నుంచి 4 జాతాలను ప్రారంభమై మహాసభల వేదిక చండీఘడ్‌కు చేరుకుంటాయన్నారు. జాతీయ మహాసభల నేపథ్యంలో అగస్టు 31 నాటికి రాష్ట్రంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని మహాసభలను పూర్తి చేసుకోవాలని చెప్పారు. అనంతరం కార్యదర్శి నివేదికను రాష్ట్ర సమితిలో ప్రవేశపెడుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు.

**పలువురికి సంతాపం**

తొలుత ఇటీవల మరణించిన పలువురు రాజకీయ, వివిధ రంగాల ప్రముఖులకు సంతాపం ప్రకటిస్తూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహా సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. భారత మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, సిపిఐ (ఎం)ప్రధాన కార్యదర్శి, సీతారాం ఏచూరి, ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా, క్యూబా విప్లవకారుడు గోంజాల్వెజ్ పెరెజ్ , పారిశ్రామికవేత్త రతన్ టాటా, ప్రముఖ చలనచిత్ర దర్శకుడు శ్యామ్ బెనెగల్, తబాలా విధ్వాంసుడు జాకీర్ హూస్సేన్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యాల కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు ఏపూరి బ్రహ్మం ,తెలంగాణ సాయుధ పోరాట యోధులు పాటిబండ్ల రాధమ్మ , దుర్యా నాయక్ , అఖిల భారత దళిత హక్కుల ఉద్యమ నాయకులు టి. ఆర్.బిజ్జు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మంగళంపల్లి జనార్ధన్, జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండల పార్టీ మాజీ కార్యదర్శి చల్లా శశిరేఖమ్మ మహబూబాబాద్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరి సత్యనారాయణ రావు, మానవ హక్కుల కార్యకర్త, కర్ణాటక మాజీ సిఎం ఎస్.ఎం.కృష్ణ, హర్యానా మాజీ సిఎం ఓం ప్రకాశ్ చౌతాలా, కలవేణ సమ్మయ్య, బెజవాడ పిచ్చమ్మ, చంద్‌సేతు,పందిరి జనార్ధర్ రెడ్డి, దార లక్ష్మయ్య, తదితరులకు సంతాపాన్ని తెలియజేస్తూ రాష్ట్ర సమితి సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది.

# ఆప్‌కు ముడుపులు

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడ్డారన్నది హైలైట్స్‌లో ఒక ప్రధానాంశం. అధికారంలో ఉన్న ఆప్ పార్టీ నాయకులు ముడుపులు తీసుకుని కొందరికి మేలు చేసేవిధంగా ఢిల్లీ మద్యం విధానాన్ని అవకతవకలతో రూపొందించారన్నది ప్రధాన ఆరోపణ. ఈ మద్యం విధానంలో అతి కీలకమైన లొసుగులు ఉన్నాయని, లైసెన్సులు జారీ చేయడంలో విధానపరమైన ఉల్లంఘనలు జరిగాయని బయటకు పొక్కిన నివేదిక హైలైట్స్ వెల్లడించాయి. ఈ మద్యం ముడుపుల కేసులో సిసోడియాతోపాటు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌లను దర్యాప్తు సంస్థలు అరెస్టు చేశాయి. వారు చేసిన అవకతవకలవల్లనే ప్రభుత్వ ఖజానాకు రూ.2,026 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని కాగ్ నివేదిక వెల్లడించింది. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఫిర్యాదు మేరకు దర్యాప్తు సంస్థలు ఈ కేసును చేపట్టిన తర్వాత కేజ్రీవాల్ ఈ మద్యం విధానాన్ని రద్దు చేశారు. ఈ కాగ్ నివేదికను ప్రత్యేకించి ''ఇండియా టుడే'' చేజిక్కించుకుని బయటపెట్టింది.

ఢిల్లీ ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా ఖజానా లక్ష్యాలను నెరవేర్చడంలో ఈ మద్యం విధానం విఫలమైందని, కానీ ఆప్ నాయకులు ముడుపులు స్వీకరించడంద్వారా లబ్ది పొందారన్న కాగ్ ఆరోపణలను ''ఇండియా టుడే'' హైలైట్స్‌లో పేర్కొంది. మనీశ్ సిసోడియా నాయకత్వాన గల మంత్రులబృందం నిపుణులు సమర్పించిన నివేదికలోని అంశాలను అగౌరవించారని, పట్టించుకోలేదని నివేదిక పేర్కొంది.

**మంత్రివర్గం,ఎల్‌జీల ఆమోదం లేదు**

ఆమ్ ఆద్మీపార్టీ ప్రభుత్వం రూపొందించిన ఈ అవకతవకల మద్యం విధానానికి మంత్రివర్గం ఆమోదంగానీ, లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనా ఆమోదంగానీ లేవని కూడా కాగ్ తన నివేదికలో పేర్కొన్నట్లు 'ఇండియా టుడే' ద్వారా బయటకు పొక్కిన హైలైట్స్ వెల్లడించాయి. అంతకుమించి కొత్త విధాన నిబంధనలను ఆమోదం కోసం అసెంబ్లీ ముందు కూడా చర్చకు పెట్టలేదని, ఇది పూర్తిగా చట్టబద్ధమైన విధాన ప్రక్రియకు విరుద్ధమని కాగ్ నివేదిక పేర్కొంది. కొత్త విధానం అమలులో అనేక లొసుగులను కాగ్ కనిపెట్టింది. కొంతమంది రిటైలర్లు విధాన రద్దయ్యేవరకూ లైసెన్సులను తమవద్దనే ఉంచుకున్నారని, మరికొంతమంది గడువుకు ముందుగానే ప్రభుత్వానికి స్వాధీనం చేశారనీ, స్వాధీనం చేసిన లైసెన్సులకు తిరిగి టెండర్లను పిలవలేదనీ, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.890 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందనీ నివేదిక స్పష్టం చేసింది. అంతేకాకుండా జోనల్ లైసెన్సుల మంజూరువల్ల అదనంగా మరో రూ.941 కోట్లు నష్టం కలిగిందని పేర్కొంది. అదేవిధంగా వారికి లైసెన్సు ఫీజుల కింద ఇంకా అదనంగా మరో రూ.144 కోట్లను వసూలు చేయకుండా రద్దుచేశారనీ, ఇదంతా ''కరోనా మహమ్మారి వల్ల వచ్చిన ఆంక్షలు'' అనే ముసుగులో జరిగిందనీ నివేదిక పేర్కొంది. ల్యాబ్స్, బ్యాచ్ టెస్టింగ్ వంటి నాణ్యతా నియంత్రణకు మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేయలేదని కూడా కాగ్ తన నివేదికలో ఆరోపించింది. ఈ సదుపాయాలన్నీ విధాన ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఉల్లంఘనలు జరిగాయని పేర్కొంది. 2021 నవంబరులో ఆప్ ప్రభుత్వం ఈ మద్యం విధానాన్ని రూపొందించింది. దేశ వరాజధాని ఢిల్లీలో మద్యం రిటైల్ అమ్మకాల ముఖచిత్రంలో భారీ మార్పులు తీసుకువచ్చి, గరిష్ఠస్థాయిలో ఆదాయాలు తీసుకురావాలన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని తీసుకువచ్చింది. ఐనప్పటికీ అవినీతితోపాటు, చట్టవిరుద్ధంగా సంపాదించిన సొమ్మును బయటకు తెలియకుండా దాచిపెట్టేందుకు నిందితులు అక్రమ పద్ధతులు అనుసరించారని, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈ కేసు దర్యాప్తు సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌లు ఆరోపించాయి. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా ఆప్‌లో అగ్రశ్రేణి నాయకులు సిసోడియా, సంజయ్‌సింగ్‌లను అరెస్టు చేశారు. గత ఏడాదిలోనే వారు బెయిలుపై విడుదలయ్యారు.

**కాగ్ నివేదికను బిజెపి కార్యాలయంలో తయారు చేశారు**

కాగ్ నివేదిక ఇండియా టుడే ద్వారా వైరల్ కావడంతో ఆమ్ ఆద్మీపార్టీ తీవ్రస్థాయిలో బిజెపిపై మండిపడింది. కాగ్ నివేదికను బిజెపి కార్యాలయంలో తయారు చేశారని ఆప్ విమర్శించింది. ఐతే కేంద్ర మాజీమంత్రి అనురాగ్ ఠాకూర్ దీనిపై మాట్లాడుతూ, లిక్కర్‌గేట్‌లో కీలక సూత్రధారి అరవింద్ కేజ్రీవాలేనని విమర్శించారు. ''ఆప్ స్కూళ్ళు పెడతామని వాగ్దానాలు చేసిందిగానీ అందుకు బదులుగా లిక్కర్ స్టోర్లు నిర్మించింది, ప్రభుత్వ పాలనలో చెత్తను చీపురుతో ఊడ్చేసి సంస్కరణలు తీసుకువస్తామని చెప్పారుగానీ, వారు స్వరాజ్ నుండి షరాబ్ వైపు మారిపోయారు, వారి పదేళ్ళపరిపాలన అవినీతిమయం'' అని అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. దీంతో ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ కూడా ప్రతి విమర్శలు చేశారు. ఈ కాగ్ నివేదికను బిజెపి కార్యాలయంలోనే తయారు చేశారని విమర్శించారు. ఈ నివేదికను ఇప్పటివరకూ ఇంకా ఢిల్లీ అసెంబ్లీలో ప్రవేశపెట్టలేదన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ''ఈ కాగ్ రిపోర్టు ఎక్కడిది? ఈ విమర్శలు, ఆరోపణలన్నీ ఎక్కడి నుండి వస్తున్నాయి? ఈ నివేదికను బిజెపి కార్యాలయంలో ఫిలప్ చేశారా? బిజెపి నాయకులు మతిస్థిమితం కోల్పోయారు, కాగ్ నివేదికను ఇంకా ఢిల్లీ అసెంబ్లీకి సమర్పించలేదు, ఐనాగానీ వారు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు'' అని సంజయ్ సింగ్ విమర్శించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు





### జనవరి 26నుంచి పేదోడు మెచ్చే నాలుగు హామీలు అమలు : మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్/ఖమ్మం రూరల్ :** ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ న్యాయం జరగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందుతాయని, రాష్ట్ర, రెవిన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం అర్బన్‌లోని మల్లెమడుగు గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరై, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఇచ్చిన మాట ప్రకారం సంక్రాంతికి ముందే అర్హులైన పేదలకు ఇళ్ల పంపిణీ ప్రక్రియ మొదలైందన్నారు. అందులో భాగంగా ప్రస్తుతం డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చి పట్టాలు అందించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా 90శాతం పూర్తి అయిందన్నారు. జనవరి 26 నుంచి పేదోడు మెచ్చే నాలుగు హామీలు అమలు కాబోతున్నాయన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని, ఎవరో రెచ్చగొట్టే మాటలు విని అభద్రతకు లోను కావొద్దని, ప్రజలను కోరారు. అనంతరం అక్కడి నుంచి ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి పంచాయతీ పరిధిలోని భద్రాద్రి నగర్‌కు చేరుకున్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంత్రి పొంగులేటి ఆదేశాలతో ఏర్పాటు చేసిన ఆ పోటీలలో పాల్గొని మహిళలు గీసిన ముగ్గులను పరిశీలించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు మంత్రి పొంగులేటి సతీమణి మాధురి బహుమతులను ప్రధానం చేశారు. అటు తర్వాత ఖమ్మం నగరంలోని ఎస్ కన్వెన్షన్‌లో ఖమ్మం, పాలేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాతో మాట్లాడారు. కాం గ్రెస్ ప్రభుత్వం ఏర్పడి చేసిన, చేపట్టనున్న పనులను గురించి క్లుప్తంగా వివరించారు. భూమి లేని రైతు కూలీలకు రెండు విడతలుగా ఏడాదిక రూ.12వేలు ఇచ్చే కార్యక్రమం, భూమి ఉండి సాగు చేసుకునే ప్రతి రైతుకు ఎకరాకు ఏడాదికి రూ.12వేలు, అర్హులైన ప్రతి పేదవాడి కుటుంబానికి రేషన్ కార్డు ఇచ్చే ప్రక్రియతో పాటు ఇండ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, భూ క్య సురేష్‌నాయక్, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, 1,59, 60వ డివిజన్ కార్పొరేటర్లు హుస్సేన్, నిరంజన్, బట్టపోతుల లలితారాణితో పాటు వివిధశాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత స్వాతంత్ర్య పోరాటంలో
# ఆదివాసీయులది కీలక పాత్ర

### పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం సంపూర్ణంగా అమలు చేస్తాం : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/నందికొండ:** స్వతంత్ర పోరాటంలో ఆదివాసీయులది కీలక పాత్ర అని ఆ పోరాటంలో వెనుకడుగు వేయని ధీరోదాత్తులు ఆదివాసీలు, గిరిజనులు అని అందుకు ప్రత్యక్ష ఉదాహరణ జార్ఖండ్‌లో ఉన్న బిర్సా ముండా, మన రాష్ట్రానికి చెందిన కొమరం భీం, రాంజీ గోండు వీరంతా స్వతంత్ర పోరాటంలో దేశం కోసం అసువులు బాసిన గిరిజనులని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నాగార్జునసాగర్‌లో ఏర్పాటు చేసిన ఆదివాసి, గిరిజన ప్రజా ప్రతినిధుల శిక్షణా శిబిరం ముగింపు సభకు ముఖ్య అతిథులుగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, భారీ నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా వీరు స్థానికంగా ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకోగానే వీరికి జిల్లా కలెక్టర్ ఈలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవర్‌లు ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత వీరు పోలీసుల గౌరవ వందనం స్వీకరించి నేరుగా బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని ఆయనకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ దేశంలో హక్కుల కోసం ప్రశ్నించే ధైర్యాన్ని ఇచ్చింది కేవలం కాంగ్రెస్ పార్టీ తప్ప మరే ఇతర పార్టీ లేదని అన్నారు. పీసా చట్టాన్ని, అటవీ భూహక్కు చట్టాన్ని, ఎస్సీ, ఎస్టీల భద్రత చట్టం, ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని బలహీనపరచాలని, సామాన్యుల హక్కులను కాల రాయాలని పెద్ద కుట్ర జరుగుతుంది పరోక్షంగా బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం తూచా తప్పకుండా సంపూర్ణంగా అమలు చేసే బాధ్యత నేనే తీసుకుంటానని అందుకు వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని సబ్ ప్లాన్ అనేది సర్వరోగ నివారిణి అన్నారు. ఈ దేశ సంపద, వనరులు ఇక్కడి ప్రజలకే దామాషా ప్రకారం అందాలి తప్ప కార్పొరేట్ శక్తులకు కాదని భారత రాజ్యాంగాన్ని బలహీనపరచాలని, రాజ్యాంగం ద్వారా సామాన్యులు పొందిన హక్కులను కాలరాసేందుకు కుట్ర జరుగుతుంది అన్నారు. రాజ్యాంగాన్ని రక్షిస్తే అది మనందరినీ రక్షిస్తుందని ఉద్ఘాటించారు. పోడు భూముల్లో వ్యవసాయం చేసే గిరిజనులకు సోలార్ పవర్ ద్వారా విద్యుత్ అందించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనున్నదని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామియెలు, వైరా ఎమ్మెల్యే, మాలోతు రాందాస్, మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల కొండ అన్నపూర్ణ, ట్రైకా చైర్మన్ బెల్లయ్య నాయక్, గద్దర్ కుమారుడు సూర్యకిరణ్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, తిరుమలగిరి ఎంపిటిసి భగవాన్ నాయక్ పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువజన, విద్యార్థి సమస్యల పరిష్కార అజెండానే ఎఐవైఎఫ్ ప్రధాన కర్తవ్యమని హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. శుక్రవారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వల్లీ ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్రలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు యువజన అభివృద్ధి కోసం, ఉపాధి అవకాశాలు కల్పన కోసం నిర్దిష్టమైన విధానాలు అవలంబించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల బలోపేతం ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ టి.సత్య ప్రసాద్, శ్రీమాన్, పేరబోయిన మహేందర్ కార్యవర్గ సభ్యులు సల్మాన్ బేగ్, మస్క సుధీర్, శివ కుమార్, నవీన్, జగదీష్, హేమంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం ఆదేశాలతోనే భౌతిక దాడులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే కాంగ్రెస్ నేతలు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. పాలనా వైఫల్యాలను ఎత్తి చూపిన ప్రధాన ప్రతిపక్షంపైన దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా ? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీకి, రేవంత్ ప్రభుత్వ పాలనలో సాగుతున్న ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును సరిదిద్దాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై జరిగిన దాడిని కెటిఆర్ ఖండించారు.

## మావోయిస్టు నేత మచ్చ సోమయ్య లొంగుబాటు : ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** గత 32 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు మచ్చ సోమయ్య అలియాస్ సమ్మయ్య అలియాస్ సురేందర్ అలియాస్ సతీష్, డిసిఎస్ ఇంఛార్జి వ్యవసాయ విభాగం, సౌత్ బస్తర్ డివిసి, డికె ఎస్‌జెడ్‌సిఅఫ్ సిపిఐ మావోయిస్టు నేత జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఎదుట ఎస్‌పి కార్యాలయంలో లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి కిరణ్ ఖరే లొంగిపోయిన మావోయిస్టు సోమయ్య సంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, మచ్చ సోమయ్య అలియాస్, సమ్మయ్య అలియాస్, సురేందర్ అలియాస్, సతీష్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, భూపాలపల్లి మండలం, పంబాపూర్ గ్రామానికి చెందినవాడని, కాగా జిల్లా కమిటీ సెక్రటరీ ర్యాంక్ (డిసిఎస్) ఇంచార్జ్ ఆఫ్ అగ్రికల్చరల్ వింగ్, సౌత్ బస్తర్ మావోయిస్టుగా పని చేశారని తెలిపారు.

## చేనేత అభయహస్తం పథకం అమలు హర్షణీయం: తాటిపాముల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం చేనేత అభయహస్తం పథకం అమలు శ్రీకారం చుట్టడం పట్ల తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా సరే చేనేత అభయహస్తం పథకం అమలుకు విధివిధానాలు రూపొందించి ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా నిర్వీర్యం అవుతున్న సహకార వ్యవస్థను కాపాడేందుకు తక్షణమే చేనేత సహకార సంఘాలకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుదీర్ఘకాలంగా నేతన్నల అభివృద్ధికి సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని నేతన్న పొదుపు(త్రిఫ్ట్) పథకాన్ని, నూలు సబ్సిడీ పథకాన్ని పునరుద్ధరించాలని, నేతన్న బీమా, తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని చేనేత కార్మిక సంఘాలు ప్రభుత్వంపై చేసిన ఒత్తిడి ఫలితంగా ఎట్టకేలకు ప్రభుత్వం అమలుకు ఉత్తర్వులు చేసిందన్నారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి కార్మికుల సంక్షేమానికి రూ.1000 కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, నేతన్నలు ఉత్పత్తి చేసిన వస్త్రాలన్నింటినీ టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని, నేతన్నల అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలని, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలకు అనుగుణంగా నేతన్నల కూలీ రేట్లు పెంచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నేతన్నలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నూతన జాతీయ విద్యా విధానం
# రాజ్యాంగ స్ఫూర్తికి ప్రమాదకరం

### ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు జాతీయ సమితి సమావేశాల కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న జాతీయ నూతన విద్యావిధానం రాజ్యాంగ స్ఫూర్తికి అత్యంత ప్రమాదకరమని, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.. ఫిబ్రవరి 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. శనివారం హైదరాబాద్‌లోని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ సమితి సమావేశాల కరపత్రాలను తక్కలపల్లి శ్రీనివాస్ రావు, జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌ఎ స్టాలిన్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. తద్వారా విద్య కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణను, కాషాయికరణతో పాటు యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీస్తూ వీటి మూడు, నాలుగు రకాలుగా విభజించి వాటిని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ఇందుకు ఇటీవల విడుదల చేసిన 'యూజీసీ' ప్రతిపాదనలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ఆరెస్సెస్ నేపథ్యం ఉన్న వారినే నియమిస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం, జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించకుండా ఎలా ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షిస్తారని ప్రశ్నించారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని కూడా పొందుపర్చకపోవడంతో పేదవారికి ఉచిత విద్యా లేనట్టేనని అయన పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలలో ప్రజాస్వామ్యం, సెక్యులర్ పదాలను, డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించి దాని స్థానంలో బ్రిటిష్ ముస్కర్లకు తొత్తగా వ్యవహరించిన ఆర్‌ఎస్‌ఎస్, హెడ్గ్వార్, వీర సావర్కర్ మొదలగు వారి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దేశ చరిత్రను, తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బిజెపి ముందుందన్నారు. విభిన్న జాతులు కలిగిన వారు భారతదేశంలో ఉన్నారని, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశంలో ఒక కులాన్ని, ఒక మతాన్ని ప్రోత్సహించే బిజెపి భారతదేశ చరిత్రను వక్రీకరిస్తోందని అగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే జాతీయ నూతన విద్యా విధానాన్ని ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్‌ఎ స్టాలిన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగింపు దశకు వస్తున్న ఇంకా రాష్ట్ర వ్యాప్తంగా రూ.7850 కోట్లు స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తక్షణమే వాటిని విడుదల చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర నాయకులు వంశీ వర్ధన్ రెడ్డి, ఎండి అన్వర్, చైతన్య యాదవ్, హరీష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుల కలల సాధానికి
# 'క్రెడాయి' అద్భుత వేదిక

### ప్రాపర్టీ షో ప్రారంభించిన మంత్రి ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/ హనుమకొండ ప్రతినిధి :** హనుమకొండలోని వడ్డేపల్లి పిజిఆర్ గార్డెన్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న క్రెడాయి ప్రాపర్టీ షోను తెలంగాణ రాష్ట్ర రోడ్లు, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసి మెంబర్ ఈవి శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం, ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ 1999 ఢిల్లీలో ప్రారంభమైన క్రెడాయి సంస్థ అంచెలంచెలుగా ఎదుగుతూ దేశవ్యాప్తంగా రావడం గొప్ప పరిణామం అని, అభివృద్ధి పరమైన కార్యక్రమాలతో పాటుగా సామాజిక సేవ కార్యక్రమాలు చేయడం పట్ల అభినందించారు. సగటు మధ్యతరగతి కుటుంబానికి అనుగుణమైన కలల సాదానికి క్రెడాయి సంస్థ ఒక అద్భుత వేదిక అని అన్నారు. ఈ సంస్థలో గృహ నిర్మాణంతో పాటు గృహోపకరణాలు కూడా అందుబాటులో ఉండటం చాలా గొప్ప విశేషం అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వారికి అనుగుణమైన అవకాశాలు కలుగుతాయని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని రంగాల అభివృద్ధికి సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని, హైదరాబాద్ తరువాత అతిపెద్ద రెండో పెద్ద నగరం వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరం అని అన్నారు. ఇటీవలే ప్రజా ప్రభుత్వ నాయకత్వంలో రూ.6వేల కోట్లతో అభివృద్ధి కార్యకమాలకు శ్రీకారం చుట్టిన విషయం గుర్తు చేశారు. రైలు మార్గం, ప్రధాన జాతీయ రహదారులు, విద్య రంగాల్లో కాకతీయ యూనివర్సిటీ, కిట్స్, ఎన్ఐటి, వైద్యరంగంలో ఎంజీఎం, కాకతీయ మెడికల్ కాలేజ్ ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రియల్టర్, కన్‌స్ట్రక్షన్‌లకు పూర్తి స్వేచ్ఛయుత వాతావరణం కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొంత మేర రియల్ ఎస్టేట్ రంగం వెనక్కి తగ్గిందని రానున్న రోజుల్లో డబల్ స్పీడ్‌లో పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయి సంస్థ వరంగల్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రేమ్ సాగర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మురళి కృష్ణ రెడ్డి, నేషనల్ ఈసి మెంబర్ రామచంద్రారెడ్డి, క్రెడాయి వరంగల్ సంస్థ ఉపాధ్యక్షులు ఎన్.అమరేందర్ రెడ్డి, ఎస్.అమర్‌లింగేశ్వర్ రావు, ఎం.రవీందర్ రెడ్డి, సిహెచ్ సత్యనారాయణ రెడ్డి, సాధారణ కార్యదర్శి జె.మనోహర్, సంయుక్త కార్యదర్శి ఎల్.రజినీకాంత్ రెడ్డి, ఎం.రాజ్ కుమార్, జి.రాజేందర్ రెడ్డి కోశాధికారి ఎ.వెంకట మల్లారెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ వరుణ్ కుమార్ అగర్వాల్, యూత్ వింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రెండు, మూడు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

### జర్నలిస్టుల ఇష్టాగోష్టిలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంత్రివర్గ విస్తరణ తన పరిధిలో లేదని, సిఎం, ఎఐసిసి పరిశీలిస్తోందన్నారు. త్వరలోనే కార్పొరేషన్లు, బోర్డులు, కమిషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, సభ్యుల నియామకాలను ముఖ్యమంత్రి, ప్రభుత్వం త్వరలో ప్రకటించడానికి కసరత్తు చేస్తోందన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జర్నలిస్టులతో శనివారం ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీ కార్యవర్గ నియామకం విషయంలో ఈ నెలాఖరులోగా నాయకుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుని త్వరలోనే నియమిస్తామని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పోటీ చేస్తామని, నియోజకవర్గ పరిధిలో ఆయా జిల్లాల నుంచి నలుగురు ఐదుగురు టికెట్లను ఆశిస్తున్నారని, ఆ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపిలు, డిసిసిలు, నాయకుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని, తుది నివేదికను అధిష్టానానికి అందజేస్తామని మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ విషయంలో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంలో ఎఐసిసి ఇన్‌చార్జ్ దీపాదాస్, సిఎం, మంత్రుల అభిప్రాయాలను తీసుకుంటామని చెప్పారు. పని చేసిన వారందరికీ పదవులు వస్తాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ వాఖ్యలు పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. వచ్చే 20 ఏళ్ళను దృష్టిలో పెట్టుకుని పని చేయాలని కెసి వేణుగోపాల్ వార్నింగ్ ఇచ్చిన విషయాన్ని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈనెల 14న న్యూఢిల్లీకి వెళ్తున్నామని, ఆ మరుసటి రోజు 15న తేదీన జరిగే ఎఐసిసి కార్యాలయ ప్రారంభోత్సవ సభలో పాల్గొంటామని వివరించారు. అలాగే ఈ నెల 27న తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రానున్నారని, 'సంవిధాన్ బచావో' ప్రదర్శనలో వారు పాల్గొననున్నారని మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు.



మాజీ ప్రధాని, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ఉన్నారు. - ప్రజాపక్షం/హైదరాబాద్




## అదనపు పోస్టులు పెంచి నియామకాలు : నరసింహ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఫిమేల్ నోటిఫికేషన్ ఎంహెచ్ ఎస్ఆర్‌కు అదనంగా పోస్టులు పెంచి నియామకాలు ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ నందు పని చేస్తున్న ఆర్‌బిఎస్‌కె ఎఎన్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న సెకండ్ ఎఎన్‌ఎంలు, యూపిఎస్ ఎఎన్‌ఎంలు, ఆర్‌బిఎస్‌కె ఏఎన్‌ఎంలు ఎన్నో కష్టనష్టాలను వచ్చి తక్కువ జీతానికి పనిచేశారని ఆయన గుర్తు చేశారు. కరోనా సమయంలో ప్రజానీకాన్ని కాపాడటానికి ప్రాణాలను పణంగా పెట్టి పని చేసిన విషయాన్ని ప్రభుత్వం ప్రజలు మరువకూడదన్నారు. 2008 తర్వాత 2018 మరలా 2023 సంవత్సరాలలో ఎఎన్‌ఎంల నోటిఫికేషన్ విడుదల చేశారని మరో నోటిఫికేషన్‌లో వచ్చే సమయానికి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎఎన్‌ఎంలు నోటిఫికేషన్‌లో ఉద్యోగానికి వయసు రీత్యా అనర్హతకు గురవుతారన్నారు. కనుక ప్రభుత్వం స్పందించి 2023లో విడుదల చేసిన నోటిఫికేషన్ నెంబర్.2/2023కు అదనంగా పోస్టులు పెంచి భర్తీలు చేపట్టాలని కోరారు. వయస్సు రీత్యా అర్హతలేని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎఎన్‌ఎంలకు రూ.10లక్షల లైఫ్ టైం గ్రాట్యూటీతో పాటు హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లను ప్రభుత్వం కల్పించాలన్నారు. అదేవిధంగా పరీక్ష రాసిన తర్వాత కూడా ఉద్యోగం రాని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎఎన్‌ఎంలకు 100శాతం గ్రాస్ శాలరీని అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఆర్‌బిఎస్‌కె ఎఎన్‌ఎంల రాష్ట్ర కన్వీనర్ రెడ్డి సుజాత, ఖంపెల్లి పద్మ, బండి గ్రేసీ, ఎంజి మేరీ, ఏపూరి విజయలక్ష్మి , ఎం.అర్చన పాల్గొన్నారు.

## సాగునీళ్లు ఇస్తేనే భూములు సాగవుతాయ్

### మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంటలు పండిస్తేనే రైతు భరోసా ఇస్తామని చెబుతున్నారని, సాగునీళ్లు ఇస్తేనే భూములు సాగవుతాయని, సాగునీళ్లే ఇవ్వకుంటే, పంటలే వేయకుంటే రైతు భరోసా ఎక్కడిదని బిఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. భూమిని నమ్ముకుని కష్టపడే రైతులకు భరోసా ఇచ్చేందుకు ఇన్ని కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ ఆల వెంకటేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ చింతం సదానందంతో కలిసి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కోటి 57 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తే, ప్రభుత్వం సేకరించింది కేవలం 47 లక్షల మెట్రిక్ టన్నులేనని, అందులో సన్నవడ్లు కేవలం 16 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని, దీనికి పూర్తిగా బోనస్ ఇవ్వలేదని నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే కేసులు నమోదు చేసి బెదిరిస్తున్నారన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదైందని, అయినా సాగునీళ్లను వాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. కేంద్రంలోని ఎన్‌డిఎ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కోఆపరేటివ్ ఫెడరలిజం కొనసాగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి కాలికి ముల్లు గుచ్చకుండా బిజెపి కాపాడుతోందని ఆరోపించారు. ఎంఐఎం ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీతో కలిసి నడుస్తుంటే బిజెపి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్ఎంసి.

Corrigendum to NIT No. 35/EE-Div.29/SBZ/GHMC/2024-25, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన — తేది: 07.01.2025

**సవరణ పత్రం నెం. :** 01-35/EE-Div.29/SBZ/GHMC/2024-25, తేది: 07.01.2025, **పని పేరు:** 1) ఎస్‌బిజెడ్, సికింద్రాబాద్, డివిజన్-29, వార్డు నెం. 143, తార్నాక, ఆర్య నగర్ అంతర్గత లేన్ వద్ద సిసి రోడ్డు వేయడం. 2) జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్, జోనల్ ఆఫీస్ భవనం, సికింద్రాబాద్, సర్కిల్-29 కోసం స్టేషనరీ వస్తువుల సేకరణ (2). జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్, జోనల్ ఆఫీస్ భవనం వద్ద స్టోరేజ్‌ట్యాంక్ నుండి టెర్రస్ ట్యాంక్ వరకు నీటి సరఫరా పైప్‌లైన్‌ను మార్చడం, **అంచనా విలువ / ఇసివి:** రూ.50.85 లక్షలు, **నోటీసు ప్రకారం టెండర్ తేదీలు:** 09.01.2025న సా.4.00గం.ల నుండి, 17.01.2025న సా.4.00గం.ల వరకు, **సవరణ పత్రం ప్రకారం టెండర్ తేదీలు:** 17.01.2025న సా.4.00గం.ల నుండి 23.01.2025న సా.4.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్. సెల్: 6309920591. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 9034-PP/CL/ADVT/1/2024-25, Date: 11-01-2025




## ట్రినిడాడ్‌లో తప్పని అత్యవసర పరిస్థితి




ఆఫ్రికా దేశాల్లో నెలకొన్న రాజకీయ, ఆర్థిక అనిశ్చితికి ట్రినిడాడ్ అండ్ టొబాగో పరిస్థితులు అద్దం పడుతున్నాయి. అక్కడి ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించడం, పెరుగుతున్న హింసకు నిదర్శనం. గ్యాంగ్‌వార్స్ విపరీతంగా పెరగడం, హింస, దోపిడీ నిరాటంకంగా కొనసాగడంతో, శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. 2013 తర్వాత అత్యధిక వార్షిక అకాల మరణాలు గత ఏడాది నమోదుకావడం కూడా అత్యవసర పరిస్థితి విధించడానికి ఒక కారణం. సుమారు 1.5 మిలియన్ల జనాభా ఉన్న దేశం లో, హత్యల రేటు అత్యధికంగా నమోదవుతున్నది. 2014లో, ఇదే తరహా హింస చోటు చేసుకోవడంతో అత్యవసర పరిస్థితి విధించారు. తిరిగి 2021లో కొవిడ్ 19 కారణం గా ఎమర్జెన్సీ విధించక తప్పలేదు. ఇప్పుడు మరోసారి హింస కారణంగా అత్యవసర పరిస్థితి విధించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోతో ఉన్న సత్సంబంధాల నేపథ్యంలో, అక్కడి పరిణామాలు భారత్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. భారత యుపిఐ ప్లాట్‌ఫామ్‌ను అంగీకరించిన మొదటి కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగోను మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్)గా 1997లో భారత్ ప్రకటించింది. అదే సంవత్సరం ట్రినిడాడ్ అండ్ టొబాగో కూడా భారత్‌ను ఎంఎఫ్ఎన్‌గా గుర్తించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో 368.96 మిలియన్ డాలర్లకు చేరింది. అక్కడి దేశ జనాభాలో భారత మూలాలున్న వారి సంఖ్య 42 శాతం కావడం గమనార్హం. పోర్ట్ ఆఫ్ స్పెయిన్ రాజధానిగా ఉన్న ఈ దేశం 1962, ఆగస్టు 31న బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందింది. 1976లో రిపబ్లిక్‌గా అవతరించి, కరేబియన్ కమ్యూనిటీ (సిఎఆర్‌సిఓఎం)లో సభ్యత్వం పొందింది.

## ప్రత్యేకతను చాటుకుంటున్న 'తోడా'

అత్యంత పురాతన ద్రావిడ జాతి సమూహా ల్లో ఒకటైన తోడా తెగ ఇప్పటికీ తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. తమిళనాడులోని నీలగిరి కొండల్లో ఇటీవల తమ సంవత్సరాది 'మోద్వేత్'ను నిర్వహించడంతో ఈ తెగ గురించిన చర్చ మరోసారి తెరపైకి వచ్చింది. నీలగిరి జిల్లాలోని ముత్తనాడు మండ్



గ్రామంలోని మూన్పో ఆలయంలో ఏటా డిసెంబర్ చివరి లేదా జనవరి మొదటి ఆదివారం రోజున మోద్వేత్‌ను ఘనంగా నిర్వహిస్తారు. ఒక ప్రత్యేకమైన నిలువు శిఖరం పైకప్పుగా ఉన్న మూన్పో నీలగిరిలోని పురాతన ఆలయాల్లో ఒకటి. కొత్త సంవత్సరంలో మంచి ఆరోగ్యం ఉండాలని, వర్షాలు పడాలని, పంటలు సమృద్ధిగా పండాలని వారు మోద్వేత్ రోజున పూజలు చేస్తారు. తోడా యువత దాదాపు 80 కిలోల బరువుతో, జిడ్డుగా ఉండే బండరాయిని ఎత్తడం ద్వారా తమ బలాన్ని ప్రదర్శిస్తారు. సంప్రదాయ ఆచారాల ప్రకారం, ఈ వేడుకలో మహిళలు పాల్గొనరు. తోడా భాష ద్రావిడ భాష కిందకే వస్తుంది. అయితే, అత్యంత అసాధారణంగానూ, సాధారణ ద్రావిడ్ భాషలకు భిన్నంగానూ ఉంటుంది. అందుకే, ఈ భాష మూలాలపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు. తోడా తెగ భూములు నీలగిరి బయోస్పియర్ రిజర్వ్‌లో భాగంగా ఉన్నాయి. యునెస్కో అంతర్జాతీయ బయోస్పియర్ రిజర్వ్‌గా దీనిని గుర్తించింది. మన దేశంలో మొట్టమొదటి బయోస్పియర్ రిజర్వ్‌ను ఇక్కడ 1986లో ఏర్పాటు చేశారు. ఈ రిజర్వ్ ఆదియన్, అరనాదన్, కాడర్, కురిచియన్, కురుమాన్, కురుంబస్ వంటి అనేక గిరిజన సమూహాలకు నిలయం.

## సవాళ్లు విసురుతున్న 'గ్రీన్ హైడ్రోజన్'




కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు గుప్పించిన స్థాయిలో కార్యాచరణకు పూనుకోకపోవడంతో, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి మన దేశానికి సవాళ్లు విసురుతున్నది. 2070 నాటికి నికర ఉద్గారాలను 'సున్నా' స్థాయికి చేర్చడమే లక్ష్యమని అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రకటించింది. మరో రకంగా చెప్పాలంటే, మరో 45సంవత్సరాల్లో మన దేశంలో కర్బన ఉద్గారాలు ఉండవు. అయితే ఇది అనుకున్నంత సులభం కాదు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి అవసరం. పారిశ్రామిక రంగాలను డీకార్బనైజ్ చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. సిద్ధాంతపరంగా ఇది మంచి ఆలోచనే. కానీ, గ్రీన్ హైడ్రోజన్‌కు అవసరమైన పెట్టుబడుల మాటేమిటి? 2030 నాటికి ఏటా 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని భారత్ లక్ష్యంగా ఎంచుకుంది. కానీ, అందుకు అవసరమైన చర్యలు ఇంకా ప్రారంభస్థితిలోనే ఉన్నాయి. బ్లూమ్‌బెర్గ్–ఎన్ఇఎఫ్ తాజా విశ్లేషణను అనుసరించి, కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న ఈ లక్ష్యంలో పది శాతం పూర్తికావడం కూడా కష్టమే. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు కిలో కు 5.30 డాలర్ల నుంచి 6.70 డాలర్ల వరకూ ఉండవచ్చని అంచనా. సాంప్రదాయ బూడిద ఉత్పత్తి ఖర్చు కిలోకు 1.9 డాలర్ల నుంచి 2.4 డాలర్ల వరకూ ఉండవచ్చు. ఈ గణనీయమైన అసమానత కారణంగా, లక్ష్యసాధనలో పురోగతి దాదాపు శూన్యంగా ఉంది. కేంద్రం తగినంత మొత్తాలను కేటాయించలేదు... భాగస్వామ్యానికి ప్రైవేటురంగం ముందుకు రావడం లేదు... ఇలాంటి పరిస్థితుల్లో గ్రీన్ హైడ్రోజన్... సున్నా కర్బన ఉద్గారాలు వంటి నినాదాలు ఇవ్వడంలో అర్థం ఏమిటో మోదీ సర్కారుకే తెలియాలి.

## ఖగోళ పరిశోధనలో 'గ్రావిటేషనల్ లెన్సింగ్'



ఖగోళ పరిశోధనలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అందులో భాగంగానే 'గ్రావిటేషనల్ లెన్సింగ్' టెలిస్కోపిక్ సాంకేతికత తెరపైకి వచ్చింది. ఈ సాంకేతిక పరిజ్ఞానంతో, సుదూరంలోని 44 సరికొత్త నక్షత్రాలు/గ్రహాలను భౌతిక శాస్త్రవేత్తలు గుర్తించారు. గురుత్వాకర్షణ లెన్సింగ్ అనేది ఒక నేపథ్య మూలం నుంచే కాంతిపై ప్రభావం చూపే విధానం. స్పేస్ టైమ్ వక్రత ఫలితంగా ఇది ఉత్పన్నమవుతుంది. స్థలం, సమయానికి చెందిన మూడు కోణాలు ద్రవ్యరాశి కారణంగా ఒకే అస్తిత్వంగా ఏకమవుతాయి. గ్రావిటేషనల్ లెన్సింగ్ భారీ వస్తువు చుట్టూ వ్యాపించినప్పుడు, కాంతి వక్రీకరణం చెంది, చూసే వస్తువు పరిణామాన్ని పెద్దదిగా చూపిస్తుంది. ఈ సిద్ధాంతా న్ని తొలుత ప్రముఖ శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ 1915లో అంచ నా వేశాడు. బలమైన ద్రవ్యరాశి ఉన్న వస్తువుల ద్వారా కాంతి వక్రీకరణ సాధ్యమని అప్పట్లో ఐన్‌స్టీన్ అంచనా వేశాడు. ఆయన ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతాన్ని అనుసరించి, సమయం మరియు స్థలం అనేవి స్పేస్‌టైమ్ అని పిలిచే పరిమాణంలో కలిసి ఉంటాయి. ఈ సిద్ధాంతంలో భారీ వస్తువులు స్పేస్‌టైమ్‌ను వక్రంగా మారుస్తాయి. గురుత్వాకర్షణను కూడా స్పేస్‌టైమ్ వక్రతగా పరిగణించాలి. కాంతి అంతరిక్ష సమయంలో ప్రయాణిస్తున్నప్పుడు, అది తన ప్రయాణ మార్గానికి కాకుండా, ఒక వస్తువుకు సంబంధించిన ద్రవ్యరాశి ద్వారా వక్రతను సంతరించుకుంటుంది. ఈ సిద్ధాంతం ఆధారంగానే 'గ్రావిటేషనల్ లెన్సింగ్'ను ఐన్‌స్టీన్ అంచనా వేశాడు. నక్షత్రం, క్వాసార్ లేదా మొత్తం గాలాక్సీ వంటి ప్రకాశవంతమైన నేపథ్య మూలం నుంచి కాంతి మరొక గెలాక్సీ లేదా గెలాక్సీల సమూహానికి భారీ వస్తువులను దాటి ప్రయాణించినప్పుడు వక్రీకరణకు గురవుతుంది. అంతేగాక, ఒక కుంభాకార కటకంగా గోచరిస్తుంది. దీని ద్వారా సుదూరంలో ఉన్న గెలాక్సీలను కూడా చూసి, అధ్యయనం చేసే అవకాశం లభిస్తున్నది.

## భూకంపాలు నేర్పుతున్న పాఠాలు



భూకంపాలు ఎన్నో పాఠాలు నేర్పుతున్నాయి. ప్రత్యేకించి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను పదే పదే గుర్తుచేస్తున్నాయి. ఇటీవల టిబెటన్ చైనా, నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో సంభవించిన భూకంపం తీవ్రత రెక్టార్ స్కేల్‌పై 7.1పాయింట్లుగా నమోదైంది. ఇంతటి తీవ్రమైన భూకంపం విస్తృతమైన వినాశనానికి కారణమవుతుంది. ఎవరెస్టు పర్వతానికి సమీపంలోని లాసా టెర్రేన్‌లోని కౌంటీలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. క్విజియాంగ్ కోఫాల్ట్స్‌ను గుర్తించే పరిశోధనల ద్వారా అందిన ఫలితాలతో సమలేఖనం చేసినప్పుడు కూడా ఇవే ఫలితాలు వెలువడ్డాయి. టెక్టోనిక్ ఫాల్ట్ టిబెటన్ పీఠభూమి తూర్పువైపు కదలికలను శాస్త్రవేత్తలు తొలిసారి పసిగట్టారు. టెక్టోనిక్ ప్లేట్ యాక్టివిటీ లేదా క్రియాశీలత దాదాపు 50 మిలియన్ సంవత్సరాల క్రితం ప్రారంభమైందని అంచనా. భారత ఉపఖండం, ఐరోపా, ఆసియా ప్లేట్ల మధ్య కొనసాగుతున్న ఘర్షణ కారణంగా భూకంపాలు ఏర్పడుతున్నాయని నిర్ధారించారు. భారత్ పలక సంవత్సరానికి సుమారు 60 మిల్లీమీటర్ల చొప్పున యూరేషియన్ ప్లేట్‌లోకి చొచ్చుకెళుతున్న విషయాన్ని పరిశోధకులు ఇది వరకే గుర్తించారు. దీని వల్ల భూమి అడుగు పొరల మధ్య ఘర్షణలు భూకంపాలుగా మారుతున్నాయి.

**బిఎస్ఎస్ మైత్రేయి**

## బాదల్ కుటుంబ శకం ముగిసినట్లే!

పంజాబ్ రాజకీయ దృశ్యంలో ప్రభావవంతమైన పరిణామం చోటుచేసుకుంది. సిక్కుల మత, సామాజిక, రాజకీయ హక్కుల పరిరక్షణోద్యమంలో రాజకీయ విభాగంగా వందేళ్ల చరిత్ర కలిగిన శిరోమణి అకాలీదళ్(ఎస్ఎడి)లో తొలికుటుంబంగా పరిగణించబడే బాదల్ కుటుంబం గత మూడుదశాబ్దాల్లో తొలిసారి పార్టీపై అజమాయిషీ కోల్పోయింది. పార్టీ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ గత సంవత్సరం నవంబర్‌లో సమర్పించిన రాజీనామాను ఎస్ఎడి కార్యవర్గం శుక్రవారం ఆమోదించింది. అయితే అది స్వచ్ఛంద రాజీనామా కాదు. 2007–2017 మధ్యకాలంలో బాదల్, ఇంకా పలువురు అకాలీ నాయకులు చేసిన తప్పులకు (మతాపచారాలు)గాను సిక్కుమత అత్యున్నతాధికార పీఠం అకాల్ తఖ్త్ విధించిన మతశిక్షలో భాగంగా ఆయన అధ్యక్ష పదవికి నవంబర్ 16న రాజీనామా చేశారు. స్వర్ణదేవాలయం వంటశాలలో పాత్రలు శుభ్రంచేయటం, ప్రధాన ప్రవేశద్వారం వద్ద కాపలా ఉండటం వగైరా శిక్షలను బాదల్ అనుభవించారు. ద్వారంవద్ద కాపలాఉన్న సందర్భంలో ఒక దుండగుడు జరిపిన పిస్టల్ కాల్పుల్లో అపాయంనుండి త్రుటిలో తప్పించుకున్న ఆయన స్వల్పగాయంతో బయటపడ్డారు. రాజీనామా ఆమోదించాల్సిందిగా అకాల్ తఖ్త్ ఇచ్చిన ఆదేశాన్ని కార్యవర్గం పాటించింది.

సుఖ్‌బీర్‌సింగ్ తండ్రి ప్రకాశ్ సింగ్ బాదల్ ఐదు పర్యాయాలు పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1947లో రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన 1957లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనారు. 1969లో మంత్రిగా పనిచేశారు. 1972, 1980, 2002లో అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు.

ప్రజాపక్షం
12-01-2025, ఆదివారం

మొత్తం 10సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనారు. 1992 ఎన్నికలను అకాలీదళ్ బహిష్కరించింది. 1977లో కేంద్రంలో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వంలో వ్యవసాయమంత్రిగా పనిచేశారు. 1970లో ప్రకాశ్‌సింగ్ బాదల్ తొలిసారి అకాలీదళ్–సంత్ ఫతేసింగ్, జనసంఘ్ సంకీర్ణ ప్రభుత్వ ముఖ్యమంత్రి అయినారు. అయితే పంజాబ్‌లో హిందీ సమస్యపై జనసంఘ్ తోడ్పాటు ఉపసంహరించుకుంది. బాదల్ జనతాదళ్ తోడ్పాటుతో 1977–80లో రెండోసారి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1977 ఫిబ్రవరినుండి 2002 ఫిబ్రవరివరకు మూడవసారి, 2007 నుండి 2012వరకు శిరోమణి అకాలీదళ్–బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో నాల్గవసారి ప్రకాశ్‌సింగ్ బాదల్ ముఖ్యమంత్రి అయినారు. 2012 నుండి 2017వరకు ఐదవ సారి ఎస్ఎడి–బిజెపి సంకీర్ణ ప్రభుత్వ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ 1998–99లో వాజ్‌పేయి రెండవ మంత్రివర్గంలో పరిశ్రమలశాఖ సహాయమంత్రిగా పనిచేశారు. 2001 నుంచి 2004 వరకు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. 2004లో, తిరిగి 2019లో లోక్‌సభకు ఎన్నికైనారు. 2007లో ఉపముఖ్యమంత్రి అయినారు. 2008 జనవరిలో తండ్రినుంచి వారసత్వంగా అకాలీదళ్ అధ్యక్ష బాధ్యతలు చేబట్టారు. ఆయన భార్య హర్‌సిమ్రత్ కౌర్ నరేంద్రమోదీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. అయితే పంజాబ్ రైతుల ఆందోళన నేపథ్యంలో మూడు రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా 2020 సెప్టెంబర్‌లో ఆమె రాజీనామా చేశారు. ప్రస్తుతం భటిండా నుండి ఎంపిగా ఉన్నారు.

ఇంత సుదీర్ఘ చరిత్రగల రాజకీయ కుటుంబం అకాలీదళ్‌పై పట్టుకోల్పోవటం ఆ పార్టీకి తీరని నష్టం. ఇదంతా పార్టీ పునరుజ్జీవనానికే అని చెబుతున్నప్పటికీ కాలం మాత్రమే జవాబు చెప్పగలదు. పంజాబ్ రాజకీయ చరిత్రలో ప్రధాన ప్రత్యర్థులైన కాంగ్రెస్, అకాలీదళ్ రెండూ ఛిద్రమై అధికారం అనూహ్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ చేతికి వెళ్లింది. రైతుల సమస్యలపై అకాలీదళ్ తెగతెంపులు చేసుకున్న తదుపరి బిజెపి అడ్రసు గల్లంతు అయింది. మార్చి 1న అకాలీదళ్ నూతన అధ్యక్షుని ఎన్నిక జరుగుతుంది.

ఫిబ్రవరి 20 వరకు పార్టీ సభ్యత్వం చేర్పింపు కార్యక్రమం చేబడతామని, 25 లక్షల సభ్యత్వం లక్ష్యమని అకాలీదళ్ అధికార ప్రతినిధి దల్జీత్ సింగ్ చీమా చెప్పారు. పార్టీ లౌకిక చట్రంలో రిజిస్టర్ అయినందున అకాల్ తఖ్త్ ఆదేశాలు పాటిస్తే ఇబ్బంది వస్తుందని పార్టీ నాయకులు వాదించినా తఖ్త్ తమ ఆదేశమే మిన్న అనటంతో రాజీనామా ఆమోదించక తప్పలేదు.

# ప్రపంచానికి ప్రమాదకారిగా పచ్చి మితవాదం

## వామపక్ష, ప్రజాతంత్ర విశాల ఐక్యతకు కృషి ముమ్మరం కావాలి



జాన్ గ్రీన్

ప్రపంచవ్యాప్తంగా నూతన మితవాద, నయాఫాసిస్టు రాజకీయ శక్తుల పెరుగుదల, అదే సమయంలో బలమైన వామపక్ష శక్తుల అంతర్ధానం లేదా తరుగుదలను చూస్తున్నాము. అమెరికాకు మనం సరికొత్త, మరింత విద్వేషపూరిత డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పాలనను చూడబోతున్నాం. ఇప్పటికే ఇటలీలో ఫ్రెటెల్లి డి ఇటాలియా పార్టీకి చెందిన జియార్జియా మెలొనిని విజయాన్ని, భారతదేశంలో మోదీ మతతత్వ హిందూయిజాన్ని, అర్జెంటీనాలో నయాఉదారవాద, తీవ్రవాద జేవియర్ మీలీ, హంగేరిలో విక్టర్ ఓర్బాన్ నిరంకుశ పాలనను, బ్రిటన్‌కు కాబోయే ప్రధానిగా తనకు తానుగా భావిస్తున్న, ఇప్పటికే దూసుకుపోతున్న నిజెల్ ఫారాజ్‌లను మనం చూస్తున్నాం.

నవోమి క్లీన్ తన పుస్తకం 'డొప్పెల్‌గ్యాంగర్'లో వామపక్షాలు కీలకమైన అంశాలపై స్వంతంగా విజయవంతమైన రాజకీయ ఉద్యమాలు నిర్మించడంలో, ఏకాభిప్రాయ సాధనలో విఫలమవడం, వాటి మధ్య కోపతాపాలు, అనైక్యత, వైఫల్యాలను నూతన మితవాదం ఏ విధంగా తమకు అనుకూలంగా మలుచుకుంటుందో స్పష్టంగా వివరించారు. కొద్ది దశాబ్దాల క్రితం మితవాదులు కొద్దిపాటి చిన్న సమూహాలుగా, పునర్నిర్మాణం జరగని ఫాసిస్టు వర్గాలుగా ఉన్న సమయంలో, ప్రస్తుత పరిస్థితులు కనీసం ఊహకు అందనివి.

ట్రంప్ మాజీ ముఖ్య వ్యూహకర్త, అమెరికాలోని నయా మితవాద నాయకులలో ఒకరైన స్టీవ్ బానన్ 'గోబెల్' పుస్తకం నుంచి స్ఫూర్తి పొంది, ట్రంప్‌కు సంబంధించిన దుస్తులు ఏ విధంగా ఉండాలి, వామపక్షాల భాషను తనదైన శైలిలో ఎలా వాడాలి అనే వ్యూహరచన చేశారు. నాజీ అనే సంక్షిప్త నామం కంటే జర్మనీ ఫాసిస్టుల పూర్తి పేరు నేషనల్ సోషలిస్ట్ జర్మన్ వర్కర్స్ పార్టీ అని పిలిచేందుకే మితవాదులు ఇష్టపడతారు. నాజీ, సోషలిజం, కమ్యూనిజం ఒకటే అని ప్రజలమదిలో నాటేందుకు ఉద్దేశ్యపూర్వకంగానే అలా వ్యవహరిస్తా రు.

హిట్లర్ చాలా ఆలస్యంగా తన పార్టీ పేరులో సోషలిస్ట్ పదాన్ని జొప్పించారు. గందరగోళాన్ని సృష్టించి, కార్మిక వర్గ ఓటర్లను తన వైపు తిప్పుకోవడమే దాని వెనుక ఉన్న లక్ష్యం. అందులో విజయం కూడా సాధించాడు. నేషనల్ సోషలిస్టులు త్వరలోనే తమ ముసుగును తొలగించుకొని, విస్తృత పెట్టుబడిదారి విధానానికి బలమైన అండగా నిలిచేవారే తప్ప సోషలిజానికి కాదని స్పష్టమైంది.

1930లనాటి జర్మనీతో, ప్రస్తుత ప్రపంచాన్ని పోల్చడం ప్రమాదకరం. కానీ, వాటి మధ్య నిస్సందేహంగా ఉన్న పోలికల నుంచి మనం పాఠాలు నేర్చుకోవచ్చు. మరోసారి ప్రపంచపెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. దాని నుంచి బైటపడేందుకు కొన్నిచోట్ల తిరిగి పొడసూపుతున్న ఫాసిజాన్నే మార్గంగా చూపుతున్నారు.

గతంలో నాజీల మాదిరిగానే నేటి నయాఫాసిస్టులు కూడా అత్యంత ఐశ్వర్యవంతుల పట్ల జనాభాలోని పెద్ద సంఖ్యలో నెలకొన్న తీవ్రమైన ఆగ్రహాన్ని గుర్తించారు. వారు సమాజాన్ని నాశనం చేస్తున్నారని, జవాబుదారీతనంలేని కులీనులు, అత్యంత ఐశ్వర్యవంతులైన టెక్ సిఇఒలు, బడా ఫార్మా కంపెనీలు, నిరంకుశ ప్రభుత్వాలపై దాడులు చేస్తున్నట్లు నయా ఫాసిస్టులు నటిస్తున్నారు. ఇదంతా కూడా వారికి వ్యతిరేకంగా ఉండే కార్మిక వర్గాలను తమ వైపు తిప్పుకునే వాక్చాతుర్యంలో భాగమే. నిజానికి అత్యంత ఐశ్వర్యవంతులను, టెక్ గుత్తాధిపతులను ఏదో చేయాలనేది వారి ఉద్దేశ్యం కాదు. ఎందుకంటే ఆ వర్గాల నుంచే వారికి నిధులు అందుతాయి కాబట్టి.

ఊహాజనిత వాతావరణ మార్పు, లేని కొవిడ్ మహమ్మారి వంటి 'ఫేక్ న్యూస్ (బూటకపు వార్తలు)'ను వామపక్షాలు సృష్టిస్తున్నాయనే ఆరోపణలు, అభియోగాలకు ట్రంప్ ప్రధాన ప్రేరేపకుడు. మహమ్మారి సమయంలో వాస్తవ ప్రమాదాన్ని పక్కకు నెట్టి, ప్రమాదకరమైన వ్యాక్సిన్ వ్యతిరేక అభూతకల్పనలతో, కరోనా వైరస్ లేనేలేదనే తిరస్కరణలతో అయోమయాన్ని, భయాన్ని రేకెత్తించాడు.

తీవ్రమైన వాతావరణ మార్పు ప్రమాదాలను కూడా శిలాజ ఇంధన పరిశ్రమలో ఉద్యోగాలను నాశనం చేసేందుకు, ఖరీదైన హరిత చర్యలను అందరిపై రుద్దేందుకు వామపక్షాలు సృష్టించిన కల్పనలని ప్రచారం చేశారు. "చరిత్రలో మనం చేసిన అతి పెద్ద, అత్యంత మూర్ఖపు సమష్టి తప్పులలో ఒకటి భూ తాపంపై ఆందోళన చెందడం" అని ఫారాజ్ అన్నారు. జాత్యాహంకారాన్ని సైతం భారీ వలసల పట్ల ఆందోళన పేరుతో కప్పిపుచ్చుతున్నారు. ఫారాజ్ ఏమంటున్నాడో చూడండి: "బ్రిటన్‌లో, ఇప్పటికే 485 మిలియన్‌ల ప్రజలు వచ్చి ఉంటున్నారు. 'మీరంతా, మీలో ప్రతి ఒక్కరూ కూడా వచ్చారు. మీరు నిరుద్యోగులా? మీకు నేర చరిత్ర ఉందా? దయచేసి రండి. మీకు 19 మంది పిల్లలు ఉన్నారా? దయచేసి రండి.' ఈ విషయంలో మేము విచక్షణను, ఆలోచన దృక్కోణాన్ని కోల్పోయాం". "నేను ఈ విషయాన్ని బాధతో చెబుతున్నాను. మన సొంత దేశాలలో ఫిఫ్త్ కాలమ్ (శత్రువులకు సహకరించే రహస్య బృందాలు) నివాసం ఏర్పరచుకున్నాయి. వారు మన విలువలకు పూర్తిగా వ్యతిరేకమై మన జుడియో–క్రిస్టియన్ (యూదు– క్రైస్తవ) సంస్కృతి కోసం మనం మరింత ధైర్యంగా నిలబడాల్సి ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో అంతర్జాతీయంగా పచ్చి మితవాద శక్తుల మధ్య మరింత సమన్వయం పెరిగింది. ట్రంప్ విశ్వాసపాత్రుడైన ఎలాన్ మస్క్ సైతం ఫారాజ్‌కు, హంగేరి ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బాన్‌కు, జర్మనీలో నయా ఫాసిస్టు ఎఎఫ్‌డి పార్టీకి మద్దతిస్తున్నాడు. ఫ్లోరిడాలోని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ నివాసం మార్–ఎ–లాగోలో ట్రంప్, ఎలాన్ మస్క్‌లను 2024 డిసెంబర్‌లో ఓర్బాన్ కలిసారు."ఈ రోజు అమెరికాలో ఉన్నాను. భవిష్యత్తు ప్రారంభమైంది! డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్, మైఖేల్ గ్వాల్ట్జ్‌లతో మార్–ఎ–లాగోలో ఒక మధ్యాహ్నం" అని ఆయన ట్వీట్ చేశారు.

ఇటీవల యూరోపియన్ యూనియన్ ఎన్నికలలో, కలిసి పని చేసేందుకు ఫ్రాన్స్ పచ్చి మితవాద నాయకురాలు మెరైన్ లీ పెన్ ఇటలీ ప్రధాన మంత్రి జియార్జియా మెలోనిని ఆహ్వానించారు. ఇద్దరి కలయికతో మితవాద పక్షం యూరోపియన్ పార్లమెంటులో రెండవ అతిపెద్ద కూటమిగా ఏర్పడుతుందని ఆమె అన్నారు. ఇంకా చెప్పాలంటే ఇప్పుడు నయా ఫాసిస్టులు, వారి మితవాద సహచర ప్రయాణికులు యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌లో అతి పెద్ద గ్రూప్‌గా ఉన్నారు.నయా ఫాసిస్టులు తమపై గతంలో ఉన్న ముద్రలను మార్చుకోవటంలో సఫలమైనారు. గతంలో వారికున్న నాజీ సానుభూతి పరులు, బహిరంగ జత్యాహంకారులు, యూదు వ్యతిరేకులు, సైనిక యూనిఫామ్‌ల పట్ల ప్రేమ వంటి ముద్రలను వదిలించుకున్నారు. వాటి స్థానంలో జాతీయవాదంతో స్వేచ్ఛావాదం మేళవించి 'వామపక్ష హంగులు' వారికి వారుగా ధరించారు.

శక్తివంతమైన పెట్టుబడిదారి ప్రయోజనాలను కాపాడేందుకు ఆర్థిక సహాయం పొందుతున్న నయా ఫాసిజం సోషల్ మీడియాను వాడుకుంటూ వామపక్షాన్ని ఈ రంగం నుంచి వెళ్ళగొట్టడం ఎలాగో నేర్చుకుంది. ఇది 30లలో ఫాసిస్టులకు ఒక స్వప్నంగానే ఉండేది.

నియంత్రించలేని స్థాయిలో పెరిగిపోతున్న నయా ఫాసిజానికి అడ్డుకట్ట వేసేందుకు వామపక్షంగా మనం ఏమి చేయాలి? దీనికి సులువైన జవాబు లేదు. కానీ, ఇందుకోసం ముందుగా అవసరమైన ఐక్య సంఘటన ఏర్పాటుకు ప్రయత్నించేందుకు సాధ్యమైన మేరకు విస్తృత ఏకాభిప్రాయం కోసం మల్లగుల్లాలు పడాలి. ముందుగా లక్షలాది సామాన్య కార్మిక వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న నిత్య జీవిత వాస్తవ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. వారి ఆందోళనను పరిష్కరించడం కోసం మనం వాడే భాషను మృదువుగా మార్చుకోవాలి. లైంగికత్వం విషయంలో స్వీయ అస్తిత్వ హక్కు లేదా ఏది సరైన పోరాటమార్గం లేదా నిజమైన సైద్ధాంతిక మార్గం ఒకటే ఉందా అనే చిన్న చిన్న అంశాలపై జగడాలకు దిగి, వాటిలో ఇరుక్కుపోవడాన్ని మనం నివారించాలి.దీన్ని అందులో కొంతయినా సాధించడంలో విఫలమైతే, మనం మన మద్దతుదారుల ను ప్రగల్భాలతో ప్రలోభపెట్టే జిత్తులమారి మితవాదులకు కోల్పోవలసి వస్తుంది.

*(బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ వారపత్రిక మార్నింగ్ స్టార్ సౌజన్యంతో)*

# రాజకీయ పార్టీల 'గుట్టురట్టు'!

ఇటీవల అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఎడిఆర్) అనే సంస్థ పది రోజుల తేడాతో రెండు కీలక విశ్లేషణ పత్రాలను విడుదల చేసింది. ఈ సంస్థను 1999లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) అహ్మదాబాద్‌లో పనిచేసే ప్రొఫెసర్ల బృందం ఏర్పాటు చేసింది. పరిపాలన, ప్రజాస్వామ్యం బలోపేతం, ఎన్నికలు, రాజకీయ సంస్కరణల కోసం ఎడిఆర్ పాటుపడుతోంది. అందులో భాగంగా అభ్యర్థుల నేర చరిత, ఎన్నికల అఫిడవిట్ వివరాలను క్రోడీకరించి ప్రజల ముందు ఉంచడం ఆనవాయితీ. అలాగే వివిధ అంశాలపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలను కూడా ఎడిఆర్ దాఖలు చేస్తుంది. ఎలక్టోరల్ బాండ్‌ల వివరాలను బహిర్గతం చేయాలని కోరుతూ ఎడిఆర్ వేసిన కేసులోనే బాండ్‌లు కొనుగోలు చేసిన వారి పేర్లను బహిర్గత పరచాలని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. అలాంటి ఎడిఆర్ సంస్థ విడుదల చేసిన విశ్లేషణ పత్రాలలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి.

**ధనిక ప్రాంతీయ పార్టీగా బిఆర్ఎస్**

ఇటీవల రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా కొనసాగుతున్న ఫార్ములా ఈ – రేస్ కేసును అవినీతి నిరోధక శాఖ'క్విడ్ ప్రో కో' కోణంలో దర్యాప్తు చేస్తోంది. బిఆర్ఎస్‌కు గ్రీన్ కో సంస్థ రూ.41కోట్లు ఎలక్టోరల్ బాండ్‌ల రూపంలో అందజేసిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సంస్థకు చెందిన 'ఏస్ నెక్ట్స్ జెన్' ఫార్ములా రేసును స్పాన్సర్ చేసి, మధ్యలో తప్పుకుంది. దీంతో ఆ సంస్థకు బదులుగా బిజినెస్ రూల్స్ పాటించకుండా ఫార్ములా–ఈ రేసు నిర్వహణ సంస్థకు రూ.55 కోట్లును నాటి పురపాలక మంత్రి కెటిఆర్ ఫోన్ కాల్ ద్వారా ఉన్నతాధికారులకు ఇచ్చిన మౌఖిక ఆదేశాలతో హెచ్ఎండిఎ పౌండ్‌లలో చెల్లించినట్లుగా ఆరోపణలు. ఫార్ములా ఈ రేసు ఒప్పందం ఉన్న సంవత్సరంలోనే గ్రీన్‌కో సంస్థ బిఆర్ఎస్‌కు భారీగా ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇక్కడే అసలు ప్రశ్న. రాష్ట్ర ప్రభుత్వంతో ఎలాంటి ఒప్పందం కానీ, ఎలాంటి భాగస్వామ్యం కానీ లేని సంస్థ ఎందుకు నాటి అధికార పార్టీ బిఆర్ఎస్‌కు రూ.41 కోట్లు ఇచ్చినట్లు?దాని వెనుక మతలబు ఏమిటీ?దీనికి కెటిఆర్, బిఆర్ఎస్ నేతలు స్పందిస్తూ ఆ సంస్థ బిఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్, బిజెపిలకు కూడా ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిందని అసంపూర్ణ వివరణ ఇచ్చారు.

ఈ చర్చ ఇలా కొనసాగుతున్న సమయంలోనే రెండు రోజుల క్రితం జనవరి 10వ తేదీన ప్రాంతీయ రాజకీయ పార్టీలు 2022–23 ఆర్థిక సంవత్సరంలో పొందిన విరాళాలతో ఎడిఆర్ విశ్లేషణ పత్రాన్ని విడుదల చేసింది. ఆ కాలంలో 28 ప్రాంతీయ పార్టీలకు వివిధ సంస్థల నుంచి రూ.216.765కోట్లు 28 విరాళాలు ముట్టాయి. అందులో సింహభాగం బిఆర్ఎస్ ఖజానాకు రూ.154.03కోట్లు చేరాయి. విరాళాలు దక్కిన ఇతర 27 ప్రాంతీయ పార్టీలు బిఆర్ఎస్‌కు దరిదాపులలో కూడా లేవు. తరువాత స్థానాలలో వైసిపి రూ. 16 కోట్లుతో, టిడిపి రూ.11.92 కోట్లతో ఉన్నాయి.

పైన చెప్పుకున్న వివరాలు కేవలం రూ.20వేల కంటే ఎక్కువ మొత్తాలను వ్యక్తులు లేదా సంస్థలు చెక్కులు, ఆన్‌లైన్ రూపంలో ఇచ్చినవి, అలాగే ఎన్నికల ట్రస్ట్ ఫండ్ ద్వారా అందజేసినవి మాత్రమే. వీటికి ఎలక్టోరల్ బాండ్‌లు అదనం. 2022–23 ఆర్థిక సం.లోనే బిఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్‌ల రూపంలో లభించిన మొత్తం రూ.529కోట్లు. వీటికి చెక్కులు, ట్రస్ట్‌ల ద్వారా వచ్చిన విరాళాలు కలుపుకుంటే రూ.683కోట్లు అవుతుంది. ఏ రకంగా చూసినా జాతీయ పార్టీల తరువాత వివిధ రూపాలలో అత్యధిక విరాళాలు పొందిన ప్రాంతీయ ధనిక పార్టీగా బిఆర్ఎస్ నిలుస్తోంది. ఇక ఎన్నికల సంవత్సరమైన 2023–24 ఆర్థిక సంవత్సరంలో సైతం ఎన్నికల బాండ్లు, ఎన్నికల ట్రస్టు ఫండ్‌ల ద్వారా బిఆర్ఎస్ భారీగానే విరాళాలను దక్కించుకోగలిగింది. ఆ ఏడాది రూ.580.52కోట్లు విరాళాల రూపంలో రావడం గమనార్హం. ఆ రెండేళ్ళలోనే వివిధ రూపాలలో




బిఆర్ఎస్‌కు రూ.వెయ్యికోట్లకుపైగానే విరాళాలు వచ్చాయి. ఈ విరాళాల వివరాలను నిబంధనల మేరకు స్వయంగా ఆ పార్టీనే ఎన్నికల సంఘానికి అందించింది. అవి ఇసి వెబ్‌సైట్‌లో అందుబాటులో కూడా ఉన్నాయి. చాలా పార్టీలు వివరాలను స్పష్టంగా ఇవ్వకపోయినప్పటికీ, ఏ మాటికి ఆ మాట బిఆర్ఎస్ మాత్రం పూర్తి వివరాలను సమగ్రంగా ఇసికి సమర్పించింది.

**ధనిక సిఎం, అత్యధిక కేసులు కలిగిన సిఎం**

ఇదే ఎడిఆర్ సంస్థ గత ఏడాది చివరన డిసెంబర్ 30వ తేదీన దేశంలోని 28 రాష్ట్రాల, 3 కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులకు సంబంధించిన విశ్లేషణ పత్రాన్ని విడుదల చేసింది. ఇందులో ముఖ్యమంత్రుల ఆస్తులు, చదువు, వయసు, కేసులు తదితర అంశాల గురించి వివరించారు. ఇందులో ఆసక్తికరమైన విషయమేమిటంటే దేశంలోని ముఖ్యమంత్రులందరిలో ఎపి సిఎం నారా చంద్రబాబు నాయుడు రూ.931.83 కోట్లతో అగ్రస్థానంలో నిలిచారు. అందులో రూ.810.42కోట్లు స్థిరాస్తులు కాగా, 121కోట్లు చరాస్తులు. బిజెపికి చెందిన అరుణాచల్ ప్రదేశ్ సిఎం పెమా ఖండూరూ.332.56 కోట్లు, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య రూ.51.93 కోట్లతో ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి రూ.30 కోట్ల ఆస్తులతో దేశంలోని ముఖ్యమంత్రులలో ఏడవ స్థానంలో ఉన్నారు. అతి తక్కువ ఆస్తులు కలిగిన ముఖ్యమంత్రులలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేవలం రూ.15.35 లక్షలతో తొలి స్థానం, జమ్మూకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా రూ.55.24 లక్షలతో రెండస్థానంలో ఉన్నారు. కేరళలో వామపక్ష సంఘటన ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్ రూ.1.18కోట్ల విలువైన ఆస్తులతో తృతీయ స్థానంలో నిలిచారు.

కేసుల విషయానికి వస్తే దేశంలోనే అత్యధికంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై 89 కేసులు నమోదయ్యాయి. ఆయన తరువాత తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌పై 47 కేసులు ఉన్నాయి. మరో తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 19 కేసులతో మూడవ స్థానంలో నిలిచారు.

విశ్లేషణ పత్రాలలో వెల్లడైన అంశాలను పరిశీలిస్తే ఆందోళన కలిగించే విషయాలు కూడా ఉన్నాయి. మొదటిది దేశంలోనే అత్యధిక విరాళాలు పొందిన ప్రాంతీయ పార్టీ మన రాష్ట్రంలోనే ఉంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎలక్టోరల్ బాండ్‌లు కొనుగోలు చేసిన సంస్థల పేర్లు వెలుగులోకి రావడంతో బిఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్‌లు ఇచ్చిన సంస్థలు కొన్ని, అంతకు ముందుగానో, తరువాతనో నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి భూముల రూపంలోనే, ప్రోత్సాహాల రూపంలోనో భారీగా లబ్ధి పొందాయి. అలాగే మూడవసారి ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడేందుకు టిడిపి కీలకమైన నేపథ్యంలో ఆ పార్టీ అధినేత, ఎపి సిఎం చంద్రబాబు కుటుంబ సభ్యులు, టిడిపి నాయకుల కంపెనీలకు సంబంధించిన సంస్థల షేర్‌ల ధరలకు అమాంతం రెక్కలొచ్చి 20శాతం పెరిగాయని వార్తలు వచ్చాయి. ఆయన ప్రస్తుతం అత్యధిక ఆస్తులు కలిగిన ముఖ్యమంత్రి. ఈ పరిణామాలు ఆందోళన కలిగించేవే. ఆర్థిక సంస్కరణలు మూడవ దశ తరువాత పెట్టుబడిదారులకు పాలకులు ఎర్ర తివాచీ పరుస్తున్నారు. వారికి భూములు, వనరులు, ప్రోత్సాహాలు, సబ్సిడీలను కట్టబెడుతున్నారు. దీంతో పరస్పర లబ్ధి కూడా కలుగుతుందనడం నిస్సందేహం.

ఇక మూడవది, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై దేశంలో అందరి ముఖ్యమంత్రులకంటే అత్యధిక కేసులు,అందులో తీవ్రమైనవి ఉండడం. వీటిలో ఎక్కువగా సిఎం కాకముందు ప్రతిపక్షంలో ఉండి పోరాడిన సందర్భంలో నమోదైనవే. ఒక రకంగా ప్రతిపక్షాలను అణిచివేయడంలో భాగంగా చూడవచ్చు. ఈ మూడు అంశాల వెనుక పెట్టుబడిదారి, కార్పొరేట్ శక్తులు వేగంగా విస్తరించేందుకు పాలకపక్షాలను తమకు అనుకూలంగా మలుచుకోవడం, అలాగే అధికారం పక్షం తమ ఆధిపత్యాన్ని ఎవ్వరూ సవాలు చేయకూడదనే నిరంకుశ ధోరణి ద్యోతకమవుతున్నది.

# నాకు ఎవరి మద్దతూ అక్కర్లేదు..!

## 'ముఖ్యమంత్రి పోస్ట్'పై విలేకరుల ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ సమాధానం

## 'తరువాతి సిఎం' అంటూ మద్దతుదారులు చేసిన నినాదాలపై స్పష్టీకరణ



**చిక్కమగళూరు (కర్నాటక) :** కాంగ్రెస్ ప్రభుత్వంలో 'ఎలాంటి రాజకీమ మలుపులకు' తావు వుండదని కర్నాటక ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ శనివారం స్పష్టంచేశారు. తాను, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇరువురమూ కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలకు అనుగుణంగానే ముందుకువెళతామని, హోదాలు, పదవుల విషయంలో వ్యక్తిగత కోర్కెలకు ఆస్కారం ఉండదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని 5ఏళ్లపాటు అధికారంలో ఉండాలని ప్రజలు ఆశీర్వదించారని ఆయన ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు అందరికీ గుర్తు చేశారు. కర్నాటక రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూడా అయిన ఉపముఖ్యమంత్రి డికె.శివకుమార్ ఇక్కడకు రాగానే ఆయన మద్దతుదారులు పెద్దపెట్టున 'తదుపరి ముఖ్యమంత్రి' అంటూ నినాదాలు చేయసాగారు. అనంతరం విలేకరుల సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందించిన ఆయన ఏ ఒక్కరూ విచారపడాల్సిన అవసరం లేదని, కర్నాటక ప్రభుత్వంలో ఎలాంటి రాజకీయ మలుపులకు తావే లేదన్నారు. ప్రజలు ఐదేళ్లపాటు అధికారంలో ఉండాలంటూ కాంగ్రెస్ పార్టీని దీవించి ఒక అవకాశం ఇచ్చారని, మేం తప్పకుండా ఐదేళ్లు కొనసాగుతామని శివకుమార్ సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రి, తాను పార్టీ ఆదేశాలకు అనుగుణంగా త మ కార్యకలాపాలను కొనసాగిస్తామని వివరించారు. కార్యకర్తలు, మద్దతుదారులు మీరు తదుపరి ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారు కదా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు తన నుంచి ఏదైనా కోరుకోవడం, ఏ ఒక్కరైనా తన గురించి డిమాండ్ చేయడం కోరుకోనని, తనకు ఎవరి మద్దతూ అవసరం లేదని, తనకు మద్దతుగా తన వెనక శాసనసభ్యులు ఎవరూ ఉండాలని కూడా తాను కోరుకోవడం లేదని తన అభిప్రాయాన్ని కుండబద్దలుకొట్టారు. ఇది తనకు, కాంగ్రెస్ పార్టీకి మధ్య విషయం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏది చెబితే తాను దాని ప్రకారమే నడుచుకుంటానని, తన తరపున కార్యకర్తలు లేదా శాసనసభ్యులు గట్టిగా అరవాలని, తనకు మద్దతుగా నిలవాలని తాను ఏ మాత్రం కోరుకోవడం లేదని శివకుమార్ చెప్పారు. తాను తన విధులను నిర్వహిస్తానని చెప్పారు. తాను 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన' అనే మహితోక్తిపై నమ్మకాన్ని కలిగి ఉన్నానని తెలియజేశారు. 'నీ ప్రయత్నాలను నీవు సక్రమంగా నిర్వర్తించి..ఫలితాలను మాత్రం దేవుడికి వదిలెయ్యి' అని డిప్యూటీ సిఎం శివకుమార్ విలేకరులకు తన ఆలోచనా విధానాన్ని విపులీకరించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సన్నిహితుడైన ఆయన మంత్రివర్గ సహచరుడు కెఎన్.రాజన్న శుక్రవారం నాడు మాట్లాడుతూ మిగిలిన రెండున్నర సంవత్సరాల కాలంలో అత్యున్నత పదవియైన ముఖ్యమంత్రి పీఠాన్ని ఆశించకుండా కొత్త ఎన్నికలలో పార్టీని విజయవంతంగా నడిపించడం ద్వారా శివకుమార్ ముఖ్యమంత్రి కావడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఆయన సూచించిన మరుసటిరోజైన శనివారం నాడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి అయిన డికె.శివకుమార్ ఈ ఆసక్తికర కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఎంపికచేసిన తన కేబినెట్‌లోని సెలెక్టెడ్ దళిత, ఎస్‌టి సహచరులతో విందు ఇచ్చిన నేపథ్యంలో కర్నాటకలో నాయకత్వ మార్పు తథ్యమన్న ఊహాగానాలు జోరుగా సాగడం సంచలనం సృష్టించింది. మార్చి తర్వాత 'రొటేషనల్ ముఖ్యమంత్రి' లేదా 'అధికార భాగస్వామ్యం' సూత్రం అమలుకానున్నదన్న పుకార్లు షికార్లు చేశాయి. 2023 మేలో వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ముఖ్యమంత్రి పోస్ట్ కోసం సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య తీవ్రస్థాయి పోటీ నెలకొంది. దీంతో కాంగ్రెస్ అధిష్టానం శివకుమార్‌ను ఒప్పించి ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టింది. ఆ సమయంలో రొటేషనల్ చీఫ్ మినిస్టర్ సూత్రం కింద శివకుమార్, సిద్ధరామయ్య మధ్య రాజీ కుదిరిందన్న వార్తలు వెలువడ్డాయి. చెరో రెండున్నర సంవత్సరాలపాటు ముఖ్యమంత్రి పదవిలో ఉంటారని ప్రచారం జరిగినా, ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ అధికారికంగా ధృవీకరించలేదు. 'వక్కలింగ' సామాజికవర్గానికి చెందిన డికె.శివకుమార్ ముఖ్యమంత్రి కావాలన్న తన కోర్కెను బహిరంగంగానే చెప్పారు. బుధవారం సాయంత్రం హోం మంత్రి జి.పరమేశ్వర నాయకత్వంలో మంత్రి కెఎన్.రాజన్న మద్దతుతో నిర్ణయించబడిన కాంగ్రెస్ నాయకులు, మంత్రులు, ఎస్‌సి, ఎస్‌టికి చెందిన ప్రజాప్రతినిధుల సమావేశం ఎఐసిసి ప్రధానకార్యదర్శి, కర్నాటక ఇన్‌చార్జి రణ్‌దీప్‌సింగ్ సూర్జివాలా నుంచి వచ్చిన ఆదేశాల నేపథ్యంలో వాయిదా పడింది. విశ్వసనీయవర్గాల ప్రకారం..ముఖ్యమంత్రి పోస్ట్‌ను గట్టిగానే ఆశిస్తున్న శివకుమార్ సోమవారం రాత్రి న్యూఢిల్లీలో ఎఐసిసి జనరల్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) కెసి.వేణుగోపాల్‌ను కలిసి పార్టీలో జరుగుతున్న పరిణామాలను చర్చించిన తర్వాత వాయిదాపడినట్లు సమాచారం.

## కొత్త చట్టంప్రకారం 'సిఇసి నియామకం'లో...

# అందరి దృష్టి 'సుప్రీం'పైనే

## సెలక్షన్ ప్యానెల్‌లో సిజెఐ లేకపోవడం చెల్లుబాటుకాదంటూ సవాల్ చేసిన పిటిషన్‌పై ఫిబ్రవరి 4న విచారణ

## ఫిబ్రవరి 18న సిఇసి రాజీవ్‌కుమార్ పదవీవిరమణ నేపథ్యంలో నూతన నియామకంపై ఉత్కంఠ




**న్యూఢిల్లీ :** నూతన చట్టం ప్రకారం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సిఇసి) నియామకం విషయమై సెలక్షన్ ప్యానెల్‌లో దాని సభ్యుడిగా భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) ప్రాతినిథ్యం లేకపోవడంపై దాని చెల్లుబాటును సవాల్ చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నియామకానికి సంబంధించిన చట్టాన్ని పరిశీలిస్తున్న సుప్రీంకోర్టుపై అందరి దృష్టి పడింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (అపాయింట్‌మెంట్, సర్వీస్ షరతులు, ఆఫీస్ టెర్మ్) యాక్ట్ 2023 డిసెంబరులో అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషనర్లు అనూప్‌పాండే పదవీవిరమణ, అరుణ్ గోయల్ రాజీనామా తర్వాత ఏర్పడ్డ ఖాళీలను భర్తీచేయడానికి 2024 మార్చిలో వారి స్థానంలో తొలుత జ్ఞానేష్‌కుమార్, ఎస్ ఎస్.సంధూల నియామకం జరిగింది. ఫిబ్రవరి 18న ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు 65 సంవత్సరాల వయస్సు పూర్తికాలం ముగిసి పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో ఆయన స్థానంలో తదుపరిఎన్నికల ప్రధానాధికారి నియామకం చేసేందుకు ఈ కొత్త చట్టాన్ని ఉపయోగించడం ఇదే మొట్టమొదటిసారి అవుతుంది. సంప్రదాయం ప్రకారం ఎన్నికల కమిషనర్ భారత ఎన్నికల ప్రధానాధికారిగా పదోన్నతి పొందారు. అయితే కొత్త చట్టం ప్రకారం సిఇసిని నియమించకముందే ప్రభుత్వం సిఫారసు మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించడం జరిగింది. కానీ ఈసారి ప్రధానమంత్రి నేతృత్వంలోని ప్యానెల్ మాజీ సీనియర్లు అయిన జ్ఞానేష్‌కుమార్, సంధులలో ఒకరిని చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా నిర్ణయించనుంది. వీరిలో జ్ఞానేష్‌కుమార్ 2029 జనవరి 26 నాటికి తన 65సంవత్సరాల పదవీవిరమణ వయస్సును పూర్తి చేసుకోనున్నారు. చట్టంప్రకారం న్యాయశాఖ మంత్రి నేతృత్వం వహించనున్న సెర్చ్ కమిటీకి ఇద్దరు కేంద్ర కార్యదర్శులు కూడా ప్రాతినిథ్యం వహిస్తారు. వీరు సెలెక్షన్ ప్యానల్ కాల్ చేయడానికి ఐదుగురు పేర్లను సిద్ధం చేస్తారు. ఎన్నికల ప్రధానాధికారి లేదా ఎన్నికల కమిషనర్ నియామకం కోసం ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్షనేత, ప్రధానమంత్రి సూచించిన కేంద్రమంత్రితో కూడిన ప్రధానమంత్రి నేతృత్వంలోని సెలక్షన్ ప్యానెల్ ఒక పేరును రాష్ట్రపతికి సూచిస్తారు. నూతన చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం న్యాయశాఖ మంత్రి షార్ట్ లిస్ట్ చేయని వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేసే సమాన అధికారాన్ని సెలక్షన్ ప్యానెల్ కలిగి ఉంది. 1991నాటి చట్టం సిఇసి, ఎలక్షన్ కమిషనర్ల జీతాలు, సేవా పరిస్థితులను పరిష్కరించింది కానీ నియామక పద్ధతిని కాదు. జస్టిస్ కెఎం.జోసెఫ్ (రిటైర్ట్ అయినప్పటినుండి) నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం 2023 మార్చి 23న ఇచ్చిన తన తీర్పులో చీఫ్ ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లను నియమించడానికి ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత ప్రాతినిథ్యం వహించే ఒక సెలక్షన్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. తర్వాత ప్రభుత్వం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల (అపాయింట్‌మెంట్, సర్వీస్ షరతులు, కార్యాలయం టెర్మ్) బిల్లును తీసుకువచ్చినప్పుడు సెలక్షన్ ప్యానెల్‌లో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బదులుగా ఆయన స్థానంలో కేంద్ర మంత్రి పేరును భర్తీ చేసింది. ఈ నేపథ్యంలో సెలెక్షన్ ప్యానెల్‌లో మార్పును సవాల్ చేశారు. ఈ అంశాన్ని ఫిబ్రవరి 4కు వాయిదా వేసినప్పుడు ఎవరి అభిప్రాయాలు ఉంటాయనే విషయమై సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 141 వర్సెస్ శాసన నిర్ణాయక వ్యవస్థలకు అధికారం ఉంటుంది అని సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది.

## 13 న ఢిల్లీలో రాహుల్ గాంధీ

# తొలి ఎన్నికల ప్రచారం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ శాసనసభ ఎన్నికలు మరికొన్ని వారాల్లో జరగనుండగా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దేశ రాజధానిలో తన వంతుగా సోమవారం ప్రచార పర్వం ప్రారంభించనున్నారు. ఈశాన్య ఢిల్లీలోని శీలంపూర్‌లో ఒక బహిరంగ సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తారని పార్టీ శనివారం వెల్లడించిందివ. ఎఐసిసి ఢిల్లీ ఇన్‌చార్జి ఖాజీ నిజాముద్దీన్ ఢిల్లీ పిసిసి కార్యాలయంలో విలేకరుల గోష్ఠిలో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశ ప్రజల వాణిగా ఆవిర్భవించారని చెప్పారు. ఎక్కడ ఒక సమస్య ఉంటే రాహుల్ అక్కడికి వెళ్లి ప్రజల వాణి వినిపిస్తుంటారని నిజాముద్దీన్ తెలిపారు. 'కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఈశాన్య ఢిల్లీ శీలంపూర్ ప్రాంతంలో సోమవారం సాయంత్రం 5.30 గంటలకు 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అధిక సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సభలో పాల్గొంటారు' అని నిజాముద్దీన్ చెప్పారు.

# రూపాయి పతనంపై మీ సమాధానమేంటీ?

## ప్రధానిని నిలదీసిన ప్రియాంకాగాంధీ



**న్యూఢిల్లీ :** అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ భారీగా తగ్గిపోవడంపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. దీనిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలన్నారు. శుక్రవారం రూపాయి విలువ ఒక్కసారిగా 16 పైసలు క్షీణించి చరిత్రలోనే తొలిసారిగా 86.04కి చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎక్స్ వేదికగా ప్రియాంక గాంధీ విమర్శలు గుప్పించారు. చరిత్రలోనే తొలిసారిగా రూపాయి మారకం విలువ కనిష్ఠ స్థాయికి చేరుకుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో డాలరుతో రూపాయి మారకం విలువ 58–59 గా ఉండేది. అప్పట్లో నరేంద్ర మోదీ రూపాయి విలువను ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపెట్టేవారు. డబ్బు విలువ ఏ దేశంలోనూ ఇంతగా పడిపోదని, అంతా తనకే తెలుసని చెప్పేవారు. మరి ఇప్పుడేమైంది. ఆయనే ప్రధానిగా ఉన్నారు. పతనంలో రూపాయి రికార్డులు సృష్టిస్తోంది. రోజు రోజుకూ దాని విలువ పడిపోతోంది. అందువల్ల దేశ ప్రజలకు ఆయన సమాధానం చెప్పాలి అని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

# బంగ్లాదేశీయుల స్మగ్లింగ్ యత్నం భగ్నం



**మాల్దా:** బంగ్లాదేశ్‌కు చెందిన సాయుధ మూకల స్మగ్లింగ్ యత్నాలను భారత్ సైన్యం భగ్నం చేసింది. శనివారం తెల్లవారు జామున 2.10 సమయంలో దాదాపు 15–20 మంది సాయుధులు భారత్‌లోకి చొరబడే ప్రయత్నం చేశారు. పసిగట్టిన సరిహద్దు భద్రతా సిబ్బంది వారిని పలుమార్లు హెచ్చరించినా వినిపించుకోకుండా సరిహద్దు వైపు దూసుకొచ్చారు. జవాన్ల కళ్లు బైర్లు కమ్మేలా అత్యంత శక్తివంతమైన కాంతిని ప్రసరించే హై బీమ్ ఫ్లాష్ లైట్లను వినియోగించారు. అంతలోనే జవాన్లపై మారణాయుధాలతో దాడికి దిగారు. తొలుత వారిని భయపెట్టేందుకు జవాన్లు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా వెనక్కి తగ్గకపోవడంతో ఆత్మరక్షణ కోసం బిఎస్‌ఎఫ్ సిబ్బంది కూడా ప్రతిదాడి చేశారు. దీంతో వారంతా తోకముడుచుకొని తిరిగి బంగ్లాదేశ్ వైపు పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా.. 572 సీసాల ఔషధాలు,హైబీమ్ ఫ్లాష్ లైట్లు, ఆయుధాలు లభ్యమయ్యాయి. ఈ మేరకు బిఎస్‌ఎఫ్ ఉన్నతాధికారులు ప్రకటన విడుదల చేశారు. మరోవైపు ముర్షిదాబాద్, మాల్దా జిల్లాల పరిధిలోని బంగ్లాదేశ్ సరిహద్దు గుండా అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించేందుకు బంగ్లాదేశీయులు చేసిన ప్రయత్నాలను బిఎస్‌ఎఫ్ సిబ్బంది భగ్నం చేశారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రవేశించేందుకు అవకాశమున్నందున నందన్‌పూర్, ఫార్జిపరా, హరినాథ్‌పూర్, చరియత్‌పూర్ అవుట్ పోస్టుల్లో భద్రతను బిఎస్‌ఎఫ్ మరింత కట్టుదిట్టం చేసింది.

# 'స్థానిక' ఎన్నికల్లో శివసేన ఒంటరి పోటీ

## సంజయ్ రౌత్ ప్రకటన



**నాగ్‌పూర్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని మహారాష్ట్రలోని మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) లో భాగస్వామ్యపక్షంగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని (యుబిటి) ప్రకటించింది. దీంతో ప్రతిపక్ష కూటమి ఐక్యత ప్రశ్నార్థకంగా మారింది. కూటమిలోని ఆయా పార్టీల కార్యకర్తలకు అవకాశాలు కొరవడ్డాయని శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ పేర్కొన్నారు. ఒంటరిగా పోటీ చేయడానికి సంస్థాగత వృద్ధి హక్కును ప్రధాన పరిగణన అని ఆయన అన్నారు. కాంగ్రెస్‌ను పట్టించుకోకుండా ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్‌కు రెండు రోజుల క్రితం ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన మద్దతు ప్రకటించింది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామన్న రౌత్ ప్రకటనపై కాంగ్రెస్ నేత స్పందిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తుందా లేదా అనే దానిపై పార్టీ కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. అయితే ఇంకా షెడ్యూల్ ప్రకటించాల్సి ఉంది. సేన (యుబిటి) నిర్ణయం ఎంవిఎ సంకీర్ణంలోని మూడు నియోజకవర్గాల ఎన్నికల అవకాశాలను ప్రభావితం చేస్తుందని శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి) ఆందోళన వ్యక్తం చేసింది. శివసేన (యుబిటి), కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి)లతో కూడిన ఇండియా కూటమి, మహా వికాస్ అఘాడీ పొత్తులు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం ఉద్దేశించబడినవని రౌత్ అన్నారు. 'కూటమిలో వ్యక్తిగత పార్టీల కార్యకర్తలకు అవకాశాలు లభించవు. ఇది సంస్థాగత వృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. మేము ముంబై, థానే, నాగ్‌పూర్, ఇతర మునిసిపల్ కార్పొరేషన్లు, జిల్లా పరిషత్‌లు పంచాయతీలో సొంతంగా పోటీ చేస్తాం' అని రౌత్ విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. ఒంటరిగా పోటీ చేయాలనే సంకేతాలను ఉద్ధవ్ ఠాక్రే కూడా ఇచ్చాన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి, శివసేన, ఎన్‌సిపిల మహాయుతి కూటమి రాష్ట్రంలోని 288 సీట్లలో 230 గెలుచుకుంది, దీంతో ఎంవిఎ సంఖ్య 46కు పడిపోయింది. సేన (యుబిటి)20, కాంగ్రెస్ 16, ఎన్‌సిపి (ఎస్‌పి) 10 సీట్లను సాధించుకుంది. కాగా, ఎంవిఎలో సమన్వయం లేకపోవడానికి కాంగ్రెస్సే కారణమని రౌత్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎంవిఎ ఓటమిపై నిందలు వేసే ఆటలో పాల్గొన్నందుకు కాంగ్రెస్ నాయకుడు విజయ్ వాడేట్టివార్‌ను రౌత్ విమర్శిస్తూ, ఏకాభిప్రాయం, రాజీపై నమ్మకం లేని వారికి కూటమిలో ఉండే హక్కు లేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ఇండియా కూటమి ఒక్క సమావేశాన్ని కూడా నిర్వహించలేదని ఆయన పేర్కొన్నారు. 'ఇండియా కూటమికి కన్వీనర్‌ను కూడా నియమించలేకపోయాము. ఇది మంచిది కాదు. కూటమిలో అతిపెద్ద పార్టీగా సమావేశం ఏర్పాటు చేయడం కాంగ్రెస్ బాధ్యత' అని సేన (యుబిటి) ఎంపి అన్నారు. శివసేన (యుబిటి) ఒంటరిగా పోటీ చేయాలనుకుంటే, వారిని ఆపలేమని శాసనసభలో ఎన్‌సిపి (ఎస్‌పి) పక్ష నాయకుడు జితేంద్ర అవద్ అన్నారు. 'వారు ఒంటరిగా పోటీ చేయాలనుకుంటే, వారిని ఆపడానికి మనం ఎవరు? బలవంతంగా ఎవరినీ కలుపుకుని వెళ్లలేము. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత మనం కలిసి ఉండాలి. అది సరైన నిర్ణయం కాదని నేను అనుకుంటున్నాను. మూడు ఎంవిఎ పార్టీలకు ఎన్నికల అవకాశాలు ప్రభావితం అవుతాయి' అని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీలు ఎల్లప్పుడూ ఒంటరిగా పోటీ చేస్తాయని ఎన్‌సిపి (ఎస్‌పి) వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సులే అన్నారు. శివసేన (యుబిటి) ఒంటరి మార్గాన్ని ఎంచుకుంటే, కాంగ్రెస్ కూడా అలా చేయడానికి సిద్ధంగా ఉందని నాగ్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వికాస్ ఠాక్రే అన్నారు.

## అసోం బొగ్గు గని నుంచి

# మూడు మృతదేహాలు వెలికితీత

## కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



**గౌహతి:** వరదలు ముంచెత్తిన అసోంలోని బొగ్గు గని నుంచి మరో మూడు మృతదేహాలను వెలికితీశారు. దీంతో ఆ బొగ్గు గనిలో చిక్కుకున్న కార్మికుల్లో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరింది. మిగతా వారి కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. జనవరి 6న దిమా హసావో జిల్లా ఉమ్రాంగ్సోలోని బొగ్గు గనిలోకి అకస్మాత్తుగా వరద నీరు చేరింది. అసోం–మేఘాలయ సరిహద్దు సమీపంలోని పాడుబడిన 340 అడుగుల లోతైన ఈ 'ఎలుక రంధ్రం' గనిలో 9 మంది కార్మికులు చిక్కుకున్నారు. రెస్క్యూ బృందం, ఆర్మీ డైవర్లు కలిసి వారిని రక్షించేందుకు ఆరు రోజులుగా ప్రయత్నిస్తున్నారు. కాగా, శనివారం ఉదయం తొలుత ఒక మృతదేహాన్ని రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. కలమతి గ్రామానికి చెందిన 27 ఏళ్ల లిజెన్ మాగర్‌గా మృతుడ్ని గుర్తించారు. అనంతరం మరో రెండు మృతదేహాలను బయటకు తీశారు. అయితే ఇద్దరి మృతులను ఇంకా గుర్తించలేదు. మరోవైపు నేపాల్‌కు చెందిన గంగా బహదూర్ శ్రేష్ఠో మృతదేహాన్ని బుధవారం వెలికితీశారు. దీంతో బొగ్గు గనిలో చిక్కుకున్న 9 మంది కార్మికుల్లో ఇప్పటి వరకు నలుగురు మరణించారు. మరో ఐదుగురు కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. నీటిని తోడితే గాని పూర్తిస్థాయిలో సహాయక చర్యలు సాధ్యం కావని అధికారులు పేర్కొన్నారు. 12 ఏళ్ల కింద వదిలేసిన ఈ బొగ్గు గనిలో అక్రమ తవ్వకాలకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# లివ్–ఇన్ పార్టనర్ హత్య!

## 10 నెలలుగా ఫ్రిడ్జ్‌లో మహిళ మృతదేహం



**దేవాస్ :** మధ్యప్రదేశ్ దేవాస్ జిల్లాలో ఫ్రిడ్జ్‌లో మహిళ మృతదేహం శుక్రవారం లభించింది. 10 నెలల క్రితం హత్య జరిగినట్లు తెలుస్తోంది. ఆ మహిళ లివ్ ఇన్ పార్టనర్ ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతడిని ప్రశ్నించారు. ప్రాథమిక విచారణలో నిందితుడు నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిఎన్‌పి(బ్యాంక్ నోట్ ప్రెస్) పోలీస్ స్టేషన్ పరిధిలోని బృందావన్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లోని ఫ్రిడ్జ్‌లో మహిళ మృతదేహం లభించింది. ఆ ఇంటి యజమాని ధీరేంద్ర శ్రీవాస్తవ్. అతడు ప్రస్తుతం ఇండోర్ నివాసం ఉంటున్నాడు. ఘటన జరిగిన ఇంటిని ఇటీవల బల్‌బీర్ రాజ్‌పుత్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. అయితే, చాలా కాలంగా ఇంటికి తాళం వేసి ఉంది. ఈ క్రమంలో ఇంటిని శుభ్రం చేద్దామని బల్‌బీర్ శుక్రవారం తాళం తీశాడు. క్లీన్ చేస్తున్న క్రమంలో ఫ్రిడ్జ్ ఓపెన్ చేశాడు. అందులో మహిళ మృతదేహం కుక్కి కనిపించింది. వెంటనే బల్‌బీర్ పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఆ ఇంటి చుట్టుపక్కల నివసించే వారిని విచారించారు. ఈ క్రమంలో బల్‌బీర్ రాజ్‌పుత్ కంటే ముందు ఆ ఇంట్లో ఉజ్జయినికి చెందిన సంజయ్ పటిదార్ అనే వ్యక్తి ఉండేవాడని వారు చెప్పారు. అతడితో పాటు ప్రతిభ అలియాస్ పింకీ ప్రజాపతి అనే మహిళ ఉండేదని పోలీసులకు తెలిపారు. అయితే బాధితురాలు 2024 మార్చి నుంచి కనిపించడం లేదని, ఇదే విషయం సంజయ్‌ను అడిగితే పింకీ తన తల్లి ఇంటికి వెళ్లిందని చెప్పాడని పేర్కొన్నారు. ప్రాథమిక వివరాలు సేకరించిన పోలీసులు నిందితుడు సంజయ్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి సంజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు వారి శైలిలో విచారిస్తే, నిందితుడు నేరం అంగీకరించాడు. హత్యకు ముందు ఐదేళ్లుగా ప్రతిభతో లివ్ ఇన్ లిషేషన్ షిప్‌లో ఉన్నానని చెప్పాడు. ఆమె తరచూ పెళ్లి చేసుకోమని ఒత్తిడి తేవడం వల్ల, వినోద్ దవే అనే వ్యక్తి సాయంతో చంపేశానని చెప్పాడు. నేరాన్ని కప్పిపుచ్చడానికి నిందితులు మృతదేహాన్న ఫ్రిడ్జ్‌లో కుక్కారని పోలీసులు తెలిపారు. ఫ్రిడ్జ్‌ను వస్త్రంతో గట్టిగా కట్టి, ఇంటికి తాళం వేసినట్లు వెల్లడించారు. నిందితుడు, తన లివ్ ఇన్ పార్టనర్ ప్రతిభతో ఉజ్జయినిలో మూడేళ్లు ఉన్నాడని, అనంతరం బృందావన్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడని చెప్పారు.

# ఓటర్ స్కామ్'పై చర్యలు తీసుకోండి

## సిఇసికి కేజ్రీవాల్ లేఖ



**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాపై రగడ ముదురుతోంది. న్యూఢిల్లీ నియోజకవర్గంలో 'ఓటర్ స్కామ్' ఆరోపణలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమాకు శనివారంనాడు లేఖ రాశారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి కేజ్రీవాల్ పోటీ చేస్తున్నారు. నకిలీ ఓట్లు సృష్టించేందుకు బిజెపి కొత్త మార్గం ఎంచుకుందని సిఇసికి రాసిన లేఖలో ఆరోపించారు. కేంద్ర మంత్రులు, బిజెపి నేతల తమ ఇంటి అడ్రెస్సులతో నకిలీ ఓట్లు సృష్టించుకుంటున్నారని అన్నారు. తక్షణం వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆయన కోరారు. బిజెపి అభ్యర్థి పర్వేష్ వర్మ అడ్రస్‌తో 33 కొత్త ఓట్ల నమోదుకు అప్లికేషన్ ఇవ్వడం జరిగిందని సిఇసి దృష్టికి తెచ్చారు. తక్షణం వర్మ అభ్యర్థిత్వంపై అనర్హత వేటు వేయాలని కోరారు. దీనికి ముందు, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సైతం సిఇసి అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాశారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఎన్నికల జాబితా మానిప్యులేషన్ జరుగుతోందని ఆరోపిస్తూ, వ్యక్తిగతంగా కలుసుకుని వివరాలు తెలియజేసేందుకు తక్షణం అపాయింట్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గత ముదురోజుల్లో సిఇసికి అతిషి లేఖ రాయడం ఇది రెండోసారి. జనవరి 5న కూడా ఓటర్ల జాబితా అవకతకవలపై చర్చించేందుకు తనకు సమయం ఇవ్వాలని సిఇసి లేఖ రాశారు. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

# జడ్‌మోడ్ టన్నెల్ ప్రారంభం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లోని సోన్‌మార్గ్ ప్రాంతంలో జడ్‌మోడ్ టన్నెల్ నిర్మాణం పూర్తయింది. దీని ప్రయోజనాలను వివరిస్తూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పెట్టిన పోస్టుపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. టన్నెల్ నిర్మాణంపై హర్షం వ్యక్తం చేసిన ప్రధాని.. ప్రారంభోత్సవానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. టన్నెల్ ప్రారంభోత్సవానికి సోన్ మార్గ్ వచ్చేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. టన్నెల్ అందుబాటులోకి వస్తే పర్యటకం, స్థానిక ఆర్థిక రంగాలకు కలిగే ప్రయోజనాలను చక్కగా వివరించారు. టన్నెల్ సంబంధిత ఫొటోలు, వీడియోలు ఎంతో బాగున్నాయి అంటూ ప్రధాని కితాబిచ్చారు. జమ్ముకశ్మీర్‌లోని సోన్ మార్గ్ ప్రాంతంలో దాదాపు రూ.2,700 కోట్లతో జెడ్ మోడ్ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టారు. కొండచరియలు, మంచు కారణంగా రాకపోకలకు సమస్యగా మారడంతో.. 12 కిలోమీటర్ల రహదారిని సొరంగ మార్గంలో నిర్మించారు. ఇది సముద్ర మట్టానికి 8,650 అడుగుల ఎత్తులో ఉంది. శ్రీనగర్ సోన్‌మార్గ్‌ల మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. ఈ టన్నెల్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సిఎం ఒమర్ అబ్దుల్లా ఎక్స్‌లో షేర్ చేశారు. సోన్ మార్గ్ టన్నెల్ పర్యటకులకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. అంతేకాకుండా శ్రీనగర్ నుంచి కార్గిల్/ లేహ్‌కు మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది అంటూ ఈ ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించారు. జనవరి 13న ఈ టన్నెల్ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ విచ్చేయనున్నారు.

# రైల్వేస్టేషన్‌లో కూలిన ప్రవేశద్వారం పైకప్పు



**కన్నౌజ్ :** రైల్వేస్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న ప్రవేశద్వారం పైకప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. దాంతో నిర్మాణ పనులు చేస్తున్న పలువురు కూలీలు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఘటనపై సమాచారం అందిన వెంటనే రెస్క్యూ టీమ్స్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నాయి. సహాయక చర్యలు మొదలుపెట్టాయి. రక్షణ బలగాలు శిథిలాల కింది నుంచి 23 మందిని వెలికితీశాయి. వారిలో స్వల్పంగా గాయపడిన 20 మంది కన్నౌజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన చికిత్స నిమిత్తం లక్నో ఆస్పత్రికి తరలించారు. శిథిలాల కింద చిక్కు కున్న మిగతా వారిని కూడా రక్షించేందుకు సహాయక చర్యలు కొన సాగుతున్నాయి. కన్నౌజ్ రైల్వేస్టేషన్ ముందుభాగాన్ని మరింత ఆధునీకరించడం కోసం ప్రవేశంద్వారం దగ్గర భారీ పైకప్పు నిర్మి స్తున్నారు. కాగా, ఘటనపై యుపి ముఖ్యమంత్రి యోగీ ఆదిత్య నాథ్ స్పందించారు. ప్రమాద ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సిఎం యోగి చెప్పారు. వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి తక్షణమే అవసరమైన మెడికల్ ట్రీట్‌మెంట్‌ను సమకూర్చాలని సూచించారు. బాధితులంతా త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు.

## నేడు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటన



ప్రజాపక్షం/హుజూర్‌నగర్/నేరేడుచర్ల: నేడు (ఆదివారం) మండలంలో రాష్ట్ర నీటి పారుదల, పౌరస రఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించి రూ. 18.57కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కల్లూరులో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన అనంతరం ముస్లీం సోదరులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. దిర్శించర్ల నుండి చిట్టెపుబారిగూడెం వరకు రూ. 3.20లక్షలతో సిఆర్ఆర్ నిధులతో నిర్మించి బిడి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. పట్టణంలోని శివాలయం బైపాస్ ఆర్చి వద్ద 2.79కోట్లతో నిర్మించే జానపహాడ్ నుండి హుజూర్ నగర్ వరకు ఆర్ అండ్ బి రోడ్డు పనులకు, జానపహాడ్ నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు 52 లక్షలతో సిసిరోడ్డు, మెయిన్ రోడ్డు నుండి హిందు శ్మశానవాటిక వరకు 1.30లక్షలతో నిర్మించే సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఎన్ఎస్‌పి క్యాంపు వద్ద రూ. 50లక్షలతో సిసి డ్రైన్, రూ. 30లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణం, ఎన్‌టిఆర్ నగర్‌లో 33లక్షలతో సిసిరోడ్డు, 2.84కోట్ల టియు ఎఫ్ఐ డిసి నిధులతో ఆర్ 3 కాలువ నుండి 6వ వార్డు కల్వర్టు వరకు సిసి డ్రైన్ పనులు, రూ. 40లక్షల వ్యయంతో టౌన్ హాల్ మొదటి అంతస్తు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారవర్గాలు తెలిపారు.

## స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం



ప్రజాపక్షం/యాదాద్రి : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం భావితరాలకు చాటి చెప్పాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలలో పాల్గొని వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓబన్న 1840 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టిన భూమి శిస్తు విధానం వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవదీశారు. ఈ ఉద్యమానికి ఓబన్న చిన్న , సన్న కారు ,మధ్యతరగతి రైతులను సంచార జాతుల వారితో సుమారు పదివేల మందిని కూడగట్టి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పేద రైతుల పక్షాన నిలబడి విరోచిత పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ జడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్‌డిఓలు, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యాదయ్య, జిల్లా అధికారులు బి.సి కుల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కార్యాలయంపై యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ కార్యకర్తల దాడి



ప్రజాపక్షం/భువనగిరి : రాష్ట్రంలో దుమారం లేపుతున్న బిఆర్ఎస్ కార్యాలయం పై దాడి సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బిఆర్ఎస్ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పాలన చేతకాని నాయకులు కాంగ్రెస్ అధిష్టానం మెప్పు పొందేందుకు మాజి ముఖ్యమంత్రి కెసిఆర్‌ను విమర్శించడం కెటిఆర్‌పై తప్పుడు కేసులు పెడుతూ బిఆర్ఎస్ నాయకులను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు జడల అమరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. బిఆర్ఎస్ అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను మీడియాలో వీక్షించిన ఎన్ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బిఆర్ఎస్ కార్యాలయం చేరి దాడికి పాల్పడ్డారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోకి ప్రవేశించి ఫర్నిచర్‌ను విరగ్గొట్టడంతో పాటు కార్యాలయంలో ఉన్న ఫ్లెక్సీలను చింపి వేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడికి నిరసనగా భువనగిరి పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి అనంతరం కాంగ్రెస్ నాయకులపై మాజి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరిస్థితులు అదుపు తప్పిపోకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు డీసీపీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో అటు బిఆర్ఎస్ కార్యాలయం, ఇటు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, పట్టణంలోని ముఖ్యమైన కూడళ్ల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ దాడి హేయనీయం

ప్రజాపక్షం/యాదాద్రి ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి హేయనీయమని టిఆర్ఎస్ రాష్ట నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మోసపు హామీలతో గద్దెనెక్కిన నాటి నుంచి ఇచ్చిన హామీలు అమలు చేయలేక 6 గ్యారెంటీలపై ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యాలయాలపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతూ దాడులకు పాల్పడుతుందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యన్ని పాతరేస్తూ హింసను ప్రేరేపిస్తుందని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పిందని అన్నారు. ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ మంత్రులు, నాయకులు దాడులకు పాల్పడడమే ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలనా సమాధానం చెప్పాలని నిలదీశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: జిల్లా కేంద్రంలోని 60ఫీట్ల రోడ్డులో 232 సర్వే నెంబర్‌లోని తమ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచందర్ నాయక్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యజమాని గుండపనేని సుధాకర్ రావు అన్నారు. శనివారం భూమిలో కంచే వేస్తున్న పనులను అడ్డుకొని మీడియాతో మాట్లాడారు. తాము ఈ భూమిని 1990లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2010లో తప్పుడు పాస్‌బుక్కులతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకోని మా భూమిపై గౌర్జన్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు పాస్ బుక్కును నాటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ శ్యామ్ రిజ్వే రద్దు చేస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. అధికార పార్టీని అడ్డం పెట్టుకొని మా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి బాధ్యత తీసుకుంటా

### రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



ప్రజాపక్షం/చివ్వెంల: ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి పూర్తి బాధ్యతను తాను తీసుకుంటానని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీ నర్సింహ్మాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ ఊర రాంమూర్తి యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గిరిదుర్గం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుండి అధిక నిధులు తీసుకవచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్‌తో పాటు ఇతర సమస్యలు లేకుండా ఏర్పాట్లను చేస్తామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్యలో 1500 ఎకరాల్లో విస్తరించి ఉన్న గిరిదుర్గంను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. గిరిదుర్గం అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు దాతలు సహకరించాలని కోరారు. తన వంతు సహాయంగా రూ. 1లక్షను విరాళంగా ప్రకటించారు. అనంతరం ఉండ్రుగొండ గిరిదుర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ రాంమూర్తి యాదవ్ రూ. 1లక్షల విరాళం అందించారు. దాతలు సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, ఆలయ కమిటీ చైర్మన్ చకిలం కృష్ణకుమార్, బందకవి కృష్ణమోహన్, కౌన్సిలర్ ఎండి షఫిఉల్లా, మాజీ కౌన్సిలర్లు ఊర గాయత్రి, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, జ్యోతి కరుణాకర్, ధర్మా నాయక్ పాల్గొన్నారు.

### పాఠశాలల బలోపేతానికి కృషి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో టిపిటియు జిల్లా నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు బంగారుబాటలు వేయాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడపర్తి శ్రీనివాస్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి నాగయ్య, జిల్లా సహాధ్యక్షులు బచ్చుపల్లి శంకర్ రావు, కృష్ణ, బత్తుల ఉపేందర్, ఉదయ్, కేశయ్య, రమేష్, అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



## జీతభత్యాలను ఇచ్చే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : తిరుమల తిరుపతి దేవస్థానంలో కాంట్రాక్టు ప్రాతిపధికన ఆఫీసర్, స్పెషల్ ఆఫీసర్ డ్యూటీగా విధులు నిర్వహించేందుకు గాను ప్రభుత్వం నియమించిన ఉద్యోగికి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నర్సింహస్వామి దేవస్థానం నిధుల నుండి జీతభత్యాలు ఇచ్చే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిటిడిలో స్పెషల్ డ్యూటీ ఆఫీసర్‌గా పనిచేయడానికి గణేష్ కుమార్‌ను నియామకం చేశారని, ఈ ఆఫీసర్‌కు తెలంగాణ రాష్ట్రంలోని శ్రీలక్ష్మి నర్సింహస్వామి దేవస్థానం నిధుల నుండి ప్రతీనెల రూ.లక్ష ఇవ్వడం సరైంది కాదన్నారు. వెంటనే తెలంగాణ ఎండోమెంటు కమీషనర్‌కు జీతభత్యాలు ఇచ్చే విషయమై ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరారు. పుణ్యక్షేత్రమైన లక్ష్మి నర్సింహ స్వామి ఆలయంలో పునః నిర్మాణం చేసినప్పటికీ భక్తులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మండల సెక్రెటరీ కల్లె పల్లి మహేందర్, మాజీ కోఆప్షన్ మేబార్ పెంటయ్య, గోరేటి రాములు, పేరబోయిన బంగారం, మాటూరు మల్లయ్య, గోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.

## బస్సుల కోసం పడిగాపులు



ప్రజాపక్షం/ఉండవల్లి: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కావడం వలన ఆంధ్రప్రదేశ్ తెలంగాణ సరిహద్దు అల్లంపూర్ చౌరస్తాలో బస్సులు లేనందున ప్రయాణికులు విద్యార్థులు ఎదురుచూపులు తప్పడం లేదు శనివారం నుండి సంక్రాంతి సెలవులు ఉండడం వలన హాస్టల్లోని విద్యార్థులు పిల్లలు తల్లిదండ్రులు సహా దూర ప్రాంతాల నుంచి పిల్లలు తీసుకునే పనిలో బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు సమయపాలనకు బస్సులు రాకపోవడంతో ఆకలి దప్పులు కొని సాయంత్రం వరకు నిరీక్షణ పరిస్థితులు ఉన్నాయి. అల్లంపూర్ నియోజకవర్గం లోను బస్సులు లేనందునం మండలాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. పండగ పబ్బులకు శుభ కార్యాలకు వెళ్ళేందుకు బస్సుల సమస్య పీడిస్తుందని రాష్ట్రం ఏర్పడిన అనంతరం రవాణా సౌకర్యం లో పూర్తిగా వెనుకబడి ఉన్నదని స్థానికులు విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతర నడిగడ్డ ప్రాంతమైన అల్లంపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిన విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సరిహద్దు ప్రాంతమైన అల్లంపూర్ నియోజకవర్గం రవణ రంగాన్ని మెరుగుపరచాలని పల్లెల్లోని ప్రజలు బస్సు సౌకర్యం లేనందున ప్రైవేటు వాహనాల పై ఆధార పడాల్సి వస్తుందని గత్యంతరం లేక వాళ్ళు అడిగిన కాడికి సొమ్ము ఇచ్చుకొని సమస్యను పరిష్కరించే దిశలో ప్రయాణిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులపాలు: ఎంఎల్ఏ వీరేశం



ప్రజాపక్షం/చిట్యాల(నకిరేకల్): బిఆర్ఎస్ తన పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, దాన్ని సరిదిద్దుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అహర్నిశలు కష్ట పడుతుందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 195 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రూ. 55 కోట్లను గుట్టు చప్పుడు కాకుండా విదేశీ కంపెనీలకు బదిలీ చేసి అవినీతికి పాల్పడిన కెటిఆర్‌పై కేసు పెడితే ఆ పార్టీ నాయకులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్‌లోపు వాడకం దారులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలులోకి తీసుకు వచ్చిందని, రుణమాఫీ క్రింద మన నియోజకవర్గంలో 30వేల పై చిలుకు రైతులు లబ్ధి పొందారన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు రూ. 33 కోట్లు, పిలాయిపల్లికి రూ. 93 కోట్లు, ధర్మారెడ్డి కాల్వకు రూ. 129 కోట్లు పై నిధులు ప్రభుత్వం కేటాయించిందన్నారు. నీటి పారుదల విషయంలో గత ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు దానిని చక్కదిద్దుతున్నామని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు తప్ప మిగత సమయంలో అన్ని పక్షాల ప్రజలు తనకు సమానమేనని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటానని వీరేశం అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకటరెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటి చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వర్లు, చిట్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జడల చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వివిధ పథకాల అమలుకు జాబితా ప్రక్రియ వేగవంతం



జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/యాదాద్రి : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను, రేషన్ కార్డు వంటి పథకాలు పారదర్శకంగా సమర్ధవంతంగా అమలు చేసేందుకు జాబితా తయారు చేసి ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, రేషన్ కార్డు వంటి సంక్షేమ పథకాల పై రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి అమలుపై సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల, రేషన్ కార్డు వంటి ప్యూరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతు భరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, లబ్ధిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడానికి అవసరమైన జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్యూరిఫికేషన్ ప్రక్రియ 15వ తేదీ నుంచి ధ్రువీకరణ ప్రక్రియ ప్రారంభించి, 16వ నుండి 20వ తేదీ వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. 21వ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి, పథకాల మీద సాటింపు వేయాలన్నారు. తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ శిక్షణ ఇచ్చి డేటాను సక్రమంగా సమీక్షించి, సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ రెవిన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, ఎంపీడీవోలు, తాసిల్దారులు వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, జిల్లా పంచాయతీ అధికారి సునంద ఏడీఏ, ఆర్ఐలు, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నల జీవితాల్లో వెలుగులు



ప్రజాపక్షం /మునుగోడు: పద్మశాలి నేతన్నలకు నేతన్న పొదుపు భద్రతా భరోసా చేనేత అభయహస్తం చేనేత, మర మగ్గాల కార్మికుల సంక్షేమం కోసం మరెన్నో కొత్త పథకాలు తీసు కొచ్చి నేతన్నల జీవితాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెలుగులు నింపారని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత అన్నా రు. నేతన్నలకు నూతన పథకాలను ప్రవేశపెట్టిన సందర్భంగా మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులకు, స్థాని క ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు శనివారం మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో చేనేత కార్మికులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి యువజన సంఘం ప్రెసిడెంట్ అవ్వరు భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి,మునుగోడు పద్మశాలి సంఘం నాయ కులు గంజి బిక్షం, సంగిశెట్టి పరమేశ,కోణం జగన్నాథం, గంజి నరేందర్, బొల్ల పరమేశ, అల్వాల వెంకయ్య పాల్గొన్నారు.

## మరియమ్మకు సిపిఐ నివాళి

ప్రజాపక్షం/డిండి: సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు గోరటి వెంకటయ్య సతీమణి గోరటి మరియమ్మ 5వ వర్ధంతి సందర్భంగా శనివారం తౌక్లాపూర్ గ్రామంలో ఆమె సమాధి వద్ద సిపిఐ డిండి మండల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఐ కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా సమితి సభ్యులు బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనోద్దీన్, మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి విజేందర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు రవీంద్రశర్మ, హుస్సేన్, శ్రీనయ్య, వెంకటేశ్వర్లు, శాఖ కార్యదర్శి చక్రి, కందుకూరు శాఖ కార్యదర్శి శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, వెంకటయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## పథకాల అమలుకు అధికారులు సంసిద్ధం కావాలి



ప్రజాపక్షం/నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుకు అధికారులు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.శనివారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పై పథకాల సంసిద్ధత, కార్యాచరణ ప్రణాళిక, పథకం ముఖ్య ఉద్దేశాలు ,విధివిధానాలు, తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, ఆర్‌డిఓలతో సమావేశం నిర్వహించారు.శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి,మంత్రులు,రాష్ట్ర స్థాయి అధికారులతో హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయా పథకాల అమలుపై నిర్దేశించిన ఆదేశాలను జిల్లా కలెక్టర్ అధికారులకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి అమలు చేయనున్న పథకాలలో రైతు భరోసా కింద వ్యవసాయ యోగ్యమైన భూమికి మాత్రమే ప్రతి సంవత్సరం ఎకరాకు 12 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని, భూభారతి (ధరణి పోర్టల్ )లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూముల గుర్తింపు, వ్యవసాయ యోగ్యం కానీ భూములను నిర్ధారించే పద్ధతి వివరాలను కలెక్టర్ తెలిపారు. వన్ స్టేట్ వన్ రేషన్ కార్డు పద్ధతిలో వీటిని పంపిణీ చేయడం జరుగుతుందని, అర్హత కలిగిన వ్యక్తి ఒకే ఒక రేషన్ కార్డులో మాత్రమే ఉండేలా ప్రభుత్వం ఆదేశించిందని వెల్లడించారు.ఈ సమావేశానికి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డిఆర్ఓ అమరేందర్ ,స్పెషల్ కలెక్టర్ నటరాజ్ ,జిల్లా అధికారులు హాజరయ్యారు.

## హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్

### నల్లగొండలో నేటి కెటిఆర్ రైతు మహాధర్నా వాయిదా: రవీందర్ కుమార్



ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి: తెలంగాణ లో కాంగ్రెస్ సర్కార్ అభి వృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తు ఏడాది కాలంగా సిఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు లగచర్ల, హైడ్రా, మూసి లాంటి అంశాల్లో ప్రజల పక్షాననిలబడి కేటీఆర్ చేస్తున్న పోరాటాన్ని సహించ లేక అక్రమ కేసులు పెడుతున్నారని బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు రవీందర్ కుమార్ ఆరోపించారు.నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయం లో జడ్పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్ రెడ్డి లతో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవీందర్ కుమార్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో 6 గ్యారంటీలు 420 హామీలను ఇచ్చి ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా వైఫల్యం చెందారని విమర్శించారు. అధికారంలోకి రాంగనే రైతుల రెండు లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి కేవలం 40 శాతం మాత్రమే రుణమాఫీ చేసి రైతులను మోసం చేశారన్నారు. నల్లగొండలో 12న కేటీఆర్ రైతు మహా ధర్నాను పండగ ప్రయాణాలు, రహదారుల రద్దీ, పండగ వాతావరణం తదితర కారణాలతో ప్రస్తుతం వాయిదా వేయడం జరిగిందన్నారు.పండగ తర్వాత యధావిధిగా మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ కేటీఆర్ మీద ఈ ఫార్ములా కేసు, లగచర్ల ఇస్యూలో ను ఇరికించాలని ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం దుర్మార్గం చర్య అన్నారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి నిరంజన్ వలి,నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్..సీనియర్ నాయకులు సింగం రామ్మోహన్, మాజీ ఎంపీపీ కరీం పాషా,పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, మండల పార్టీ అధ్యక్షులు అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, కొండూరి సత్యనారాయణ,జమాల్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయం




ప్రజాపక్షం/కోదాడ: కోదాడలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని కోదాడ మాజీ ఎంఎల్ఏ వేనేపల్లి చందర్‌రావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని తేజ పాఠశాల ఆవరణలో ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలో రాణిస్తున్నారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో వారిని ప్రోత్సహిస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని అన్నారు. మొట్ట మొదటిసారిగా రాష్ట్రస్థాయి పోటీలను కోదాడలో పెట్టినందుకు జాతీయ స్థాయి క్రీడాకారిని పోటీల నిర్వాహకురాలు పాలడగు ఖ్యాతిని అభినందించారు. అనంతరం పాలడుగు ఖ్యాతి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలనుండి మొదటి రోజు 120 మంది హాజరయ్యారని, గెలుపొందిన విజేతలకు కోదాడ డిఎస్పీ శ్రీధర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, ముత్తవరపు పాండురంగారావు, మహబూబ్‌జానీ, మేకల వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



## తాగు నీటి కోసం రోడ్డుపైకి..

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: త్రాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారిపై మహిళలు నిరసన చేపట్టడంతో గంట పాటు రవాణ సౌకర్యాలు స్థంబించాయి. జగదేవ్‌పూర్ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామానికి గత వారం రోజులుగా మీషన్ భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి చోటుచేసుకుంది. ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకుపోయిన ఎవరు స్పందించకపోవడంతో శనివారం గ్రామ మహిళలు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. నీటి సమస్య పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని మహిళలు హెచ్చరించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ గ్రామానికి చేరుకోని నీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు.

## ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



ప్రజాపక్షం/పాలకుర్తి : పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బామ్లానాయక్ తండా బిసి కాలనీలోని యూనివర్సల్ ఐఐటి ఫౌండేషన్ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను విద్యార్థులు జరుపుకున్నారు. పాఠశాల అవరణలో 200లకుపైగా ముగ్గులు వేశారు. ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చిన్నారుల వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను తెలియజేసేలా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు అఫ్జల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న పోరాటం.. వీరోచితం



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండలంలోని సాయిబాబా కమాన్ వద్ద వడ్డె ఓబన్న 218 జయంతి వేడుకలు ఘనంగా జరిపారు.శనివారం వడ్డెర సంఘం శివరాత్రి లక్ష్మ ణ్ అద్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.తెల్లదొరలకు వెన్నులో వణుకు పుట్టించారని కాంగ్రెస్ బ్లాక్ అద్యక్షులు నర్సయ్య గుర్తు చేశారు.సైరా నర్సింహరెడ్డికి సైన్యాధ్యక్షులుగా పనిచేశారని బ్రిటిష్ వాళ్ళకు ఎదురుతిరిగి పని చేశారని అన్నారు. సద్దిలక్ష్మారెడ్డి,గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, సుడిద రాజెందర్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ప్రతి విద్యాసంస్థకూ సైకాలజిస్టు ఉండాలి

ప్రజాపక్షం/ కరీంనగర్ ప్రతినిధి : సైకాలజిస్టుల సేవలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అదినేత వి. నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆల్ఫోర్స్ ట్రైనీ టాబ్స్‌లో టిపిఏ రాష్ట్ర శాఖ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన డైరీలు క్యాలెండర్‌లను ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యాసంస్థకు సైకాలజిస్టు అవసరం ఉందని అన్నారు. సైకాలజిస్టు అవసరం మేరకు కౌన్సిల్ ఏర్పాటు చేయవలిసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా సైకాలజీస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎజ్రా మల్లేశం, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు వై. ఆంజనేయులు, మ్యాజిక్ రాజా, అలవాల ఈశ్వర్, సైకాలజిస్టు మెతుకు సత్యం, అనురాధ, ప్రణయ్, మీసాల లలిత, రాధిక శ్రీనివాస్, అనిత తదితరులు పాల్గొన్నారు.



## నవ రామగుండం..నయా గోదావరిఖని

ప్రజాపక్షం/గోదావరిఖని : తాను ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిలోనే రామగుండం నియోజకవర్గంలో మార్పు ప్రారంభించానని, రానున్న 4 ఏళ్ల కాలంలో నవ రామగుండంనయా గోదావరిఖనిగా మారుస్తానని, వట్టి మాటలు కాదు, చేతల్లో పని చేసి చూపిస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ అన్నారు. శనివారం సింగరేణి రామగుండం ఏరియా1 ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తా సమీపాన రూ.15 కోట్లతో చేపట్టున్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులను ఆర్జీ1 జీఎం డి.లలిత్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆయన తన సతిమణీ మనాలి ఠాకూర్, జీఎంలతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి నగరంగా మాత్రమే గోదావరిఖనికి పేరు ఉందని దీనిని మహానగరంగా తీర్చిదిద్దేందుకు 344 గదులతో అతిపెద్ద షాపింగ్ మాల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. దుకాణాలు తొలగించిన వారితోపాటు చిరు వ్యాపారులకు ఈ మాల్‌లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ మాల్ పూర్తయితే గాంధీనగర్, చౌరస్తా, లక్ష్మీ నగర్, కల్యాణ్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య దూరం కానుందన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పడతాయన్నారు. ఈ కాంప్లెక్సు భవనం ఏడాదిలోగా పూర్తి కానుందని దీని నిర్మాణానికి మరో రూ.9 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా 500 మెవావాట్ల సామర్థ్యం గల హైడ్రో పవర్ ప్లాంటును మేడిపల్లి ఓపెన్‌కాస్టు వద్ద, రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్తు ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు, దీంతో రామగుండానికి పూర్వ వైభవనం రానుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, కొలిపాక సుజాత, దుబాసి లలిత, పాతిపెల్లి ఎల్లయ్య, ఎస్వోటూ జీఎం రాంమోహన్, డీజీఎం/పర్సనల్ కిరణ్‌బాబు, అధికారులు డివి.రావు, అంజనేయప్రసాద్, వరప్రసాద్, అంజనేయులు, హనుమంతరావులు పాల్గొన్నారు.



# ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్





ప్రజాపక్షం/ హుస్నాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చ తుందని తెలంగాణ రాష్ట్ర బిసి,రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడు పేర్కొన్నారు. శనివారం అయన పట్టణంలోని పలు కాలనీల్లో సిసిరోడ్లు, మురికి క్వాల నిర్మాణం, పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని ఇందిర మహిళ శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. మార్కెట్ యార్డులో ముగ్గుల పోటీలను పరిశీలించారు. అలాగే మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకాల కింద 330 మంది లబ్దిదారులకు రూ. 3కోట్ల 38 లక్షల పైచిలుకు చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ఖజానా ఖాళీగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్ర యాణం, ప్రతి ఇంటికి 200 యునిట్ల కరంటు, రూ. 500 గ్యాస్, రైతులకు రూ.2లక్షల రుణమాఫి, రైతు భరోసా, భూమిలేని రైతులకు రూ.12వేలు రైతు భరోసా అమలు చేశామన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు అ మలు చేసి ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఆర్ డిఒ రామ్మూర్తి, తహసీల్‌దారు రవీందర్‌రెడ్డి, జిల్లా గ్రం థాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు బొల్లి శెట్టి శివయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ అకుల రజితవెంకన్న, వైస్ చైర్మన్ అనితరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంకచంద్, ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ రవీందర్, కౌన్సిలర్లు నళిని, కొమటి స్వర్ణలత, వల్లపు రాజు, బొజు రమరవీందర్, తదితరులు పాల్గొన్నారు.

### గౌరవెల్లి నిర్వాసితులకు అండగా ఉంటా. .

గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు హామీ ఇచ్చారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలో బిఅర్అర్ కాలని 10 వార్డులో సిసిరోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణం కోసం రూ.50లక్షలతోశంకుస్థాపన చేశా రు. అదనంగా మరో రూ.50వేలు కేటాయించారు. సమావేశంలో మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులు స్వయంగా స్థలాలు కొనుక్కొని కాలనీ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నందుకుసంతోషంగా ఉందన్నారు. కష్టం వచ్చిన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బిఅర్ రెడ్డి కాలని వాసులు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.మిషన్‌భగీరథనీళ్లు వచ్చేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. 25 గుంటల భూమిని ఓపెన్ జిమ్ముకు కేటాయించారు. కాలనీ వాసులకు అండగా ఉన్న 10 వార్డు కౌన్సిలర్ గొవింద రవీందర్‌ను సన్మానించారు.

# పట్టభద్రులను కలుసుకుంటూ..

### ప్రచారంలో దూసుకుపోతున్న ఎంఎల్‌సి అభ్యర్థి 'ఆల్ఫోర్స్' నరేందర్‌రెడ్డి

### కరీంనగర్ మార్క్‌ఫెడ్‌లో మార్నింగ్ 'వాకర్స్‌తో ముఖాముఖి'



ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలపై అవగాహన ఉన్న తాను ఒక వైపు పట్టభద్రులను కలుస్తూ వారి సమస్యలను పరిష్కరిస్తూ ప్రచారంలో నరేందర్ రెడ్డి అందరి కంటే ముందు వరుసలో ఉన్నారు. శనివారం స్థానిక మార్క్‌ఫెడ్ మైదానంలో వాకర్స్‌తో ముఖాముఖీ సమావేశం నిర్వహించి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌ను ఉత్తర తెలంగాణలో హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేస్తానని అన్నారు. పల్లెలన్నీ కనుమరుగు అయిపోయే ప్రమాదం ఉందని యువత బయట దేశాలకువలస వెళ్తున్నారని, నిరుద్యోగ యువతను రూపుమాపేందుకు తన వద్ద ప్రత్యేక కార్యాచరణ ఉందని తను ఎమ్మెల్సీ గా గెలిచిన తరువాత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ఉచితంగా స్టడీ మెటిరియల్ అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కల్వకుంట్ల ప్రమోద్ రావు, సెక్రటరీ గిరిధర్, శ్రీదర్ చారి, మహేష్, ఆవుదరి శ్రీనివాస్, బీర్ల రాజు, వంగ హరీష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## అత్యాధునిక సాంకేతికతతో ఎన్‌టిపిసి'



ప్రజాపక్షం/గోదావరిఖని: ఎన్టీపీసీ వి ద్యుత్తు రంగంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్నదని, ఈ మైలురాయిలో రామగుండం ఎన్‌టిపిసి క్రియాశీల పాత్రను పోషించిందని, దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ప్రాజెక్టుగా రామగుండం ఎన్‌టిపిసి వెలుగొందుతున్నదనిఎన్‌టిపిసి రామగుండం తెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టు హెడ్ చందన్‌కుమార్ సమంత అన్నారు. శనివారం ఎన్‌టిపిసి ఈడీసీ మిలినీయం హాల్‌లో ఎన్‌టిపిసి రామగుండంతెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టుల అధికారులతో మీడియా ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్టీపీసీ గీతంతో దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యుత్తుప్రాజెక్టుల పనితీరు, పర్యావరణ పరిరక్షణ, చుట్టుపక్కల గ్రామాల్లో సీఎస్సాఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రాజెక్టు హెడ్ సమంత మాట్లాడుతూ స్థానిక మీడియా సహకారంతో ఎన్టీపీసీ గడిచిన 40 ఏళ్లలో ఎంతో పురొగతి, అభివృద్ధి సాధించిందని పేర్కొంటూ మీడియా ప్రతినిధులను ఆయన అభినందించారు. తాను గతంలో పనిచేసిన రామగుండం ఎన్టీపీసీకి తిరిగి రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్‌లు (అండ్‌ఎం) ఎకె.త్రిపాఠి, ఎఆర్.డాష్, జనరల్ మేనేజర్(మెయింటెనెన్స్) సంపత్, జనరల్ మేనేజర్ (సీఅండ్‌టీ) సంతోష్ తివారీ, జనరల్ మేనేజర్(ఆపరేషన్స్) కెసి.సింఘారాయ్, హెచ్‌ఓహెచ్ఆర్ బిజోయ్ కుమార్ సిక్దర్, ఎజీఎం(టీఎస్) డిఎస్.రావత్ పాల్గొన్నారు.

# ప్రతి పల్లె అభివృద్ధికీ కృషి



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : రాష్ట్రంలో ప్రతి గ్రామం, ప్రతి పల్లె అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందని సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం సిద్దిపేట నియోజక వర్గం నారాయణరావుపేట మండలంలో అంగన్ వాడి భవనం,లక్ష్మి దేవిపల్లి, కోదండరావుపల్లిలో సిసి రోడ్లు,ఈజిఎస్, 25 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.నియోజకవర్గం ఇంచార్జి పూజల హరికృష్ణ మాట్లాడుతూ నియోజక వర్గంలో అన్ని గ్రామాలకు మౌళిక వసతులు కల్పించటమే లక్ష్యమన్నారు. నియోజక వర్గం లోని అన్ని గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, అంగన్ వాడి భవనాలు, హరితహారం, ప్రకృతి వనాలు, వైకుంఠదామాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు కలిమొద్దీన్,జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ నేతల మందపాండు, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి ,డిసిసి కార్యదర్శి రాజ్‌వీర్, బర్మరాములు, కరుణకర్, షరీఫ్, సదాశివరెడ్డి, సంతోష,ఉమాదేవి, లతరెడ్డి,శారద తదితరులు పాల్గొన్నారు.

# సఫాయిలాలకు సవరించిన వేతనాలివ్వండి



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణిలో సులభ్ కాంప్లెక్స్ లలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సవరించిన వేతనాలను కాంట్రాక్టర్ చెల్లించే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం.ఎ.గౌస్ పేర్కొన్నారు. సింగరేణిలో పని చేస్తున్న సఫాయి కార్మికులకు యాజమాన్యం అక్టోబర్ 2024 నుంచి ప్రభుత్వ జీ.ఓ. నెంబర్ 108 ననుసరించి వేతనాలు సవరించిందని, దీని ప్రకారం జోన్ వన్ లో ఉన్న రామగుండం రీజియన్ లో పని చేస్తున్న వారికి రూ.631.85 పై చెల్లించేందుకు యాజమాన్యం అక్టోబర్ లో ఉత్తర్వులు జారీ చేసిందని, కాని దీని ప్రకారం కాంట్రాక్టర్‌లు చెల్లించడం లేదని, 510 రూపాయలు చెల్లించి ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. యాజమాన్యం స్పందించి జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సులభ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు సవరించిన వేతనాలను చెల్లించాలని, అదేవిధంగా పెరిగిన బకాయి వేతనాలు చెల్లించాలని, అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఉత్తర్వులను కాంట్రాక్టర్ అమలు చేసే విధంగా యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థది ప్రముఖ స్థానం

### రాష్ట్ర హైకోర్టు జడ్జి,జిల్లా అడ్మిస్ట్రేషన్ జడ్జి బి.విజయసేన్‌రెడ్డి



ప్రజాపక్షం/చేర్యాల: ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థకు ప్రముఖ స్థానం ఉందని ప్రజలకు సత్వర న్యాయం అందాలంటే న్యాయవాదులు ఉత్సాహంగా పనిచేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి జిల్లా అడ్మిస్ట్రేషన్ జడ్జి బి.విజయసేన్‌రెడ్డి అన్నారు.శనివారం చేర్యాల పట్టణంలోని ఫస్ట్ క్లాస్ సివిల్ కోర్టును ప్రారంభించారు. వారు మాట్లాడుతూ చేర్యాల, కొమురవెల్లి, ధూళ్మిట్ట, మద్దూర్ ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు చేర్యాల పట్టణంలో జూనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కోర్టు కేసుల పరిష్కారంలో నూతన టెక్నాలజి ఉపయోగకరంగా ఉంటుందని భవిష్యత్తులో ఆర్టిఫిషియన్,ఇంటెలిజెన్స్ న్యాయ వ్యవస్థలో కీలకపాత్ర పోషించనుందని అన్నారు. కుటుంబ తగాదాల కేసులను సామాజిక స్పృహతో పరిష్కరించాలని అన్నారు.తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వవలసింది ఆస్తులు అంతస్తులు కాదని మంచి విద్యా క్రమశిక్షణ అందించాలన్నారు.అనంతరం జనగామ ఎంఎల్‌ఏ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు హైకోర్టు,జిల్లా జడ్జిలను పూష్ప గుచ్చం అందజేసి సన్మానించారు. జిల్లా ఇంచార్జీ కలెక్టర్ అబ్దుల్ హామీద్,సిద్దిపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్,జనార్ధన్ రెడ్డి,జిల్లా ప్రిన్స్‌పల్ సెషన్స్ జడ్జి స్థాయి రమాదేవి, మెదక్ జిల్లా జడ్జి, సిద్దిపేట, మెదక్, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.82.39కోట్లు రైతుల ఖాతాల్లో జమ



ప్రజాపక్షం/మంథని: ఖరీఫ్ సీజన్‌లో వరి ధాన్యం సేకరణలో జిల్లాలోనే మంథని సహకార సంఘంలో అత్యధికంగా ధాన్యం సేకరణ జరిగిందని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. శనివారం సంఘ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మంథని పీఏసీఎస్ పరిధిలోని 34 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా3.69లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. 5237మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేయగా అందులో 4983మంది రైతుల ఖాతాల్లో రూ.85.39కోట్లు జమ చేసినట్లు ఆయన తెలిపారు. మిగతా రైతులకు చెల్లింపులు ప్రగతిలో ఉన్నాయని వివరించారు. ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన సన్నరకం ధాన్యంకు క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్ సైతం చెల్లించడం జరిగిందన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా సాగడంతో పాటు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగాయని, బోనస్ సైతం జమ చేయడం జరిగిందన్నారు. అలాగే ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఇతర అధికారులు సంపూర్ణ సహకారం అందించారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో సహకారం అందించిన రైస్ మిల్లర్లు, హమాలీ కార్మికులు, ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు, సంఘ సిబ్బంది, కేంద్రాల నిర్వాహకులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు

ప్రజాపక్షం / హుజురాబాద్ : కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం, పట్టణానికి చెందిన 169 కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్దిదారులకు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడివో కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రజల తరుపున ఆరు గ్యారంటీల గురించి ప్రశ్నిస్తుంటే, తనపై కేసులు వేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా సియం రేవంత్ రెడ్డి తెలంగాణ పరువు తీస్తున్నాడని అన్నారు. గెలవకముందు ఓడ మల్లన్న, గెలిచిన తరువాత బోడ మల్లన్నగా మారిపోయాడని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో లెక్కలు చెప్పడం కాదు, ప్రజల గుండెల్లో నిలవడం నేర్చుకోవాలన్నారు. దొంగ హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి విర్రవీగుతున్నారని అన్నారు. హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ గందె రాధిక శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఎడవల్లి కొండల్ రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజురాబాద్ మాజీ జెడ్పిటిసి బక్కారెడ్డి, హుజురాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్, మాజీ ఎంపిపి రాణి సురేందర్ రెడ్డి, వైస్ ఎంపిపి బండి రమేష్ ఉన్నారు.

# ప్రజల అభ్యున్నతి కోసమే కలిసి పనిచేయాలి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ప్రజల అభ్యున్నతి కోసం రాజకీయాలకు అతీతంగా నాయకులంతా కలిసి పని చేయాలని కేంద్రహోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో నిత్య జీవితం కొనసాగిస్తారని, దివ్యాంగులకు అండగా ఉండడం మనందరి బాధ్యత అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 69లక్షల 54వేలు విలువ చేసే 674 పరికరాలను 322 దివ్యాంగులకు అలింకో సంస్థ ద్వారా పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రాజకీయాలకు అతీతంగా ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నాయకులంతా కలిసికట్టుగా పని చేస్తున్నామన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు చెందిన నాయకులు కరీంనగర్ జిల్లాలో గొప్ప స్థాయికి ఎదగడం వ్యక్తిగతంగా చాలా సంతోషంగా ఉందన్నారు.నేడు జిల్లాలో 322 మంది దివ్యాంగులకు 674 ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామ న్నారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ అలింకో ద్వారా ఆగస్టు 4 నుండి ఆగస్టు 10 వరకు క్యాంప్ నిర్వహించి 675 మంది దివ్యాంగులను ఎంపిక చేసి 65లక్షలకు పైగా విలువ గల ఉపకరణాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. సిరిసిల్ల గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, వికలాంగుల సంక్షేమం అధ్యక్షులు రాము, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ కళా చక్రపాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మి రాజం, తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నల కుటుంబాల్లో ధీమా



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం తెలంగాణలోని నేతన్నల కుటుంబాలకుఆర్థిక అభివృద్ధి కోసం భవిష్యత్తు భద్రత కోసం ప్రకటించిన మూడు పథకాలు నేతన్నల కుటుంబాలలో ధీమా ను నింపిందని లాల్ బహుట పవర్ లూం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం రవి, పద్మశాలీ సంఘం అధ్యక్షులు గోలి వెంకటరమణ అన్నారు. శనివారం సిరిసిల్ల పద్మశాలీ సంఘం సమావేశంనిర్వహించివారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాల స్థితిగతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వారికి అవసరమైన పథకాలను తీసుకురావడం చాలా అభినందనీయమన్నారు. ఈ పథకాలు తీసుకురావడానికి కృషి చేసిన చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు,వేములవాడనియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అందరికి అందాలంటే పరిశ్రమలో పని చేస్తున్న అన్ని రంగాల వారికి కూడా చేనేత జౌళి శాఖ కార్డులు ఇవ్వాలని, ఆసాములకు ఈ పథకం వర్తించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత సెల్‌నాయకులు బండారి అశోక్, పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి మండల సత్యం, పవర్‌లూం కార్పోరేషన్ జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ ఫోకస్



ఆస్ట్రేలియన్ ఓపెన్ జరిగే మెల్బోర్న్ పార్క్‌లో మొత్తం 39 కోర్టులు ఉన్నాయి. వీటిలో పెద్దది, ముఖ్యమైనది రాడ్ లేవర్ ఎరీనా. ఈ కోర్టుపై జరిగే మ్యాచ్‌లను 15,000 మంది ప్రత్యక్షంగా తిలకించే అవకాశం ఉంది. 'పీపుల్స్ కోర్ట్' జాన్ కెయిన్ ఎరీనా, మార్గరెట్ కోర్ట్ ఎరీనాలలోనూ కీలక మ్యాచ్‌లు జరుగుతాయి.

## గ్రాండ్‌ప్రీ పోరు..'ఆస్ట్రేలియా'తో షురూ..






ప్రపంచ టెన్నిస్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్లు నాలుగు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో మొదలై, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ తర్వాత యుఎస్ ఓపెన్‌తో పూర్తవుతాయి. ఈ నాలుగు మేజర్ టోర్నీలను 'గ్రాండ్‌శ్లామ్'గా పిలుస్తారు. ఈ ఏడాది మొదటి గ్రాండ్‌శ్లామ్, ఆస్ట్రేలియన్ ఓపెన్, సిడ్నీలో ఈనెల 12 నుంచి 26 వరకు జరుగుతుంది. పురుషుల సింగిల్స్‌లో జానిక్ సిన్నర్ (ఇటలీ), మహిళల సింగిల్స్‌లో అరినా సబలెన్కా (బెలారస్) డిఫెండింగ్ చాంపియన్లుగా బరిలోకి దిగుతుండగా, పురుషుల డబుల్స్‌లో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి టైటిల్ గెల్చుకున్న భారత వెటరన్ ఆటగాడు రోహన్ బొపన్న ఈ ఏడాది కొలంబియాకు చెందిన నికొలస్ బారింటన్స్‌తో కలిసి కోర్టులోకి దిగుతాడు. నిరుడు బొపన్నతో కలిసిన ఎబ్డెన్ ఈసారి బెల్జియం ఆటగాడు జొలాన్ ఫ్లీగెన్ భాగస్వామిగా పోటీలో ఉంటాడు. పురుషుల సింగిల్స్‌లో మన దేశం తరఫున ఈసారి సుమీత్ నాగర్ పోటీపడతాడు. గత ఏడాది పురుషుల డబుల్స్‌లో బొపన్న, ఎబ్డెన్ జోడీ 7–6, 7–5 ఆధిక్యంతో ఇటలీ ఆటగాళ్లు సిమోన్ బోలెల్లి, ఆండ్రియా వవాస్సన్‌ను ఓడించి టైటిల్ అందుకున్నారు. పురుషుల సింగిల్స్‌లో సిన్నర్ 3–6, 3–6, 6–4, 6–4, 6–3 స్కోరుతో డానియల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఓడించాడు. మొదటి రెండు సెట్లు చేజార్చుకున్నప్పటికీ, ఆ తర్వాత వరుసగా మూడు సెట్లను సొంతం చేసుకొని టైటిల్ సాధించడం అతని ప్రతిభకు నిదర్శనం. కాగా, మహిళల సింగిల్స్‌లో సబలెన్కా 6–3, 6–2 తేడాతో తన ప్రత్యర్థి, చైనా క్రీడాకారిణి జెంగ్ క్విన్వెన్‌ను సులభంగా ఓడించింది. డేవిస్ కప్ పోటీల్లో ఆస్ట్రేలియా జట్టు పాల్గొనడానికి వీలుగా, దేశవాళీ పోటీలను నిర్వహించాలని లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా 1904లో నిర్ణయించింది. ఈ సంఘం పేరును 1920లో లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియాగా మార్చారు. 1984లో, లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా ఒక కంపెనీగా రూపాంతరం చెందింది. 1986లో టెన్నిస్ ఆస్ట్రేలియా (టివి) అని పేరు మార్చారు. 1988లో ఫ్లిండర్స్ పార్క్ (ప్రస్తుతం మెల్బోర్న్ పార్క్) వద్ద కొత్త శాశ్వత కార్యాలయ భవన నిర్మాణం జరిగిం. కాగా, 1905లో ఆస్ట్రేలియన్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ప్రారంభమైంది. తొలుత మెల్బోర్న్‌లోని సెయింట్ కిల్డా రోడ్‌లో ఉన్న వేర్‌హౌస్‌మెన్ క్రికెట్ గ్రౌండ్‌లో తొలి ఆస్ట్రేలియన్ టెన్నిస్ చాంపియన్‌షిప్ జరిగింది. ఆ తర్వాత మరో నాలుగు నగరాలు కూడా చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యమిచ్చాయి. రెండుసార్లు న్యూజిలాండ్‌లో ఈ టోర్నీని నిర్వహించారు. ఆస్ట్రేలియాకు సంబంధించినంత వరకూ మెల్బోర్న్ 62 సార్లు, సిడ్నీ 17 సార్లు, అడిలైడ్ 14 సార్లు, బ్రిస్బేన్ 8 సార్లు, పెర్త్ 3 సార్లు టోర్నమెంట్ కేంద్రాలయ్యాయి. 1972లో, మెల్బోర్న్‌లోని కూయాంగ్ లాన్ టెన్నిస్ క్లబ్ ఈ టోర్నీకి శాశ్వత వేదికైంది. ఇలావుంటే, 1927లో ఆస్ట్రేలియన్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌ను ఆస్ట్రేలియన్ చాంపియన్‌షిప్‌గా మార్చారు. 1969 నుంచి ఓపెన్‌గా మారింది. అంటే, అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రొఫెషనల్ క్రీడాకారులకు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం లభించింది. అంతకు ముందు ఔత్సాహికులకు మాత్రమే ప్రవేశం ఉండేది. మొత్తం మీద ఇప్పటి వరకూ 112 పర్యాయాలు ఈ టెన్నిస్ చాంపియన్‌షిప్ జరిగింది. ఓపెన్ ఎరాలో 56 సార్లు నిర్వహించారు. ఈ ఏడాది 57వ ఆస్ట్రేలియన్ ఓపెన్ జరుగుతుంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, ప్రపంచ యుద్ధాల కారణంగా 1916–1918 మధ్య, తిరిగి 1940–1945 మధ్యకాలంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను నిర్వహించలేదు.

## అత్యధిక టైటిళ్లు..



మార్గరెట్ కోర్ట్

ఆస్ట్రేలియా ఓపెన్‌లో అత్యధిక టైటిళ్లు సాధించిన రికార్డు మార్గరెట్ కోర్ట్ పేరిట ఉంది. ఆమె ఏకంగా 23 టైటిళ్లు గెల్చుకుంది. వీటిలో 11 సింగిల్స్, 8 డబుల్స్, 4 మిక్స్‌డ్ డబుల్స్ టైటిళ్లు ఉన్నాయి. 11 సింగి ల్స్ టైటిళ్లలో ఏడు ఓపెన్ ఎరాకు ముందు, నాలుగు ఆ తర్వాత కైవసం చేసుకుంది. ఓపెన్‌గా మారిన తర్వాత జరిగిన పోటీలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటే, అత్యధిక టైటిళ్ల రికార్డు మార్టినా నవ్రతిలోవా సొంతం చేసుకుంది. ఆమె మూడు సింగిల్స్, ఎనిమిది డబుల్స్, ఒక మిక్స్‌డ్ డబుల్స్‌సహా మొత్తం 12 టైటిళ్లు అందుకుంది. అత్యంత విజయవంతమైన రికార్డు సెరెనా విలియమ్స్ దక్కించుకుంది. ఆమె మహిళల సింగిల్స్‌లో 8 పర్యాయాలు ఫైనల్ చేరగా, వాటిలో 7 పర్యాయాలు విజయం సాధించి, టైటిళ్లు అందుకుంది. ఒక సారి మాత్రమే ఆమె రన్నరప్ ట్రోఫీకి పరిమితమైంది. డబుల్స్ విభాగంలో మార్టినా నవ్రతిలోవా ఎనిమిదిసార్లు ఫైనల్ చేరి, అన్నింటి లోనూ గెలిచింది. బ్రియాన్ సోదరులు బాబ్, మైక్ పురుషుల డబుల్స్‌లో ఆరు టైటిళ్లు సాధించి, రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించారు. ఆస్ట్రేలియా ఓపెన్ పురుషుల సింగిల్స్ విషయానికి వస్తే, నొవాక్ జొకొవిచ్ అత్యధికంగా తొమ్మిది టైటిళ్లు కైవసం చేసుకున్నాడు. అతను ఫైనల్ చేరిన ప్రతిసారీ విజేతగా నిలవడం విశేషం. మొత్తం మీద అతను ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 90 మ్యాచ్‌లు ఆడగా, 82 గెలిచాడు. కేవలం 8 మాత్రమే చేజార్చుకున్నాడు. మ్యాచ్‌ల విషయంలో అతను 91 శాతం విజయాలను నమోదు చేశాడు. ఫైనల్ చేరిన ప్రతిసారీ గెలిచిన ఘనత జొకొవిచ్ ఖాతాలోకి వెళితే, ఓడిన చరిత్ర బ్రిటన్ ఆటగాడు ఆండీ ముర్రేది. అతను మొత్తం 5 పర్యాయాలు ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్ చేరాడు. కానీ, ఏ ఒక్కసారీ గెలవలేదు. టైటిల్ సాధించలేదు. ప్రతిసారీ రన్నరప్ ట్రోఫీతోనే సరిపుచ్చుకున్నాడు. ఇక మహిళల ఫైనల్‌లో ఎక్కువ పరాజయాలు ఎదుర్కొన్న క్రీడాకారిణులుగా క్రిస్ ఎవర్ట్ లాయిడ్, కోన్ లాంగ్ చరిత్ర పుటల్లో నిలిచారు. వీరిద్దరూ చెరి ఆరు పర్యాయాలు ఫైనల్ చేరుకొని, నాలుగు సార్లు ఓటమి చవిచూశారు. చెరి రెండు సార్లు టైటిల్ స్వీకరించారు.



మార్టినా నవ్రతిలోవా

## తొలిరోజు వర్ష సూచన



ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను ఆడేందుకు క్రీడాకారులు.. చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపుతున్నప్పటికీ, మెల్బోర్న్‌లో వాతావరణం చాలా మందిని భయపెట్టడం సహజం. అప్పటికే అక్కడ వేసవి కాలం ప్రారంభమవుతుంది కాబట్టి, పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. ఎండ వేడిని భరించడం అటు ఆటగాళ్లకు, ఇటు ప్రేక్షకులకు కష్టమవుతుంది. సహజంగా ప్రతిసారీ ఆస్ట్రేలియన్ ఓపెన్ సమయంలో ఇదే సమస్య కనిపిస్తుంది. కానీ, ఈసారి పరిస్థితి కొంత మెరుగ్గా ఉండవచ్చు. వాతావరణ శాఖ ప్రకటనను అనుసరించి, టోర్నమెంట్ ప్రారంభమయ్యే మొదటి రోజైన ఆదివారం (జనవరి 12) ఉదయం వర్షం కురిసే అవకాశం ఉంది. ఆ తర్వాత సుమారు ఐదు రోజులపాటు తేలికపాటి జల్లులు పడవచ్చు. ఈ సమాచారం అందరికీ ఊరటనిస్తున్నది.

## హ్యాట్రిక్‌పై సబలెన్కా చూపు



ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో వరుసగా రెండుసార్లు టైటిల్ సాధించిన డిఫెండింగ్ చాంపియన్ అరినా సబలెన్కా (బెలారస్) ఈ ఏడాది కూడా విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతున్నది. 199799 మధ్యకాలంలో మార్టినా హింగిస్ వరుసగా మూడు పర్యాయాలు ఈ టైటిల్‌ను దక్కించుకుంది. ఆమె సరసన చోటు కోసం సబలెన్కా ప్రయత్నిస్తున్నది. అయితే, ఈసారి పోరు తీవ్రంగా ఉంటుందని పరిశీలకులు అంటున్నారు. ఆమెకు మొదటి రౌండ్‌లో అమెరికా క్రీడాకారిణి స్లొయేన్ స్టెఫెన్స్ ఎదురవుతుంది. ప్రపంచ మూడో ర్యాంక్ క్రీడాకారిణి కొకొ గాఫ్, రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్, 2020 చాంపియన్ సోఫియా కెనిన్ తదితరుల నుంచి సబలెన్కాకు సవాళ్లు ఎదురుకావడం ఖాయం. ఈ అడ్డంకులను ఆమె ఏ విధంగా అధిగమిస్తుందో చూడాలి.

## సిన్నర్‌కు 'డోపింగ్' బెడద



ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్ (ఇటలీ)ను డోపింగ్ ఆరోపణలు వెంటాడుతున్నాయి. అతను ఈసారి టైటిల్ నిలబెట్టుకోవడం అనుమానంగానే ఉందని పరిశీలకులు అంటున్నారు. నిషిద్ధ మాదక ద్రవ్యాలు వినియోగించినట్టు డోపింగ్ పరీక్షలో అనుమానాస్పద ఫలితాలు వెలువడ్డాయి. అయితే, అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటిఎఫ్) అతనిపై ఎలాంటి నిషేధాన్ని ప్రకటించలేదు. దీనితో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. స్టెఫానొస్ సిట్సిపాస్, అలెక్స్ డి మినౌర్ నుంచి గట్టిపోటీ తప్పకపోవచ్చు. టోర్నమెంట్‌లో ఎదురయ్యే ప్రత్యర్థుల మాట ఎలావున్నా, డోపింగ్ వ్యవహారమే అతనిని ఇబ్బందులకు గురి చేయడం ఖాయమన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ఏ క్షణంలోనైనా ఐటిఎఫ్ వేటు వేసే ప్రమాదం లేకపోలేదని అంటున్నారు.

## జొకొవిచ్‌కి కష్టమే!



కెరీర్‌లో 10 ఆస్ట్రేలియన్ ఓపెన్‌సహా మొత్తం 24 గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ పురుషుల సింగిల్స్ టైటిళ్లను గెల్చుకున్న నొవాక్ జొకొవిచ్ ఈసారి కూడా టైటిల్ వేటను కొనసాగించనున్నాడు. మొదటి రౌండ్‌లో అతను అమెరికా ఆటగాడు నిషేష్ బసవరెడ్డిని ఢీ కొంటాడు. ఫలితాలన్నీ అనుకున్న రీతిలోనే వెలువడితే, నాలుగో రౌండ్‌లో ప్రపంచ 10వ ర్యాంక్ ఆటగాడు గ్రిగర్ డిమిత్రోవ్‌ను ఢీకొనాల్సి వస్తుంది. ఆ అడ్డంకిని దాటినా, క్వార్టర్ ఫైనల్‌లో స్పెయిన్‌కు చెందిన కార్లొస్ అల్కరాజ్, ఆ తర్వాత ఫైనల్‌కి వెళ్లే సత్తావున్న అలెగ్జాండర్ జ్వెరెవ్‌తో తలపడాల్సి రావచ్చు. ప్రపంచ 11వ ర్యాంక్ ఆటగాడు స్టెఫానొస్ సిట్సిపాస్ ఎదురయ్యే అవకాశాలు లేకపోలేదు. యువ క్రీడాకారులు అసాధారణ ప్రతిభ కనబరుస్తూ, సంచలన విజయాలు నమోదు చేస్తున్న తరుణంలో, 37 సంవత్సరాల జొకొవిచ్ టైటిల్ వేటను సమర్థవంతంగా కొనసాగించడం కష్టంగానే కనిపిస్తున్నది.

## హజార్డ్స్ లైసెన్స్ లేకుండా ఆయిల్ ట్యాంకర్లతో పెట్రోల్ రవాణా

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** హజార్డ్స్ ఎక్స్ప్లోజ్ లైసెన్స్ లేని అనుభవం లేని డ్రైవర్లతో ఆయిల్ ట్యాంకర్లతో పెట్రోల్ రవాణా చేస్తున్న యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్స్ యూనియన్ చేస్తున్న సమ్మెలో పాల్గొని మాట్లాడారు. కక్షసాధింపు చర్యలో యాజమాన్యం అనుభవం లేని డ్రైవర్లతో ట్యాంకర్లు నడిపి ప్రజల జీవితాలతో చలగాటం ఆడుతున్నారని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న డ్రైవర్లతో చర్చలు జరపకుండా ఇలాంటి చర్యలు పాల్పడం సరైంది కాదన్నారు. యాజమాన్యం ఇప్పటికి దిగిరాకుంటే డ్రైవర్ల కుటుంబాలతో సమ్మెలో పాల్గొని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ అధ్యక్షులు బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం నాయక్, హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ల యూనియన్ అధ్యక్షులు బాబా, కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, గౌరవ అధ్యక్షులు సాయిబాబా, నాగరాజు, గణేష్, ఉపేందర్, సైదులు, వెంకన్న, రమేష్, మధు, మల్లేష్ పాల్గొన్నారు.

## మహిళలపై అఘాయిత్యాలు కలిసి కట్టుగా ఎదుర్కోవాలి: హైమావతి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అందరం కలిసి కట్టుగా ఎదుర్కోవాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉజ్జని హైమావతి అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట నల్లమల గిరి ప్రసాద్ విజ్ఞాన కేంద్రం ఆవరణలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు వైభవంగా నిర్వహించారు. ఈ పోటీలో 40 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఈ వేడుకలకు భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉజ్జని హైమావతి పాల్గొని మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలలో దాగి ఉన్న కలను ముగ్గుల పోటీల ద్వారా బయటపడుతుందన్నారు. రాజకీయ రంగంలో ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం, సరోజిని నాయుడు లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో హైమావతి, వినోద, మహేశ్వరి, జైపాల్ రెడ్డి, సహదేవ రెడ్డి, మోహన్ బైరాగిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు మహేశ్వరి, వినోదా, జిల్లా కౌన్సిల్ సభ్యులు చంద్రమ్మ, నాగమణి, సరిత, లక్ష్మీ, సోని, కీర్తన, మౌనిక, సిపిఐ నాయకులు

## డల్లేవాల్ ప్రాణాలకు ముప్పు ఏర్పడితే కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత

ఖమ్మం పాత బస్టాండ్ వద్ద సంఘీభావ రైతు దీక్షలో కిసాన్‌మోర్చా నేతలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు డిమాండ్ చేస్తూ 47రోజుల నుండి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జత్‌సింగ్ డల్లేవాల్ ప్రాణాలకు ముప్పు ఏర్పడితే అందుకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని సంయుక్త కిసాన్‌మోర్చ నేతలు నల్లమల వెంకటేశ్వరరావు, బొంతు రాంబాబు అన్నారు. డల్లేవాల్‌కు మద్దతుగా శనివారం ఖమ్మం పాత బస్టాండ్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చ ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘీభావంగా రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మూలంగా వ్యవసాయం చేస్తున్న రైతులు సంక్షోభంలో ఉన్నారని, గత ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా నల్ల చట్టాలను రద్దు చేసి చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికి అమలు చేయలేదన్నారు. ప్రైవేట్ వ్యవసాయ మార్కెట్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ద్వారా ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్లు దివాళా తీసే అవకాశం ఉందని అన్నారు. పంజాబ్, హర్యానా రైతుల ఆందోళన, పోరాటం కేవలం ఆ ప్రాంతం రైతుల కోసం కాదని, దేశవ్యాప్త రైతుల ప్రయోజనం ఉందని, గ్రామగ్రామన జగ్జత్‌సింగ్ డల్లేవాల్‌కు మద్దతుగా సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు పెరగకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతు నేత డల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదినేని రమేష్, దొడ్డపాటి రమేష్, మల్లీడ్ నాగేశ్వరరావు, తాతా రఘురాం, కిసాన్‌మోర్చ నాయకులు మురళీ, ఎం.సుబ్బారావు, మెరుగు సత్యనారాయణ, తాటి వెంకటేశ్వరరావు, బండి రమేష్, ఎర్ర శ్రీనివాసరావు, వాసిరెడ్డిప్రసాద్, ఎస్కే మీరా, చింతనిప్పు చలపతిరావు, పొన్నగంటి సంగయ్య, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సెలవుల్లో పాఠశాలలు నడిపితే ఊరుకోం

విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తే సహించేది లేదు

ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని స్థానిక భాస్కర్ రావు భవన్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కల్వల శ్రీకాంత్ స్టాలిన్ అధ్యక్షత వహించగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబంతో, బంధువులతో గడపడానికి సంక్రాంతి పండుగను ఆనందంగా, ఆహ్లాదకరంగా, అద్భుతంగా, జరుపుకోవాలని తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలకు సంక్రాంతి పండగ సెలవులను 11 నుండి 17 వరకు ప్రకటించడం జరిగిందని ఆయన అన్నారు. ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పండగ సెలవుల్లో కూడా ప్రత్యేక తరగతుల పేరిట పాఠశాలలను నడిపితే చూస్తూ ఊరుకోమని,అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. పాఠశాలల నిర్వహకులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తాం అంటూ, విద్యార్థులను బెదిరిస్తూ పాఠశాలలకు తప్పకుండా రావాలని, లేకుంటే మార్కులు వేయమని, విద్యార్థులను మానసిక ఒత్తిడికి, ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని ఆయన అన్నారు.

పాఠశాలల ఉనికిని కా పాడుకోవడం కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడడం సరైన విధానం కాదని ఆయన అ న్నారు. ప్రత్యేక తరగతుల పేరిట ఇబ్బందులు గు రి చేస్తే చూస్తూ ఊరుకోమని, విద్యార్థులకండగా ఎఐఎస్ఎఫ్ జెండా ఉంటదని, విద్యార్థులను ఇ బ్బందులకు గురి చేస్తే ఎఐఎస్ఎఫ్ ని సంప్రదించండని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్నకొండ సాయి ఆజాద్, రామగుండం నగర కార్యదర్శి ఎల్కపెల్లి సురేష్, బొజ్జపల్లి రేవంత్, గాజుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## భూమిలేని వ్యవసాయ కార్మికుడికి రూ.12వేలు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా

**ప్రజాపక్షం/చండూరు :** భూమి లేని ప్రతి వ్యవసాయ కార్మికుడికి సంవత్సరానికి రూ. 12వేలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనంలో బికెఎంయు మండల అధ్యక్షుడు భూతరాజు సైదులు అధ్యక్షతన జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చండూరు మండల రౌంటేబుల్ సమావేశానికి బొల్గూరి నర్సింహ్మా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వ్యవసాయ పట్టాదారు పాస్‌బుక్‌తో సంబంధం లేకుండా ఉపాధి హామీ కార్డు ఉన్నవారికి సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200రోజుల పని దినాలు కల్పించి రోజు వారి వేతనం ఆరు వందలు ఇవ్వాలని అన్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్లు అర్హులైన ప్రతి పేదవాడికి ఇవ్వాలని అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రతి పేదవాడికి కూలీ కల్పించాలనే ఉద్దేశంతోనే ఉపాధి హామీ పథకంను తీసుకొచ్చిన ఘనత సిపిఐదేనన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామలింగయ్య, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ,మండల పార్టీ సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేశ్ , వ్యవసాయ కార్మిక సంఘం మునుగోడు నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు ఎండి జానీమియా, సిహెచ్ ఊషయ్య , బికెఎంయు సంఘం మండల కార్యదర్శి ఇరిగి సంజీవ, రైతు సంఘం మండల కార్యదర్శి బండమీది వెంకన్న, గీత పనివారల సంఘం మండల కార్యదర్శి గంట రమేష్ , జెల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి స్టేడియం అభివృద్ధికి కృషి

సిపిఐ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మిలీనియం క్వార్టర్స్ 28 వార్డ్ ఏరియాలో ఉన్న సింగరేణి స్టేడియం అభివృద్ధికి జిఎం సహకారంతో అభివృద్ధి చేయడం జరిగిందని 28వ వార్డు కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి తెలిపారు. శనివారం భూపాలపల్లి సుభాష్ కాలనీలో ఉన్న కాకతీయ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను సింగరేణి అధికారులతో కలిసి కౌన్సిలర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని స్టేడియాన్ని సింగరేణి జిఎం సహకారంతో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. స్టేడియం అభివృద్ధికి సహకరించిన జిఎంకు వార్డు ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు

భూపాలపల్లి ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో సుభాష్ కాలనీలోని కాకతీయ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకల కొరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రౌండ్ లెవెలింగ్, నూతనంగా నిర్మిస్తున్న స్టేజ్ నీ ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి సూచనలతో ఈ కాకతీయ స్టేడియం ముస్తాబవుతున్నదనీ ఏరియా అధికార ప్రతినిధి కె.మారుతి తెలిపారు.



## చైతన్య టెక్నోలో ముందస్తు సంక్రాంతి

### రంగవల్లులు, గొబ్బెమ్మలతో అలంకరణ



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** స్థానిక గుడిపాడు రోడ్‌లోని చైతన్య టెక్నో స్కూల్ నందు సం క్రాంతి పండుగ ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా బాలికలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. బాలురు రంగురంగుల గాలి పటాలను ఎగురవేశారు. సంక్రాంతి పండుగ సంప్రదాయాలైన హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల కు భోగి పండ్లు సమ ర్పించి దీవించారు. ఈ వేడుకలకు సత్తుపల్లి పట్టణ సీనియర్ నాయకులు చల్లగుండ్ల నర్సింహారావు, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గొర్లవెంకటప్పా రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై విద్యార్థులకు శుభాకాంక్ష లు తెలిపారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ, డైరెక్టర్లు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, యం.రవి కుమార్, యేసుబాబు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## శ్రీచైతన్యలో నోవాటో వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు పంచా యతీ పరిధిలో గల శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ కాలేజీలో నోవా టో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళా శాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, ఎస్‌బి టెట్ చైర్మన్ పుల్లయ్య, వక్తలు విద్యా ర్థిని, విద్యార్థులను ఉద్దేశించి పలు అంశాలు గురించి మాట్లాడారు. ఇం దులో భాగంలో విద్యార్థిని నృత్యాలు వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య, డైరెక్టర్ సాయిగీతిక, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ముర ళీకృష్ణ, బిఓజిమెంబర్ ప్రొఫెసర్ కృష్ణ మూర్తి, డీన్ డాక్టర్ సుదర్శన్, డిప్లొమా ఇంచార్జి కృష్ణప్రసాద్, డాక్టర్ రాజేష్, వైశాలి, కళాశాల విభాగల అధిపతులు శ్రీకుమార్, హరి ప్రసాద్,అధ్యాపకులు పాల్గొన్నారు.

## పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో రాయగూడెం గ్రామానికి చెం దిన 300 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. ఖమ్మం క్యాంపు కార్యా లయంలో సొసైటీ డైరెక్టర్ కోసూరి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సూరే పల్లి సుజాత, ప్రభాకర్, ప్రేమ్కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి కండువా కప్పి సాదరంగా అహ్వానించారు. పార్టీ అండగా ఉంటుం దని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారా ములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వ రరావు, కొడాలి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

### టిఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్‌పి చైర్మన్ లింగాల



**ప్రజాపక్షం/బోనకల్ :** స్థానిక సంస్థలలో సత్తా చాటి, టిఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని టిఆర్ఎస్ నాయకులు, మాజీ జెడ్‌పి చైర్మన్ లింగాల కమ లరాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరావులు అన్నారు. మండలంలోని రావినూతల గ్రామంలో టిఆర్ఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినప్పటికీ 6అ బద్ధాలతో అధికారంలోకి వచ్చి నేటికి హామీలను నెరవెర్చలేదని విమర్శిం చారు. రైతుల రుణమాఫీ అమలు నేటికి సరిగ్గా అమలు కాలేదని, కేసీఆర్ ప్రజాసంక్షేమంలో భాగంగా మహత్తర పథకాలు రూపొందించి యావత్తూ తెలంగాణ పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. ఇందిరమ్మ ఇళ్లు స్థానిక సంస్థల ఎన్నికల ముందే మంజూరు చేసి కాంగ్రెస్ చిత్తశుద్ధి నిరూపించుకో వాలని కోరారు.ఇటీవల మృతి చెందిన వ్యక్తికి టిఆర్ఎస్ సభ్యత్వం కలిగిన వారికి బీమా రూ.2 లక్షల చెక్కును నామినీ భార్య ఫొనికకు అందజేశారు. టిఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు చేబ్రోలు మల్లికార్జున్‌రావు, మోదుగుల నాగేశ్వరరావు, నాయకులు బానోత్ కొండ, వేమూరి ప్రసాద్, గద్దెల వెంక టేశ్వర్లు, కొమ్మినేని ఉపేందర్, యంగల కనకయ్య పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/బోనకల్ :** కేజీబివి, సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యలను పరి ష్కరించడంతో పాటు, వారికి ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కేజీబివి, సమగ్ర శిక్షణ ఉద్యోగు లతో మధ్యాహ్న భోజన విరామంలో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఉద్యోగులకు ఆర్థియేతర హామీలను నెరవేస్తూ జీఓలను విడుదల చేయాలని కోరారు. హెల్త్‌కార్డులు ఇవ్వాలని, కారుణ్యనియమకాలు చేపట్టాలని కోరారు. మరణించిన కుటుం బాలకు ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో కేజీబివి ఎస్ఓ సక్కుబాయి, సంఘం మండల కార్యదర్శి పి రాణి, లావణ్య, మరి యమ్మ, చంద్రకళ, మేరి తదితరులు పాల్గొన్నారు.

## షాట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** షాట్ సర్క్యూట్‌తో కారు పూర్తిగా దగ్ధం అయిన సంఘటన మండల పరిధిలోని పాత పినపాక సీతారామ ప్రాజెక్ట్ వద్ద చోటు చేసుకుంది. ఎపి 20 ఎఎస్ 2255 నంబర్ గల కారు పాత పినపాక వద్ద షాట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధం అయింది. కారులో మాటలు వ్యాప్తి చెందడం గమనించిన యాజమాని వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమా చారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను నిలువరించా రు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించడం జరిగిందన్నారు.

## బౌద్ధక్షేత్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దక్షిణ భారతదేశంలో కెల్లా అతిపెద్దదైన బౌద్ధక్షేత్రాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీజ సందర్శించారు. శనివారం బౌద్ధక్షేత్రాన్ని సం దర్శించి కలియ తిరిగి క్షేత్రం చరిత్రను అడిగి తెలు సుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. క్షేత్రం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలిగించాలని, రూ.2.50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి గురించి సంబంధిత అధి కారు లను అడిగితెలుసుకున్నారు. పర్యాటకులను ఆకర్షిం చేలా అభివృద్ధి చేపట్టాలని బౌద్ధక్షేత్రం అభివృద్ధిపై మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొ న్నారు. ఆయన వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి గుట్టలపై పర్యాటకుల సందడి



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాలతో బెండా లపాడుకు పర్యాటకుల సందడి పెరిగింది. శనివారం భద్రాచలా నికి వచ్చిన టూరిస్టుల బృందం పదిహేను మందితో బెండాలపాడు కనిగిరి గుట్టల ప్రాంతాన్ని సందర్శించింది. ప్రధానంగా సమ్మక్క సారలమ్మ గద్దె లు, కనిగిరి గుట్టల ప్రాంతంలో గల హస్తాల వీరన్న స్వామి, కాకతీయుల కట్టడాలు, వీరభద్రున్ని ఆల యం, కనిగిరి(కనకాద్రి) అటవీ ప్రాంతం టూరిస్టుల ను అమితంగా ఆకట్టుకుంది. ఇక్కడకు వచ్చే టూ స్టులకు స్థానిక గిరిజనులు తమ వంటలను రుచి చూపించారు. టూరిస్టులు క్రమంగా రోజు రోజుకి పెరుగుతుండంతో బెండాలపాడు గిరిజనులు ఆనం దం వ్యక్తం చేశారు. టూరిస్టు బృందంలో డిఆర్‌డిఒ అనురాధ, పంపతంత్ర ఫౌండే షన్ నిర్వాహకురాలు కల్పన, తదితరులు పాల్గొన్నారు.

### పూసుకుంట, కటుకూరు ప్రజల జీవితంలో

# వెలుగులు నింపడమే లక్ష్యం



బిటి, వంతెన శంకుస్థాపనలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/దమ్మపేట :** పూసుకుంట, కటుకూరు ప్రజల జీవితంలో వెలుగు నింపడమే తన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, చేనేత అనుబంధ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నా రు. శనివారం దమ్మపేట మండలంలోని దట్టమైన అటవీలో ఉన్న పూసు కుంట, కటుకూరు గ్రామాల్లో మంత్రి తుమ్మల, ఖమ్మం ఎంపి గ్రామ సహాయం రఘురామరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినా రాయణ, కలెక్టర్ జితిష్ వి పాటిల్, ఐటిడి పిఒ రాహు ల్‌తో కలిసి పలు వంతెనలకు, పూసుకుంట నుండి రాచ న్నగూడెం బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.30 కోట్లు నిధులతో హై లెవెల్ వంతె నల నిర్మాణ పనులకు అదే విధంగా పూసుకుంట అడ విలో నిర్మించబోయే మరో రెండు వంతెనలు, కటుకూరు నుండి రాచన్నగూడెం వరకు రూ.4.18 కోట్లు నిధు లతో నిర్మించబోయే బిటి రోడ్డు తదితర పనులకు కొబ్బరి కాయ కొట్టి శిలాఫలకాల్ని ఆవిష్కరించారు. పూసు కుంట గ్రామంలో ఓ రై తు వ్యవసాయ భూముల పామా యిల్ మొక్కలు నాటి, ఐటిడిఏ ద్వారా అక్కడికి రైతుల వ్యవసాయ విద్యుత్ మోటర్లు స్విచ్ ఆన్‌చేసి ప్రారంభిం చారు. అనంతరం పుసుకుంటలో ఏర్పాటు చేసిన సమా వేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ రెండు గ్రామాల ప్రజలు వారు అభివృద్ధి చెందడానికి ఏది కావా లన్నా అందిస్తామని, ఎన్నో ఏళ్లుగా పూసు కుంట, కటు కూరు ప్రజలు కోరుకుంటున్న రోడ్డు మార్గాన్ని కూడా మూడు నెలల్లో పూర్తిచేసి ఉగాది నాటికి ప్రారంభిస్తామ న్నారు. కొండరెడ్ల కాపాడు కుంటామని, వారిని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన ప్రత్యేక ప్రణాళికలు రచిస్తు న్నామని, పూసుకుంట, కటుకూరు గ్రామాలపై అన్ని శాఖల జిల్లా అధికారులు దృష్టిపెట్టాలని, ప్రతి వారం అధికారులు పూసుకుంట గ్రామానికి వచ్చి వెళ్లాలని ఆదే శించారు. అ గ్రామాల్లో ఉన్నా ప్రతి చిన్నారి చదువుల్లో రాణించాలని, విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. విద్య ద్వారానే పేదల జీవి తాల్లో మార్పు తీసుకురాగలు గుతామన్నారు. పూసుకుంట, కటుకూరు గ్రామాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జారే ఆదినారాయణ ప్రత్యేక దృష్టి ఈ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నందుకు సంతోషంగా ఉందని ఎంపి అన్నారు. ఎమ్మెల్యే జారే ఆది నారాయణ మాట్లాడుతూ పూసుకుంట, కటుకూరు ప్రజల ఎన్నో ఏళ్ల కళ నేడు నెరవేరిందన్నారు. ఎన్నికల సమయంలో ఇక్కడ ప్రజలకు ఆనాడు వంతెనలు, రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చామని, ఇచ్చిన హామీలను నిలబె ట్టుకున్నామన్నారు. మిగిలిపోయిన బిటి రహదారికి నేడు పనులు ప్రారంభించుకున్నందుకు పూసు కుంటా ప్రజలకు సంక్రాంతి పండుగ అడ్వాన్స్‌గా ముందే వచ్చే సిందని కలెక్టర్ జితీష్ పాటిల్ అన్నారు. గ్రామాలపై అభి వృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టామని, ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు దుస్తులు పంపిణీ చేశారు. సందర్భంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిన్నారు లతో సరదాగా మాట్లాడుతూ సంతోషపడ్డారు. ఈ కార్య క్రమాలలో డిఆర్‌డిఓ విద్యాచందన, జట్పి సీఈఓ నాగ లక్ష్మి , డిఎఫ్ఓ కృష్ణ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, సహకార సంఘం అధ్యక్షుడు ఎల్లిన రాఘవరావు, ఆర్అండ్‌బి ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మధు, సిపిఓ సంజీవరావు, సహాయ ప్రాజెక్టు అధికారి వివిధ శాఖల జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లికి వస్తేనే ఆనందంగా ఉంటా

### ఏడాది లోగా బేతుపల్లి ప్రాజెక్టుకు గోదావరి జల్లాలు వచ్చే ఉగాదిలోగా హైదరాబాద్‌కు గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రయాణం



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి ప్రజలు కల్పి ంచిన అవకాశాలను అంది పుచ్చుకొని అభి వృద్ధి ఆనవాళ్లు తెలుసు కునేందుకు ఎక్కడెక్కడో తిరిగే తనకు ఎక్క డా ఆనందం లభించదని సత్తుపల్లి వస్తేనే ఆనందంగా ఉంటానని వ్యవసా య శాఖ మంత్రి తు మ్మల నాగే శ్వరరావు అన్నారు. శనివారం సత్తుపల్లి మండలం రా మ గోవిం దపురం పంచాయతీలో నూతనంగా నిర్మిం చిన పంచాయతీ కార్యాలయం, సత్తుపల్లి మున్సిపాలి టీలోని జేవిఆర్ పార్క్ ఎదు ట నిర్మించిన వివేకానంద ఎక్సలెన్సీ సెంటర్‌ను ప్రారంభించిన ఆయన ఈ సంద ర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ఏడాదిలోపు గోదావరి జలాలు బేతుపల్లి ప్రాజెక్టుకు తీసుకు వస్తా నన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు పెట్టిన రాజ కీయ భిక్షతోనే తాను ఈ స్థాయికి ఎదిగినట్లు పేర్కొ న్నారు. వచ్చే ఉగాది లోగా సూర్యాపేట రాజమండ్రి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తి చేయించి సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలు సులభంగా హైదరాబాద్ చేరు కునే అవకాశం కల్పిస్తానన్నా రు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం : ఎస్ఐ



**ప్రజాపక్షం/కరకగూడెం :** మండలంలోని గొల్లగూడెం హజరత్ ఆలీబాబా జయంతి సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు రెండు జిల్లాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను కరకగూడెం ఎస్ఐ రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసు కున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేందర్ మాట్లాడుతూ క్రీడల వలన శారీరిక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కల్గించి, క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాన్ని పెంపొందిస్తుందని అన్నారు. క్రీడాకారులతో పాటు చదువులలో ముందుండాలని తెలిపారు. క్రీడాకారులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు షారుఖ్, శ్రీను, మోయిన్, గ్రామస్థులు సత్యం, నగేష్, గ్రామ యువత, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో పిఒ కార్యాలయం ముట్టడి

### కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జీవో నెంబర్ 22 ప్రకారం వేతనా లను పెంచాలని, ఇఎస్ఐను అమలు చేయా లని, సంక్రాంతి పండుగ నేప థ్యంలో తక్షణమే వేతనాలు చెల్లించాలని తదితర సమస్యల పరి ష్కారానికై సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూని యన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో శనివారం జెవి ఆర్ ఒసి పిఒ కార్యాలయాన్ని ముట్టడించారు కాంట్రాక్ట్ కార్మికులు. ఎఐటియుసి ఆధ్వర్యం లో భారీ ధర్నా చేపట్టి , మేనేజర్ రాజేశ్వరరా వుకి నాయకులతో కలిసి వినతి పత్రం అందజే శారు. అనంతరం సత్తుపల్లి ఏరియా కార్యదర్శి ఎస్.సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య మాట్లాడుతూ సింగరేణి యాజమా న్యం తక్షణమే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని,ఒప్పందంలోని పెండింగ్ అం శాలను అమలు చేయాలని, ఆరు నెలల ఇపిఎఫ్ డబ్బులను తక్షణమే చెల్లించి అందరికీ కార్డులు ఇవ్వాలని, సిఎం పిఎఫ్ పాస్ బుక్‌లను ఇవ్వా లని డిమాండ్ చేశారు. వేతనాలను ప్రతి నెలా స కాలంలో చెల్లించాలని, ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం వేతనాలను పెంచాలని డిమాండ్ చేశా రు. భవిష్యత్తులో ఎఐటియుసి అన్ని విభాగాల కాంట్రాల కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలను చేపడుతుందని, అందుకు కాం ట్రాక్ట్ కార్మి కులు సిద్ధంగా ఉండాలని పిలుపుని చ్చారు. ఈ ధర్నాలో కాంట్రాక్టు కార్మికులు అ ధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్య దర్శి కామ్రేడ్ జి .వీరస్వామి, కెజిఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ కత్తెర్ల రాము లయ్య, సత్తుపల్లి ఏరియా నాయకులు యోబు, సూర్య ప్రకాష్, భరణి, డి.ప్రసాద్, కాగితపు వెంకటేశ్వర్లు, నరసింహారావు , లక్ష్మి,రాధ, ఏసు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులను కల్పించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** ఉప్పుసాక గ్రామ పంచా యతీ పరిధిలోని రాజీవనగర్ గ్రామస్తులతో కలిసి సిపిఐ మండల కార్యదర్శి ముప్వ వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు సబ్కా నాగేశ్వరరావులు మణుగూరు లోని ప్రజాభవన్ నందు ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వ ర్లును శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాజీవ్‌నగర్ గ్రామం ఏర్పడి దాదాపు 35 సంవత్సరాల పైబడి వస్తున్న, ఇప్ప టి వరకు వారికి తాగునీరు, రోడ్లు, కరెంటు తదితర వసతులు లేకపో వడం దారు ణమన్నారు. గిరిజన సమస్యల పరిష్కా రంలో ఐటిడిఎ వ్యవస్థ నిర్వీర్యం చెందిందని అన్నారు. కూత వేటు దూరంలో ఉన్న గిరిజన గ్రామాలకు కూడా ఇంత వరకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయ డంలో ఐటిడిఎ వ్యవస్థ విఫలం చెందిందని ఎద్దేవా చేశారు. రాజీవ్‌నగర్ గ్రామస్తులకు కూడా వారి మౌలిక వసతులు సాధనలో ఎంఎల్ఏ ప్రత్యేక చొరవ చూపించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎం ఎల్ఏ త్వరలోనే ఆ గ్రామాన్ని సందర్శించి, వారికి మౌలిక వసతులు సాధనలకు కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు నాగేశ్వ రరావు, రాజీవనగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలకు ఎంతో ఆదరణ

### విజేతలకు బహుమతులు అందించిన పొంగులేటి మాధురిరెడ్డి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** సంక్రాంతి పండుగ సందర్భంగా పాలేరు శాసన సభ్యులు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస్‌రెడ్డి పాలేరు యోజకవర్గంలో నిర్వహిస్తున్న ము గ్గుల పోటీలకు ఎంతో ఆదరణ సంతరించుకుంది. నియోజకవర్గంలోని కూసుమంచి నేలకొండపల్లి ఖ మ్మం రూరల్ తిరుమలయపాలెం మండలంలో ముగ్గు ల పోటీలు నిర్వహించగా మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని రంగవల్లులను వేసేందుకు పోటీపడ్డారు. మం డల స్థాయి ముగ్గుల పోటీల్లో మండల వ్యాప్తంగా ఉన్న 40 గ్రామ పం చాయతీల పరిధిలో మహిళలు భారీ సం ఖ్యలో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సతీమణి మాధురి రెడ్డి బహు మతులు అందించి ఆమె మాట్లాడుతూ, సంక్రాంతి పం డుగ మహిళలకు ఎంతో ప్రత్యేకమని ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఇంటి ముందు తీరక్క ముగ్గుతో మహిళలు రంగవల్లులను దిద్ది తమ ప్రతిభను కనబరుస్తారు. నాగిరెడ్డి మంత్రి పొంగులేటి వ్యక్తిగత సహాయకులు తంబురి దయాకర్ రెడ్డి, పాలేరు నియోజ కవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, తాహ సిల్దార్ పి.వి.రామకృష్ణ ఎంపిడిఒ సిలార్ సాహెబ్, ఎంపిఒ సూర్యనారాయణ, మండల విద్యాశాఖ అధి కారి శ్రీనివాస్, ఎంపిపి లు తదితరులు పాల్గొన్నారు.

### వాసవి క్లబ్ ఆధ్వర్యంలో

## ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం** ఎర్రుపాలెం మండల వా సవి క్లబ్ ఆధ్వర్యంలో స్థా నిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించి విజే తలకు బహుమతులు అం దించారు. ఉన్నత పాఠశా ల విద్యార్థులు 32 మంది ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడు రాజు ప్రోత్సాహంతో ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకు లు కొప్పు పరమేశ్వరరావు తెలిపారు. ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు వాసవి క్లబ్ ద్వారా మొదటి, రెండవ, మూడవ బహుమ తులు అందించారు. ఈకార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్‌శాఖ నిర్వాహకులు కొప్పు పరమేశ్వరరావు, కేతేపల్లి నర్సింహారావు, దొడ్డ అశోక్, దూపుకుంట్ల చైతన్య, కె.పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.



## తెలుగుతనం ఉట్టిపడేలా సంబురాలు

**ప్రజాపక్షం/వైరా:** తెలుగు సంప్రదాయం దుస్తుల్లో విద్యార్థిని, విద్యార్థులు తెలుగుతనం ఉట్టిపడేలా స్థానిక వాణి వివేకానంద విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్ వాణి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బోగి మంటలు వేసి పాఠశాలలో వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా కరస్పాండెంట్ కోటేశ్వరరావు పాల్గొని తెలుగు సంప్రదాయానికి సంక్రా ంతి పండుగ ప్రతీక అని అన్నారు. ఈ పండుగను ఆనందా య కంగా జరుపుకోవాలని ఆయన తెలియజేశారు. అనంతరం పాఠశాలలో విద్యా ర్థిని, విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలో ఎంతో ఆకట్టుకున్నాయని, ఈ కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ గింజుపల్లి జనార్దన్, విద్యార్థిని, విద్యార్థులు, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

## లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** జగన్నాధపురం గ్రామంలో మా ర్క్సిస్ట్ మహో పాధ్యాయుడు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సభ గోడ ప్రతిని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మాస్ లైన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మ ణ్ మాట్లాడుతూ 21 జనవరి 2024 నాటికి మార్క్సిస్ట్ మహాపాధ్యాయులలో ఒకరైన కామ్రేడ్ లెనిన్ అమ రుడై వంద సంవత్సరాలు నిండుతున్నదని, ఈ సందర్భంగా సంవత్సరకాలం పాటు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా ఆయన కృషిని తెలియజేయాలని, రచనలను అధ్యయనం చేయాలని, సభలు, సమావేశాల నిర్వహించాలనీ పిలుపునిచ్చారు. 21వ తేదీన న హైదరాబాద్‌లో సుందర య్య విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను ఏర్పా టు చేసినట్లు, ఈ సభలో మాస్ లైన్ పార్టీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వంలో ప్రసం గాలు ఉంటాయన్నారు. ఈకార్యక్ర మంలో పార్టీ మండల కమిటీ సభ్యులు యర్రగొర్ల రామారావు, నకిరకంటి నాగేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు బజ్జూరి రాజేశ్వరరావు, వరికూటి కృష్ణ, పాల్గొన్నారు.

క్రీడ

# భారత్‌కు జాక్ పాట్..




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. 2013లో చివరిసారిగా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్.. 2017లో తృటిలో టైటిల్ చేజార్చుకుంది. పాకిస్థాన్ జరిగిన ఫైనల్లో ఓటమిపాలైంది. అయితే ఈసారి టైటిల్ అందుకునే సువర్ణవకాశం టీమిండియాకు లభించింది. ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్ వేదికగా హైబ్రిడ్ మోడల్‌లో ఈ టోర్నీ జరగనున్న విషయం తెలిసిందే. భారత్ మ్యాచ్‌లు దుబాయ్ వేదికగా జరగనున్నాయి. బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్‌తో గ్రూప్‌ఏలో ఉన్న భారత్.. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు ఆడనుంది. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఫిబ్రవరి 23న ఆతిథ్య పాకిస్థాన్‌తో తలపడనుండగా.. మార్చి 2న న్యూజిలాండ్‌తో ఆడనుంది. ఈ టోర్నీలో మిగతా జట్లకు లేని ప్రత్యేక వెసులుబాటు టీమిండియాకు లభించింది. టీమిండియా మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగానే జరగనున్నాయి. ఒకవేళ సెమీఫైనల్ చేరినా.. ఫైనల్‌కు అర్హత సాధించినా.. నాకౌట్ మ్యాచ్‌లు కూడా దుబాయ్ వేదికగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఇరు దేశాల మధ్య హైబ్రిడ్ మోడల్‌పై ఒప్పందం జరిగింది. భారత్ వేదికగా జరిగే ఐసీసీ టోర్నీల్లో పాకిస్థాన్ మ్యాచ్‌లు తటస్థ వేదికగా జరగనున్నాయి. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియా ఒకే వేదికగా అన్నీ మ్యాచ్‌లు ఆడనుండటం కలిసి రానుంది. ఇతర జట్లలా ప్రతీ వేదికలోని పరిస్థితులను అర్థం చేసుకునే అవసరం టీమిండియాకు ఉంది. ఒక్కసారి దుబాయ్ పరిస్థితులకు అలవాటు పడితే మిగతా మ్యాచ్‌ల్లో సునాయసంగా రాణించవచ్చు. లీగ్ దశలో టీమిండియా విజయాలు సాధించి నాకౌట్‌కు చేరితే దుబాయ్ వేదికను హోమ్ గ్రౌండ్‌లా భావించవచ్చు. మిగతా జట్లకే ఈ వెసులు బాటు లేదు. పాకిస్థాన్ వేదికగా ఉన్న అన్నీ మైదానాల్లో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఇంత మంచి వెసులు బాటు టీమిండియాకు ఉన్నప్పుడు టైటిల్ గెలవాలని, లేకుంటే అంతే సంగతులని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కోహ్లీకి సలహాలిస్తే.. తప్పిదం ఏంటో అడుగుతాడు

### టీమిండియా మాజీ కోచ్



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సలహాలు తీసుకోడనే వాదన సరికాదని మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ అన్నాడు. కోహ్లీపై ఇది తప్పుడు ప్రచారమేనని స్పష్టం చేశాడు. విరాట్ కోహ్లీకి సూచనలు ఇస్తే తప్పకుండా ఆచరిస్తాడని, ఎక్కడ పొరపాటు జరిగిందో చెప్పమని కోరుతాడని కూడా వెల్లడించాడు. పట్టించుకోకపోవడమనేదే ఉండదని వ్యాఖ్యానించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో విరాట్ కోహ్లీ దారుణంగా విఫలమైన విషయం తెలిసిందే. 5 టెస్ట్‌ల్లో 190 పరుగులే చేశాడు. 9 ఇన్నింగ్స్‌ల్లో 8సార్లు ఔటైన కోహ్లీ.. ఈ ఎనిమిది సార్లు ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్స్‌కే వెనుదిరిగాడు. శరీరానికి దూరంగా వచ్చిన బంతులను వదిలేయాని సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్ వంటి దిగ్గజాలు చెప్పినా కోహ్లీ వినిపించుకోలేదు. దీంతో సలహాలు తీసుకునేందుకు కోహ్లీ సిద్ధంగా ఉండడని సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి.

## వైడ్ బంతుల నిబంధనల్లో ఐసిసి మార్పులు?



ఇప్పటివరకు బ్యాటర్లకు మాత్రమే కాస్త ప్రయోజనంగా ఉన్న వైడ్ నిబంధనల్లో మార్పులకు ఐసిసి శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. బౌలర్లకూ బెనిఫిట్ దక్కేలా మార్పులు చేయాలని అంతర్జాతీయ బోర్డు భావిస్తోందని మాజీ క్రికెటర్, ఐసిసి క్రికెట్ కమిటీ సభ్యుడు షాన్ పొలాక్ వెల్లడించాడు. ప్రస్తుతం ఉన్న రూల్స్ వల్ల బౌలర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించాడు. వన్డేలు, టీ20ల్లో బౌలర్ల ఏకాగ్రతను దెబ్బకొట్టేలా బ్యాటర్లు క్రీజ్‌లో మూమెంట్స్ ఇస్తుంటారు. అలాంటప్పుడు బౌలర్ బంతిని స్టంప్స్‌కు కాస్త దూరంగా వేస్తాడు. ఇకనుంచి అలాంటి వాటిపైనా అంపైర్లు దృష్టి పెట్టనున్నట్లు పొలాక్ తెలిపాడు. ''ఐసిసి క్రికెట్ కమిటీ సభ్యుడిగా నేను ఇదే అంశంపై పని చేస్తున్నా. బ్యాటర్లతోపాటు బౌలర్లకూ ప్రయోజనం కలిగేలా మారుస్తాం. ఇప్పుడున్నవి చాలా కఠినంగా ఉన్నాయి. ఒకవేళ బ్యాటర్ చివరి నిమిషంలో క్రీజ్‌లో నుంచి బయటకు వెళ్తే బౌలర్ సరైన ప్రదేశంలో బంతిని విసరలేడు. బౌలింగ్ చేసేటప్పుడు రన్నప్ నుంచే అతడు ఎక్కడ బంతిని వేయాలని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకవేళ బ్యాటర్ కదిలినప్పుడు.. బంతి దూరంగా వెళ్లిందనుకుందాం. అప్పుడు ఆ బ్యాటర్ ఎక్కడైతే ఉన్నాడో.. అక్కడి నుంచి బంతి దూరాన్ని పరిశీలనలోకి తీసుకోవాలి. అప్పుడే వైడ్‌పై ఓ నిర్ణయానికి రావాలి. నేను చూడాలనుకుంటున్న మార్పు ఇదే. ఇది ప్రస్తుతం చర్చల్లో ఉంది. బౌలర్లకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని ఈమేరకు ఆలోచన చేశాం'' అని పొలాక్ వెల్లడించాడు.

### డబ్ల్యూటీసీ ఫైనల్ గురించి..

తొలిసారి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు దక్షిణాఫ్రికా వెళ్లింది. జూన్‌లో లార్డ్స్ వేదికగా ఆస్ట్రేలియాతో తలపడనుంది. బలమైన ఆసీస్‌ను ఎదుర్కోవడం సఫారీ జట్టుకు కఠిన సవాలే. ఈక్రమంలో తమ జట్టు అవకాశాలపై పొలాక్ స్పందించాడు. ''దక్షిణాఫ్రికాను డబ్ల్యూటీసీ ఫైనల్ ఫేవరెట్‌గా భావించడం లేదు. మా జట్టుకు కఠిన సవాల్ తప్పదు. టెస్టుల్లో ఆసీస్ ఆటను చూసి ఈ మాట చెబుతున్నా. కానీ, క్రికెట్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఆ మ్యాచ్‌లో టాస్ నెగ్గి తొలుత బౌలింగ్ చేస్తే కలిసొచ్చే అవకాశం ఉంది. ప్రత్యర్థిని ఒత్తిడికి గురి చేస్తే ఫలితం సానుకూలంగా రావొచ్చు'' అని వ్యాఖ్యానించాడు.

రీల్

## క్లైమాక్స్ చాలా సర్‌ప్రైజ్ చేస్తుంది

### – వెంకటేశ్



టాలీవుడ్‌లో ప్రతీ సంక్రాంతి ప్రత్యేకంగానే ఉంటుంది. మరి ఇలా 2025 సంక్రాంతికి కూడా సాలిడ్ సినిమాలు వస్తుండగా ఈ చిత్రాల్లో మన తెలుగు సినిమా మోస్ట్ లవబుల్ వెంకీ మామ మీడియాతో ముచ్చట్లు.. ఎక్స్ కాప్, ఎక్స్ గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్.. ఈ లైనే చాలా ఫ్రెష్‌గా అనిపించింది. మినిమం గ్యారెంటీ అని అక్కడే తెలిసిపోయింది. చాలా సరదాగా అనిపించింది. ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ వచ్చి.. నా గురించే ఆలోచిస్తున్నావా ? నేను వచ్చే లోపల నలుగురిని కన్నావ్..అన్నప్పుడు చాలా హిలేరియస్‌గా అనిపించింది. అలాంటి సీన్స్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. ఇందులో నాకు నలుగురు పిల్లలు. అందులో ఒకడిని చాలా హ్యాండిల్ చేయాల్సివచ్చింది(నవ్వుతూ). ఇందులో క్లైమాక్స్‌లో చెప్పే డైలాగ్స్ చాలా క్రేజీ వుంటాయి. ఆడియన్స్ చాలా ఎంటర్టైన్ అవుతారు. యూత్ డైలాగ్స్ ని చాలా లవ్ చేస్తారు. అనిల్ నాది సూపర్ హిట్ కాంబినేషన్. మేము చాలా ఫ్రెండ్లీగా వుంటాం. పెర్ఫార్మెన్స్ వైజ్ ఇందులో కామెడీ స్టయిల్ కొంచెం డిఫరెంట్‌గా వుంటుంది. చాలా షటిల్‌గా కొత్తగా ట్రై చేశాం. ఫ్రెష్ సీన్స్ వుంటాయి. సినిమా అద్భుతంగా వచ్చింది. అనిల్‌తో మంచి రేపో కుదిరింది. తనతో మూవీస్ కంటిన్యూ చేయాలని వుంది. ఈ చిత్రం జనవరి 14న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది.

## నన్ను క్షమించండి!

### నిర్మాత దిల్ రాజు



తెలంగాణ ప్రజలకు నిర్మాత దిల్ రాజు క్షమాపణలు చెప్పారు. 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారిన నేపథ్యంలో తాజాగా క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ సంస్కృతిని హేళన చేయడం తన ఉద్దేశం కాదని, ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరారు. ''సినిమా రంగంలో కిందిస్థాయి నుంచి ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా ఎదిగాను. ఇటు సినిమా ఇండస్ట్రీ, అటు ప్రభుత్వానికీ మధ్యలో ఉంటూ పరిశ్రమకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నా. తెలంగాణలో తెలుగు సినిమా అభివృద్ధి చెందడంతో పాటు, యువతకు ఉపయోగపడేలా పనిచేస్తా. ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా సూచనలు చేశారు. ఆ ప్రభుత్వంతో కూడా కలిసి పరిశ్రమ అభివృద్ధికి, తెలుగు సినిమాకు సహకారమందిస్తా. ఎఫ్‌డీసీకి రాజకీయాలతో సంబంధం లేదు. ఇలాంటి అనవసర విషయాల్లోకి నన్ను లాగొద్దని తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా'' అని దిల్‌రాజు పేర్కొన్నారు.

## ఆ నొప్పులు సరదాగా ఉంటాయి..!




టాలీవుడ్ హీరోయిన్ సమంత.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. తనకు సంతోషం కలిగినా, బాధ కలిగినా.. ప్రతీ విషయాన్ని ఆమె తన అభిమానులతో సోషల్ మీడియాలో పంచుకుంటుంది. అలానే తాజాగా సమంత సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఇటీవల చికెన్ గున్యా వ్యాధి బారిన పడినట్లు సమంత తెలిపింది. అయితే ప్రస్తుతం ఆ వ్యాధి నుంచి కోలుకుంటున్నట్టు ఆమె వెల్లడించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తున్న ఓ వీడియోను సమంత్ షేర్ చేసింది. చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్లనొప్పులు నుంచి కోలుకోవడం అనేది చాలా ఫన్‌గా ఉంటుందంటూ ఆ బ్యూటీ రాసుకొచ్చారు. సమంత త్వరగా కోలుకోవాలంటూ ఆమె అభిమానులు కోరుకుంటున్నారు.

## మోక్షజ్ఞ ఎంట్రీ డిలే...



అన్ని అనుకున్నట్లు జరిగితే నందమూరి వారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ ఇప్పటికే జరిగిపోవాలి. కానీ ఇంత వరకూ ఆ ఛాన్స్ లేకుండా పోయింది. ప్రశాంత్ వర్మ ప్రాజెక్ట్ తో మోక్షజ్ఞ లాంచ్ అవ్వాలి. డిసెంబర్ లో ముహూర్తం కూడా పెట్టారు. కానీ చివరి నిమిషంలో అది కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో మోక్షజ్ఞ ఎంట్రీపై రకరకరకాల కథనాలు అంతే ఆసక్తిని రేకెత్తించాయి. డెబ్యూ 'కల్కి' డైరెక్టర్ నాగ్ అశ్విన్ చేతుల్లోకి వెళ్లిందని , మరికొంత మంది బాలయ్య 'ఆదిత్య 999 మ్యాక్స్'తో తనయుడిని లాంచ్ చేస్తారనే ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. ఇలా మోక్షజ్ఞ ఎంట్రీపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. మరి కొత్త ఏడాదిలోనైనా లాంచ్ చేస్తారా? అంటే దానిపైనా క్లారిటీ లేదు. దీంతో మోక్షజ్ఞ చిత్రంపై అసలేం జరుగుతుంది అన్నది అర్థం కాని పరిస్థితుల్లోకి దారి తీస్తుంది. మోక్షజ్ఞ మాత్రం ఇప్పటికే అమెరికాలో యాక్టింగ్ ట్రైనింగ్ పూర్తి చేసుకుని సిద్దంగా ఉన్నాడు. చదువులు కూడా పూర్తి చేసాడు. ప్రస్తుతం అతడి వయసు 30 ఏళ్లు. అంటే ఎంట్రీ ఇప్పటికే బాగా ఆలస్యమైనట్లే లెక్క.

# ఆదివాసీ గృహాలకు ఉచితంగా సోలార్ విద్యుత్, పంపుసెట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆదివాసీ గూడేలలో గృహాలకు సోలార్ విద్యుత్, సోలార్ పంపుసెట్లు ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అటవీశాఖ, గిరిజన సంక్షేమం శాఖతో పాటు సంబంధిత శాఖలతో సమావేశమై వీలైనంత త్వరగా పూర్తిస్థాయి నివేదికను రూపొందించాలని, ఈ నివేదిక ఆధారంగా ఆదివాసీ గూడేలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సోలార్ విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటుకు అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. వివిధ దేశాల్లోని బెస్ట్ పాలసీని పరిశీలించి నివేదికను అందజేయాలని ఆదేశించారు. రాబోయే వేసవిలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా డిస్కంలు సన్నద్ధంగా ఉండాలని సిఎం ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ2025' ని డిప్యూటీ సిఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లుతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. అనంతరం విద్యుత్ శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జెన్ కో సిఎండి సందీప్ సుల్తానియా , ట్రాన్స్ కో సిఎండి కృష్ణ భాస్కర్,. డిస్కం సిసిఎండిలు ముషారఫ్, వరుణ్ రెడ్డి, సింగరేణి సిఎండి బలరాం నాయక్, టిజిరెడ్‌కో ఎండి అనీల, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని హైదరాబాద్ లో అమలు చేయాలని,ఔటర్ రింగ్ రోడ్ లోపల పూర్తిగా అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ కేబుల్స్‌తో పాటు అన్ని రకాల కేబుల్స్ కు అండర్ గ్రౌండ్ లోనే ఉండేలా వివిధ ప్రత్యమ్నాయాలు పరిశీలించాలన్నారు. అండర్ గ్రౌండ్ కేబుల్ విధానం ద్వారా విద్యుత్ నష్టాలను తగ్గించడం తో పాటు విద్యుత్ చౌర్యం, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ అంతరాయం వంటి సమస్యలను అధిగమించవచ్చని ముఖ్యమంత్రి వివరించారు. గత ఏడాది మార్చి లో రాష్ట్రంలో పీక్ డిమాండ్ 15623 మెగా వాట్లకు చేరిందని, ఈ సారి 16877 మెగావాట్ల కు చేరుతుందని అంచనా వేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గరిష్ఠ విద్యుత్ డిమాండ్ అంచనాకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా కు ప్రణాళిక చేసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయానికి, గృహ అవసరాలకు మార్చి నెలలో పీక్ విద్యుత్ డిమాండ్ ఉంటుందని , దానికి అనుగుణంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో రోజు రోజుకూ పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా జరగాలని, అధికారులను అప్రమత్తం చేశారు. ఎక్కడైనా సాంకేతిక సమస్యలు వచ్చినా వెంటనే సమీపం లోని మరో ఫీడర్ నుంచి ప్రత్యమ్నాయంగా సరఫరా చేసే వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకుసౌరవిద్యుత్

ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలలు, ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదే శించారు. ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి చూపే కంపెనీలను ఆహ్వానించి, వారికి ఏ విధానం లో పనులను అప్పగించాలనే అంశంపైన ప్రణాళిక తయారు చేయాలన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించాలన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లో రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. పరిగి వద్ద 400 కేవీ సబ్ స్టేషన్ మంజూరైనప్పటికీ పదేళ్లుగా పెండింగ్ లో ఉందని,దీనికి సంబంధించిన పురోగతి నివేదికను అందించాలని అధికారులకు ఆదేశించారు. గోషామహల్ లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మించనున్న నేపథ్యంలో స్టేడియం పక్కనే ఉన్న సబ్ స్టేషన్ ను మరోవైపు తరలించాలని సూచించారు. మరింత అదనపు సామర్థ్యంతో పూర్తిగా అధునాతన టెక్నాలజీతో ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు.



## నోడల్ ఏజెన్సీగా టిజి జెన్‌కో/ టిజి రెడ్‌కో

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ2025''ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. పదేళ్ల పాటు అమలులో ఉండే ఈ పాలసీని శనివారం నుంచి అమలులోనికి తీసుకొచ్చింది. ఈ మేరకు విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి శనివారం ఉత్తర్వులు(జిఒ ఎం.ఎస్ 2) జారీ చేశారు. నూతన పాలసీ లోభాగంగా టిజి జెన్‌కో/ టిజి రెడ్‌కో నోడల్ ఏజెన్సీలుగా వ్యవహారించనున్నాయి. ఈ ఏజెన్సీలే అన్ని ప్రాజెక్ట్‌లకు కేటాయింపులు చేస్తుంది. ప్రాజెక్ట్‌లు నమోదు, టెండర్ల ఆహ్వానం, సింగిల్ విండో క్లియరెన్స్, కేంద్ర, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యుత్ శాఖలోత నోడల్ ఏజెన్సీ సమన్వయ కర్తగా వ్యవహారించనుంది. సోలార్ ప్రాజెక్ట్ ఉత్పత్తి సంస్థలకు వంద శాతం స్టాంప్ డ్యూటీని మినహాయించారు. ఎంఎస్‌ఎంఇలకు 8ఏళ్ల వరకు ఎలక్ట్రిసిటీ డ్యూటీని వందశాతం మినహాయించారు. కాగా టిజిడిస్కాములతో నోడల్ ఏజెన్సీలు భాగస్వామ్య ఒప్పందం చేసుకుని, టిబిసిబి ఆధారిత టెండర్లను ఆహ్వానిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం థర్మల్ 14,164, సోలార్ 7889, డిస్ట్రిబ్యూటర్ రెన్యువెబుల్ ఎనర్జీ 771, వైండ్ 128, హైడ్రో 2518, న్యూక్లియర్ 211, గ్యాస్ ఆధారిత 439, ఇతర ఎన్‌సిఇ 93 మొత్తం 26,212 మెగవాట్ల సామర్థ్యం కలిగి ఉన్నది. కాగా మొత్తం 2029 30 సంవత్సరానికి గాను 49,104 మెగవాట్ల విద్యుత్ సామర్థ్యం , 203435 సంవత్సరానికి గాను 66,694 మెగావాట్ల సామర్థ్యం పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసుకున్నది.

| రకాలు.... | సామర్థ్యం (మెగావాట్లు)(2029–30) | సామర్థ్యం (మెగావాట్లు)(2034– 35) |
|---|---|---|
| థర్మల్ | 15,893 | 16,966 |
| సోలార్ | 19,874 | 26374 |
| డిస్ట్రిబ్యూటర్ రెన్యువెబుల్ ఎనరీ | 4330 | 8242 |
| వైండ్ | 2528 | 4528 |
| హైడ్రో | 2518 | 2518 |
| బ్యాటరీ ఎనర్జీ(స్టోరేజ్ సిస్టం) | 3388 | 5450 |
| పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్స్ | 417 | 2467 |
| న్యూక్లియర్ | 54 | 54 |
| గ్యాస్ ఆధారిత | 25 | 25 |
| ఇతర ఎన్‌సిఇ | 77 | 70 |
| మొత్తం | 49,104 (మెగవాట్ల సామర్థ్యం) | 66,694 (మెగావాట్ల సామర్థ్యం) |

## 'నగదు' హామీలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ప్యారీ దీదీ యోజన ద్వారా మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. మహిళలకు ప్రతినెలా రూ.2,500 అందిస్తామని బిజెపి సైతం వెల్లడించింది. తమకు నెలవారీ ఆర్థిక సాయాన్ని అందించేందుకు అన్ని పార్టీలూ సిద్ధమైనప్పటికీ, ఏ పార్టీని మహిళలు విశ్వసించబోతున్నారు అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కాగా, ఢిల్లీ ఓటర్లలోని 46.2 శాతం మంది మహిళలను ప్రసన్నం చేసుకునే దిశగా క్షేత్ర స్థాయిలో పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. దేశ రాజధాని ఢిల్లీలో మొత్తం 1,55,24,858 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 83,49,645 మంది పురుషులు, 71,73,952 మంది మహిళలు ఉన్నారు. డిసెంబర్ 16 నుంచి జనవరి 6 మధ్యకాలంలో కొత్తగా ఓటు నమోదు కోసం ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీస్‌కు 5.1 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో దాదాపు 70 శాతం దరఖాస్తులు మహిళలవే. అంటే మహిళా ఓటర్ల సంఖ్య మరింత పెరగొచ్చు. ఇదిలా ఉండగా, నెలవారీ ఆర్థిక సాయం అందించే పథకంపై రాజకీయ పార్టీల ఆలోచన ఒకలా ఉంటే, మహిళా ఓటర్ల మనసులో మాట మరోలా ఉంది. కొంతమంది ఢిల్లీ మహిళలు ఈ స్కీమ్ అమలు కాకపోవచ్చని సందేహం వెలిబుచ్చుతున్నారు. నిధుల కొరత సాకుతో నెలవారీ ఆర్థిక సాయం స్కీమ్‌ను అటకెక్కించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఈ స్కీమ్‌ను ప్రారంభించినా, దీర్ఘకాలం పాటు కొనసాగించకపోవచ్చని మరికొందరు మహిళలు అంటున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం నడుచుకునే పార్టీ ఏది? నెలవారీ ఆర్థిక సహాయ పథకాన్ని తప్పకుండా అమలు చేయగల పార్టీ ఏది? అనే ప్రశ్నలకు సమాధానాలను వెతికే పనిలోనే తాము ఉన్నామని ఢిల్లీ మహిళలు చెబుతున్నారు. పోలింగ్ తేదీ రోజు వాటికి సమాధానాన్ని తామే చెబుతామని పేర్కొంటున్నారు.

### ఢిల్లీ మహిళలు ఏమన్నారంటే?

'నెలకు రూ.2,500 వస్తే మా పిల్లల పుస్తకాల ఖర్చులకు, ఇతర అత్యవసరాలకు పనికొస్తాయి. అయితే ఇది ఎన్నికల వాగ్దానమే. అమలు కాకపోవచ్చు' అని తూర్పు ఢిల్లీకి చెందిన గృహిణి నిషా వర్మ తెలిపారు. 'మహిళల సంక్షేమం గురించి రాజకీయ పార్టీల ఆలోచన బాగుంది. అయితే మహిళలకు ఉద్యోగావకాశాలను సృష్టించడంపై, వారికి భద్రతను కల్పించడంపైనా దృష్టి సారించాలి. ప్రతినెలా డబ్బులిస్తే మహిళలకు సంబంధించిన సమస్యలన్నీ పరిష్కారం కావు' అని దక్షిణ ఢిల్లీకి చెందిన యువ ప్రొఫెషనల్ ప్రియా శర్మ చెప్పారు. 'నేను చిన్న వ్యాపారం చేసుకుంటున్నాను. నా లాంటి వాళ్లకు నెలవారీ ఆర్థిక సహాయ స్కీమ్ ఉపయోగపడుతుంది. ఎన్నికల కంటే ముందు ఈ స్కీమ్‌ను ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడే దీన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నారు?' అని పాత ఢిల్లీ నివాసి రుఖ్సర్ అన్సారీ ప్రశ్నించారు. 'నెలవారీ సాయం చేస్తే మాకు మేలు జరుగుతుంది. నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. కొంతమేర ఇంటి సామగ్రికి ఆ డబ్బును ఖర్చు చేస్తాం. మా పిల్లల విద్యా అవసరాలను తీర్చుకుంటాం. మహిళల ఆరోగ్య సంరక్షణపైనా పార్టీలు దృష్టి పెట్టాలి' అని పశ్చిమ దిల్లీకి చెందిన గృహిణి ఆశా కుమారి పేర్కొన్నారు. 'నాలాంటి ఆదాయ వనరులు లేని మహిళలకు నెలవారీ సహాయ స్కీమ్ ఉపయోగపడుతుంది. దానివల్ల మాకు కొంచెం ఆర్థిక స్వాతంత్ర్యం లభిస్తుంది. అయితే ఈ పథకాన్ని అమలు చేయడానికి నిత్యావసరాల ధరలను, పన్నులను ప్రభుత్వం పెంచకూడదు' అని ఢిల్లీలోని రోహిణి ఏరియాకు చెందిన సీనియర్ సిటిజన్ గీతా దేవి తెలిపారు.

## పూర్తి కాని రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

వద్ద తెచ్చిన అప్పులకే సరిపోయాయి. పంట సాగుకు తాము తీసుకున్న రుణం మాఫీ అయితే తిరిగి కొత్త రుణం తీసుకొని పెట్టుబడి పెట్టే అవకాశం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. సూర్యాపేట జిల్లాలో రైతు రుణమాఫీ కింద 1,42,726 మంది రైతులను అధికారులు అర్హులుగా గుర్తించారు. వీరికి సంబంధించిన మొత్తం రుణమాఫీ రూ.2,135.96 కోట్లుగా నిర్ధారించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అధికారులు పంపగా నేటి వరకు ప్రభుత్వం నాలుగు విడతలుగా 1,10,342 మందికి 906.06 కోట్లు మాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇదీలా ఉంటే 2024 నవంబర్ 30న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా నాల్గవ విడత రుణమాఫీని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించగా జిల్లాలో 15009 మంది రైతులకు సంబంధించి 159.98కోట్లు రుణం మాఫీ అయినట్లు అధికారికంగా సంబంధిత అధికారులు వెల్లడించారు. నేటికి 40 రోజులు గడుస్తున్నా దీనికి సంబంధించిన నిధులు బ్యాంకులకు విడుదల చేయకపోవడంతో రుణమాఫీ జరిగిన రైతు ఖాతాలో ఆ డబ్బులను జమ కాలేదు. రుణమాఫీ ప్రకటన రాగానే సంతోషంగతో ఉన్నా రైతులకు నేటికి నిరాశే మిగిలింది. ఇది ఇలా ఉంటే ప్రభుత్వం పంట సాగు సమయంలో రైతులకు రెండు దఫాలుగా అందించే రైతు భరోసా కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అందలేదు. గత పాలకులు అందించిన రైతు బంధులో నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ కమిటీలు వేసి సాగు చేసే భూమికి మాత్రమే రైతు భరోసా ఇస్తామంటూ సాగదీత దొరణిని ప్రభుత్వం అవలంభిస్తుండడంతో ఇదికూడా అందని ద్రాక్షలా మారింది.

**ఆందోళనలో రైతులు...**

పంట సాగుకు పెట్టుబడి లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క రుణమాఫీ, మరో పక్క రైతు భరోసా అందకపోవడంతో వారి చేతిలో చిల్లిగవ్వలేక ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రుణాల కోసం బ్యాంకులకు వెళ్తే అధికారులు పాత అప్పులు తీర్చలేదు.. కొత్త అప్పులు ఏలా ఇస్తామని ముఖంమీదే చెప్పడంతో రైతులు ఇక చేసేది ఏమి లేక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుతెచ్చి పంట సాగు చేస్తున్నారు. పంట రుణమాఫీ పక్కకు పెడితే రైతు భరోసాను అయినా అందుతుందనీ ఆశగా ఉన్న రైతులకు నేటికి అందే సూచనలు కనబడడం లేదు. మొదట సంక్రాంతికి అందిస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు తిరిగి జనవరి 26కు ఇస్తామని ప్రకటించినా రైతుల్లో మాత్రం ఆశలు సన్నగిల్లుతున్నాయి. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు లేకుండా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసి రైతుభరోసాను అందిస్తే తప్పా రైతులు కష్టాల నుండి బయటపడే అవకాశాలు లేవని రైతు సంఘాల నాయకులు చెప్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com